# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 16 ఏప్రిల్ 2025 | సంపుటి: 9 | సంచిక: 109 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## రామాలయానికి రక్షణ గోడ



గర్భగుడి శిఖరంపై భారీ కలశ ప్రతిష్ఠాపన 2

## మీనాక్షి ఆలయానికి ధీటుగా భద్రకాళి గుడి



2

స్టాలిన్ సంచలనాత్మక నిర్ణయం

# రాష్ట్ర స్వయం ప్రతిపత్తిపై కమిటీ



**ముగ్గురు సభ్యుల హై లెవల్ కమిటీని ఏర్పాటు చేసిన తమిళనాడు**

**అసెంబ్లీ రూల్ నెంబర్ 110 కింద ప్రకటించిన తమిళ సీఎం స్టాలిన్**

చెన్నై, ఏప్రిల్, 15: సుప్రీంకోర్టు ఆదేశాలతో పెండింగ్ లో ఉన్న 10 బిల్లులకు గవర్నర్ ఆమోదం లేకుండానే గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన తమిళనాడు ప్రభుత్వం మంగళవారంనాడు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలను సూచించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ అసెంబ్లీలో ప్రకటించారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల ఈ ఉన్నత స్థాయి కమిటీ .. కేంద్ర- రాష్ట్ర సంబంధాలు, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి, సమాఖ్య విధానంపై రాజ్యాంగ ప్రస్తావనలు, నిబంధనలు, చట్టాలు, విధానాలను సమీక్షించి తగు సిఫారసులను చేస్తుంది. ప్రధానంగా రాష్ట్ర స్వయం ప్రతిపత్తి, రాష్ట్రాలకు గల హక్కులపై ఇది దృష్టి కేంద్రీకరించి చట్టపరమైన అంశాలను అధ్యయనం చేస్తుందని ముఖ్యమంత్రి సభలో వెల్లడించారు. వివిధ అంశాలపై తమిళనాడుకు, కేంద్రానికి మధ్య విభేదాలు నెలకొన్న నేపథ్యంలో స్టాలిన్ తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ...మిగతా 2లో

# రేవంత్ సర్కారును పడగొట్టమంటున్నరు

## బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ఎమ్మెల్యేల కొనుగోళ్లకు డబ్బులు కూడా ఇస్తామన్నరు

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సంచలన ప్రకటన



- ప్రభాకర్ నోటివెంట కేసీఆర్ మాటలు: మంత్రి పొంగులేటి
- ఆయనకు జ్యోతిషం తెలుసన్న విషయం మాకు తెల్వదు: మంత్రి పొన్నం
- ప్రభుత్వ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటం : పీసీసీ చీఫ్ మహేశ్
- ఈ ప్రకటనపై విచారణ చేయించాలె : అద్దంకి దయాకర్

హైదరాబాద్, మనం బ్యూరో: బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలలో కలకలం రేపుతున్నాయి. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలని అంటున్నారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అందుకు అవసరమైతే ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలనీ, ఆ ఖర్చును తామే భరిస్తామంటున్నారని పిల్లల నుంచి పెద్దల దాకా అందరూ కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో త్వరలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని జోస్యం చెప్పారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోమనీ, ఇక్కడ ఎవరూ చేతులు కట్టుకుని కూర్చోలేదంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ ఘాటుగా స్పందించారు. ఈ మేరకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ చోటామోటా కాంట్రాక్టర్లు కూల్చితే కూలే ప్రభుత్వం కాదనీ, ఇది ప్రజలు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకున్న ప్రభుత్వమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని యధేచ్చగా దోచుకుందనీ, ...మిగతా 2లో



# గీత దాటొద్దు

## ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదు

2

- ఎమ్మెల్యేలు పార్టీ లైన్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ
- మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం నిర్ణయమే ఫైనల్
- శాసన సభ్యులు జూన్ 2 వరకు గ్రామాల్లో పర్యటించాలె
- నేను కూడా మే 1 నుంచి క్షేత్రస్థాయి పర్యటనలు చేస్త
- వీకెండ్ రాజకీయాలు కాదు.. ప్రజల్లో ఉండండి
- సన్నబియ్యం పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



### తృటిలో తప్పిన ప్రమాదం

ముఖ్యమంత్రికి తృటిలో ప్రమాదం తప్పింది. నోవాటెల్ హోటల్‌లో సీఎల్పీ సమావేశం పూర్తయిన అనంతరం కిందకు వస్తుండగా, సీఎం ఎక్కిన లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో లిఫ్ట్ మొరాయించింది. ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తు కంటే లోపలికి దిగింది. వెంటనే అప్రమత్తమైన హోటల్ సిబ్బంది, సీఎం సెక్యూరిటీ సిబ్బంది లిఫ్ట్‌ను ఓపెన్ చేసి వేరే లిఫ్ట్‌లో సీఎంను కిందకు పంపించారు.

### జపాన్‌కు బయల్దేరిన సీఎం

2

- టోక్యో, మౌంట్ పుజి, ఒసాకా, హిరోషిమాలో పర్యటించనున్న రేవంత్ టీం
- ఒసాకా వరల్డ్ ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్ ప్రారంభం

# ఆర్టీసీలో 3,038 ఉద్యోగాల భర్తీ

- ప్రభుత్వం గ్రీన్ సిగ్నలిచ్చిందన్న సంస్థ ఎండీ సజ్జనార్
- ఈ పోస్టుల భర్తీలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తం



హైదరాబాద్, మనం ప్రతినిధి: త్వరలో తెలంగాణ ఆర్టీసీలో కొలువుల జాతర మోగనుంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం. నేడో, రేపో భర్తీ ప్రకటన రానున్నట్టు సమాచారం. ఇటీవల ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ వైస్ ఛైర్మన్, ఎండీ సజ్జనార్ టీజీఆర్టీసీలో త్వరలో 3,038 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు ప్రభుత్వం నుంచి ...మిగతా 2లో

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని ఎంపికకు

# తొందరేమీ లేదు

### భూములు, మద్యం విక్రయాలు, అప్పలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నరు

- హెచ్‌సీయూ అంశంలో కేసు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం మాకు లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



హైదరాబాద్,మనం బ్యూరో: భూములు, మద్యం విక్రయాలు, అప్పులతోనే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. భూముల అమ్మకం విషయంలో కాంగ్రెస్ గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోటీపడుతోందని వ్యాఖ్యానించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు తొందరేమీ లేదనీ, ఎన్నికకు మరో వారం రోజులు సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడి ప్రతిపాదనల్లో తన ...మిగతా 2లో



# టోల్ సమస్యలకు చెక్

### కొత్త పాలసీపై ప్రకటన చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

ముంబై, ఏప్రిల్ 15: మా నాయకుడు మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త టోల్ తో ఇబ్బందులన్నీ తొలగిపోతాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టబోతున్న టోల్ విధానంలో శాటిలైట్ ట్రాకింగ్, వెహికిల్ నంబర్ ప్లేట్ గుర్తింపు తదితర సాంకేతికను సైతం ఉపయోగించనున్నట్లు ప్రకటించారు. దాంతో నేరుగా బ్యాంకు ఖాతా నుంచి టోల్ మొత్తం డెబిట్ అవుతుందని.. ఇక మాన్యువల్ గా టోల్ వసూలు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. ముంబయి దాదర్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలోనే దేశవ్యాప్తంగా టోల్ బూత్లను తొలగిస్తామని పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం కొత్త టోల్ విధానంపై పనిచేస్తోందని, ఇది త్వరలో అమలు చేయబడుతుందని ఆయన అన్నారు. ...మిగతా 2లో

# సరస్వతి పుష్కరాల పోర్టల్ ఆవిష్కరణ

## మే 15 నుంచి 12 రోజుల పాటు పుష్కరాలు

### ఏర్పాటు కానున్న 17 అడుగుల విద్యాదేవత విగ్రహం

### కాశీ పండితులతో ప్రత్యేక హోమాలు, హారతులు, పూజలు




హైదరాబాద్, ఏప్రిల్ 15: తెలంగాణలో మే 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలను జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో సరస్వతి పుష్కరాల వెబ్ పోర్టల్ ను తెలంగాణ దేవాయదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. పుష్కరాలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. మంత్రి శ్రీధర్ బాబు పుష్కరాల యాప్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ విలేకర్లతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ...మిగతా 2లో

# నేను రౌడీ టైప్

### మా కార్యకర్తలను బెదిరించే ఎవరినైనా వదిలిపెట్టం

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజం



హైదరాబాద్, మనం ప్రతినిధి: నేను కొంచెం రౌడీ టైప్.. అన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఎవరైనా బెదిరింపులకు గురి చేస్తే సహించేది లేదని, వారి పేర్లను 'పింక్ బుక్'లో రాసి పెడతామని తనదైన శైలిలో తీవ్రంగా హెచ్చరించారు. బాన్సువాడ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ, పార్టీ వార్షికోత్సవ వేడుకలకు హాజరైన.. కవిత.. కొందరు కాంగ్రెస్ నేతల తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు కొందరు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారనే సమాచారం తనకు అందిందని తెలిపారు. 'ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లు బరాబర్ పింక్ బుక్‌లో రాస్తాం.. వారిని ఎట్టి పరిస్థితుల్లో కూడా విడిచి పెట్టేదైతే లేదని తెగేసి చెప్పారు. కార్యకర్తలు.. ఏమీ ఆలోచించవద్దు, ...మిగతా 2లో

### సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో

# అడ్మిషన్లు

ప్రవేశ పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు మాత్రమే

టీజీఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్ కార్యదర్శి డా.అలగు వర్షిణి

2

## దేశంలోనే.. తొలిసారిగా

# తెలంగాణలో ఫైర్ ఫైటింగ్ రోబోలు

### 1000 సెంటిగ్రేడ్ వేడిని తట్టుకునే సామర్థ్యం

### అధిక ప్రమాదకర ప్రాంతాల్లో వినియోగించే వెసులుబాటు

### సిబ్బంది భద్రతకు పెద్దపీట వేస్తూ కొత్త సాంకేతికత



హైదరాబాద్, మనం ప్రతినిధి: రాష్ట్ర అగ్నిమాపక శాఖ చరిత్రలో నూతన అధ్యాయం మొదలైంది. దేశంలోనే మొట్టమొదటిసారిగా, అత్యంత ప్రమాదకరమైన అగ్నిప్రమాదాలను ఎదుర్కోవడానికి తెలంగాణ ప్రభుత్వం అధునాతన ఫైర్ ఫైటింగ్ రోబోలను అందుబాటులోకి తెచ్చింది. సిబ్బంది ప్రాణాలకు ముప్పు వాటిల్లే క్లిష్ట పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ఈ రోబో యంత్రాలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ప్రారంభ దశలో భాగంగా, ఫ్రాన్స్ నుంచి మూడు అత్యాధునిక రోబోలను అగ్నిమాపక శాఖ సమకూర్చుకుంది. ఒక్కో రోబో విలువ సుమారు రూ. 2 కోట్లు కాగా, ...మిగతా 2లో

## నేషనల్ హెరాల్డ్ కేసు..

## సోనియా, రాహుల్ పేర్లతో

# ఈడీ ఛార్జిషీట్




- ఇది మోడీ ప్రభుత్వ ప్రాయోజిత నేరమని కాంగ్రెస్ వ్యాఖ్య
- సత్యమేవ జయతే: జైరాం రమేశ్
- ప్రతీకారంతో, విపక్ష నేతలను ఉచ్చులో పడేసే బీజేపీ కుట్రలో భాగం : అఖిలేష్ ప్రసాద్ సింగ్

ఢిల్లీ, ఏప్రిల్ 15: 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేసింది. దీనిలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ ఓవర్సీస్ యూనిట్ చీఫ్ శామ్ పిట్రోడా పేర్లను పేర్కొంటూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. దీనిపై ఏప్రిల్ 25న ఈ ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. సోనియా, రాహుల్ పై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే తొలిసారి. హర్యానాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ...మిగతా 2లో

## మీనాక్షి ఆలయానికి ధీటుగా భద్రకాళి గుడి

వరంగల్, ఏప్రిల్ 15: వరంగల్ భద్రకాళి ఆలయాన్ని తమిళనాడు మధురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయం తరహాలో అభివృద్ధి చేయడంలో భాగంగా నాలుగు మాడ వీధులను విస్తరిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనలతో రూ.54 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

# సోనియా, రాహుల్ పేర్లతో ఈడీ ఛార్జిషీట్

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించి.. ఈ నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్న వారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్న వారు ఇక నుంచి తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియను చేస్తున్నామని తెలిపింది. ఢిల్లీ, ముంబై, లక్నోల్లోని భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది.

**సత్యమేవ జయతే: జైరాం రమేశ్**

నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడమనేది చట్టబద్ధమైన పాలన ముసుగులో ప్రభుత్వ ప్రాయోజిత నేరంగా కాంగ్రెస్ పేర్కొంది. తమ పార్టీ అగ్రనేతలపై ఛార్జిషీట్ దాఖలు చేయడం.. ప్రధాని, హోంమంత్రి ప్రతీకార రాజకీయాలు, బెదిరింపులకు పాల్పడటం తప్ప మరొకటి కాదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ, నాయకత్వం మౌనంగా ఉండబోవన్న ఆయన.. 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

**బీజేపీ కుట్రలో భాగమే: అఖిలేష్ ప్రసాద్ సింగ్..**

దీనిపై ఆ పార్టీ ఎంపీ అఖిలేశ్ ప్రసాద్ సింగ్ మాట్లాడుతూ.. ప్రతీకారంతో, విపక్ష నేతలను ఉచ్చులో పడేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కానీ, ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ భయపడబోదని చెప్పారు.

# రామాలయానికి రక్షణ గోడ

**అయోధ్య, ఏప్రిల్ 15:** అయోధ్యలో రామాలయం చుట్టూ 4 కిలోమీటర్ల ప్రహరీ గోడను నిర్మించనున్నట్లు శ్రీరామ జన్మభూమి ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్పర్సన్ నృపేంద్ర మిశ్ర వెల్లడించారు. గోడను ఇంజనీర్స్ ఇండియా సంస్థ నిర్మిస్తుందని, దాని ఎత్తు, మందం, డిజైన్ వంటి విషయాలను నిర్ణయించామని, మట్టి పరీక్షలు నిర్వహించాక పని ప్రారంభిస్తామని తెలిపారు. ఆలయ నిర్మాణ కమిటీ సమావేశం మూడోరోజు ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు చెప్పారు. ఆలయ నిర్మాణంలో పురోగతి, కొత్తగా చేసిన భద్రతా ఏర్పాట్లు, విగ్రహాల ప్రతిష్ఠాపన, ఆలయ పరిసరాల్లో అభివృద్ధి వంటి విషయాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. మందిర నిర్మాణం మరో ఆరు నెలల్లో అన్నివిధాలా పూర్తి కాబోతోందని మిశ్ర తెలిపారు. రామాలయ సముదాయంలోనే 10 ఎకరాల్లో ధ్యాన మందిరాన్ని నిర్మిస్తామని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యం కోసం మరో పదెకరాల విస్తీర్ణంలో 62 స్టోరేజీ కౌంటర్లను, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. సప్త మండల ఆలయాలకు సంబంధించిన విగ్రహాలన్నీ జైపుర్ నుంచి ఆయా ఆలయాలకు చేరుకున్నాయని వెల్లడించారు.

**రామాలయానికి బెదిరింపులు**

అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అధికారిక మెయిల్ ఐడీకి ఆదివారం రాత్రి బెదిరింపు ఈ-మెయిల్ రావడం కలకలం రేపింది. భద్రతను మరింత పెంచారు. దీనిపై ఆలయ అధికారులు, పోలీసులు ఎలాంటి ప్రకటన చేయలేదు.

**గర్భగుడి శిఖరంపై భారీ కలశం**

రామాలయంలోని గర్భగుడి ప్రధాన శిఖరంపై భారీ కలశాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. 'కలశ పూజా విధి' నిర్వహించారు. ఆలయ సముదాయంలో నిర్మిస్తున్న 6 దేవాలయాల పైభాగంలో కూడా కలశాలను మరికొద్ది రోజుల్లో ఏర్పాటు చేయనున్నారు.

## ఆర్టీసీలో 3,038 ఉద్యోగాల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు ఆయన తెలిపారు. వీటి భర్తీ తర్వాత ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులపై పనిభారం తగ్గుతుందని చెప్పారు. కొత్తగా భర్తీ చేయనున్న పోస్టులకు ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామన్నారు. సంస్థలోని ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉందని సజ్జనార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఖుస్రోషా ఖాన్, వెంకన్న, మునిశేఖర్, రాజ్శేఖర్, జాయింట్ డైరెక్టర్లు ఉషాదేవి, నర్మద, రంగారెడ్డి జిల్లా రీజినల్ మేనేజర్ శ్రీలత, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

# రేవంత్ సర్కారును పడగొట్టమంటున్నర

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీకి అమ్ముడు, కొనుగోలుపై అనుభవం ఉందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సంతలో పశువులు కాదని కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ నేతలకు కనీస గౌరవం లేదనీ, ప్రభుత్వ పెద్దలతో చర్చించి కొత్త ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ తన వ్యాఖ్యలనే తన ఆత్మ ప్రభాకర్ రెడ్డితో మాట్లాడించారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్ర జరుగుతోందనీ, దీనిపై విచారణ జరిపే ఆలోచన చేస్తామని తెలిపారు. రూ.వేల కోట్లతో రాజకీయం చేయాలని బీఆర్ఎస్ చూస్తున్నదనీ, ఎప్పుడు వేసే పాత క్యాసెట్నే తిరిగి బీఆర్ఎస్ వేస్తోందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొత్త ప్రభాకర్ రెడ్డికి ట్రాన్స్పోర్ట్ బిజినెస్ ఉందన్న విషయం తెలుసనీ, కానీ, ఆయనకు జ్యోతిషం కూడా తెలుసనే విషయం తనకు తెలియదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. పడగొడదాం రండీ అంటే పోవడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సిద్ధంగా లేరని ఈ సందర్భంగా మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కొత్త ప్రభాకర్ రెడ్డికి నార్కో అనాలసిస్ టెస్ట్ చేయించాలనీ, సిగ్గు శరం లేకుండా ఏది పడితే అది మాట్లాడుతున్నాడని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఆయన చేసిన వ్యాఖ్యలపై విచారణ చేయాలనీ, నిజాలు చెప్పించాలని అద్దంకి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# సరస్వతి పుష్కరాల పోర్టల్ ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

యాదగిరి గుట్ట మినహా మిగతా దేవాలయాలను నిర్లక్ష్యం చేసిందన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. దేవాలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. రూ. వంద కోట్లు దాటిన ఆలయాలను పాలక మండలి కిందకు తీసుకువస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు. అలాగే టెంపుల్ టూరిజం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే ఈ సరస్వతి పుష్కరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పుష్కరాల సందర్భంగా రూ. 35 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. ఇక 17 అడుగుల సరస్వతి విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. పుష్కరాలు జరిగే 12 రోజులపాటు కాశీ నుంచి వచ్చిన పండితులతో ప్రత్యేక హోమాలు, హారతి నిర్వహిస్తామని తెలిపారు.

## టోల్ సమస్యలకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం వివరాలన్నీ ఇప్పుడే చెప్పలేనని.. మరో 15 రోజుల్లో కొత్త టోల్ పాలసీని ప్రకటించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత టోల్ సిస్టు ఫిర్యాదులు ఉండవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంబయి-గోవా హైవే నిర్మాణ పనులు జూన్ వరకు పూర్తవుతాయన్నారు. ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్న హైవే ఇదని.. పనులు పూర్తయితే ప్రజలకు, కొంకణ్ వైపు వెళ్లేవారికి ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. దేశ మౌలిక సదుపాయాల మాట్లాడుతూ రాబోయే రెండేళ్లలో భారత రోడ్లు మెరుగ్గా మారుతాయని గడ్కరీ పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో హైవేలు, రోడ్నెట్వర్క్ మెరుగవడం చాలా కీలకమని.. ఈ దిశగా ప్రభుత్వం వేగంగా పని చేస్తుందన్నారు. ముంబయి-గోవా మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారి ఈ రెండు ప్రదేశాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని తెలిపారు. కొంకణ్ ప్రాంతంలో అభివృద్ధి వేగానికి కొత్త ఊపునిస్తుందని.. చాలా కాలంగా అసంపూర్తిగా ఉన్న ఈ ప్రాజెక్టును పూర్తి చేయడంలో అనేక అడ్డంకులు ఎదురయ్యాయన్నారు.

జూన్ నాటికి రోడ్డు నిర్మాణ పనులు వందశాతం పూర్తి చేస్తామన్నారు. భూసేకరణ, కోర్టు కేసులు, పరిహారం సంబంధిత సమస్యలపై వివాదాల కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. ప్రస్తుతం, వివాదాలన్నీ పరిష్కారమయ్యాయని.. పనులు ఊపందుకున్నాయన్నారు. దేశ మౌలిక సదుపాయాలలో ఉన్న సవాళ్లపై స్పందిస్తూ.. ఢిల్లీ-జైపూర్, ముంబయి-గోవా వంటి హైవేలు ఇప్పటికీ రోడ్లు రహదారులశాఖకు 'బ్లాక్ స్పాట్స్'గా పేర్కొన్నారు. నిజాలు చెబితే ప్రజలు నమ్మకపోవచ్చునని వ్యాఖ్యానించా

# రేవంత్ ప్రభుత్వం.. ఐదేళ్లు కొనసాగాలి?

- ఈ ప్రభుత్వం పూర్తి కాలం కొనసాగాలని కేసీఆర్ కోరుకుంటుండ్రు?
- ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నాలు ఎప్పుడూ చేయలేదు?
- ఇక ముందు కూడా చేయబోము : కొత్త ప్రభాకర్ రెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లు పూర్తికాలం కొనసాగాలని తాను కోరుకుంటున్నానని బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి కాలం కొనసాగాలని తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు కూడా ఆకాంక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రభుత్వాన్ని పడగొట్టాలని తాము ఎప్పుడూ ప్రయత్నించలేదని ఆయన స్పష్టం చేశారు. ఇక ముందు కూడా ఆ ప్రయత్నాలు చేయబోమని తేల్చి చెప్పారు. గజ్వేల్లో మాత్రమే కాకుండా, తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడ భూదందాలు జరిగినా ప్రభుత్వం వెలికి తీయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఈ ప్రభుత్వాన్ని కూల్చివేయాలని కొంతమంది తమతో చెప్పారని కొత్త ప్రభాకర్ రెడ్డి రెండు రోజుల క్రితం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయన మరోసారి స్పందించారు.

# రాష్ట్ర స్వయం ప్రతిపత్తిపై కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

చర్చనీయాంశమైంది. కమిటీ ఏర్పాటుపై అసెంబ్లీలో వెల్లడించిన సందర్భంగా 'కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తోంద'ని స్టాలిన్ ఆరోపించారు. ఎన్ఈపీని రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకిస్తుండటంతో ప్రతీకార చర్యగా రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన రూ.2,500 కోట్ల నిధులను కేంద్ర నిలిపేసిందని ఉన్నారు. ''నీట్ పరీక్షల వల్ల చాలామంది విద్యార్థులను మనం కోల్పోయాం. మనం మొదట్నించీ నీట్ పరీక్షలను వ్యతిరేకిస్తూ వస్తున్నాం. త్రిభాషా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం తమిళనాడుపై హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తోంది. ఎన్ఈపీని కాదన్నందుకు రూ.2,500 కోట్లను కేంద్రం విడుదల చేయకుండా ఆపేసింది'' అని సీఎం అన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రాలు, కేంద్రం మధ్య సంబంధాలను మెరుగుపరచేందుకు అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. దీనిపై కమిటీ రీసెర్చ్ చేసి నివేదిక అందిస్తుందన్నారు. అసెంబ్లీ రూల్ నెంబర్ 110 కింద ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. ఈ నిబంధన కింద ముఖ్యమంత్రి లేదా మంత్రి చేసే ప్రకటనపై తమ అభిప్రాయాన్ని చెప్పే హక్కు విపక్షాలకు ఉండదు.

**జనవరిలో మధ్యంతర నివేదిక..**

రాష్ట్ర ప్రతిపత్తిపై ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ఇద్దరు ప్రభుత్వ అధికారులు అశోక్ షెట్టి, ఎంయు నాగరాజన్ సభ్యులుగా ఉంటారు. 2026 జనవరిలో కమిటీ మధ్యంతర నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. సమగ్ర సిఫారసులతో కూడిన తుది నివేదికను రెండేండ్లలోపు సమర్పిస్తుంది.

# గీత దాటొద్దు

హైదరాబాద్, మనం బ్యూరో: పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగేలా మాట్లాడితే మీకు జరిగే లాభం కంటే నష్టమే ఎక్కువని వ్యాఖ్యానించారు. మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అనీ, దీనిపై ఎవరేం మాట్లాడినా ఫలితం ఉండదని పేర్కొన్నారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శంషాబాద్ నోవాటెల్ హోటల్లో సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీ, భూభారతి, మంత్రివర్గ విస్తరణపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణ తమకు మంత్రి పదవుల అంశంపై ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రేమ్సాగర్ రావు ఇటీవల చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుంది. మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నేటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు ప్రతీ గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వంపై నెగెటివ్ ప్రచారం చేస్తుంటే ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్కే పరిమితమవుతున్నారనీ, వీకెండ్ రాజకీయాలు చేయొద్దని సూచించారు. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ట పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోడీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తెలంగాణ మోడల్పై దేశంలో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం. మన పేటెంట్, మన బ్రాండ్ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

**జపాన్కు బయల్దేరిన సీఎం**

హైదరాబాద్, మనం బ్యూరో: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం జపాన్ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. సీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం శంషాబాద్ విమానాశ్రయం నుంచి సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం నేటి నుంచి ఈనెల 22 వరకు జపాన్లోని టోక్యో, మౌంట్ఫుజి, ఒసాకా, హిరోషిమాలో పర్యటించనుంది. జపాన్ పర్యటనలో భాగంగా సీఎం ఒసాకా వరల్డ్ ఎక్స్పోలో తెలంగాణ పెవిలియన్ను ప్రారంభించనున్నారు. అలాగే, అక్కడి ప్రముఖ కంపెనీలు, పారిశ్రామికవేత్తలతో సమావేశాలు నిర్వహిస్తారు. పెట్టుబడులు, పారిశ్రామిక సాంకేతిక సహకారంపై పలువురు ప్రతినిధులతో ముఖ్యమంత్రి బృందం సమావేశమై చర్చలు జరుపుతుంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక సాంకేతిక సహకారంపై ప్రధానంగా జపాన్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం చర్చలు జరుపనుంది.

## కాంగ్రెస్‌కి.. రక్షణ కవచం బీజేపీ

హైదరాబాద్, మనం ప్రతినిధి: ఈనెల 27న వరంగల్ లో జరుపతలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశం మంగళవారం గోపాల్ పేటలో జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ రాష్ట్రానికి అండ కేసీఆర్ గులాబీ జెండా అని బీజేపీ,కాంగ్రెస్ పార్టీలు చీకటి స్నేహం చేస్తూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని అన్నారు. అందుకే తెలంగాణ అస్తిత్వం కాపాడేది కేసీఆర్ అని అన్నారు. పాలమూరు ముద్దుబిడ్డను అని చెప్పుకొనే రేవంత్ రెడ్డి.. కేవలం 600కోట్లు ఖర్చు పెడితే 12లక్షల ఎకరాలకు సాగు నీళ్ళు ఇవ్వవచ్చని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ ఏర్పాటులో నిబంధనలు పాటించకుండా కాంగ్రెస్ ఆర్భాటం చేస్తున్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని ఎంపికకు తొందరేమీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

పేరు లేదని స్పష్టం చేశారు. తమిళనాడులో ఎన్డీయేను పునరుద్ధరించామనీ, డీలిమిటేషన్ అంశంపై ఎక్కడా చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్ తరచూ తనపై చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ ఆయన తమ పార్టీ నేత అనీ, ఆయన అంశంపై అంతర్గతంగా చర్చించుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి బీఆర్ఎస్, బీజేపీ నేతలు కుట్రలు పన్నుతున్నారంటూ ఆ పార్టీ నేతలు చేసిన విమర్శలపై స్పందిస్తూ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం తమ పార్టీకి లేదని స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధం లేని గుజరాత్ వ్యాపారులు ప్రభుత్వాన్ని ఎందుకు కూల్చుతారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు పాలించాలనే తాము కోరుకుంటున్నామనీ, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే హస్తం పార్టీకి మిగిలేదని శూన్య హస్తమేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరనీ, ఆ పార్టీ ఓడిపోతుందనే విషయం కామన్ మ్యాన్కు కూడా తెలుసని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణలో ఫైర్ ఫైటింగ్ రోబోలు

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం రూ. 6 కోట్లను ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించినట్లు సమాచారం. త్వరలోనే ఈ రోబోలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. వీటిని తొలుత హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు, సమీపంలోని పారిశ్రామిక ప్రాంతాలు, బహుళ అంతస్తుల భవనాల్లో సంభవించే భారీ అగ్నిప్రమాదాల సహాయక చర్యల్లో వీటిని వినియోగించనున్నారు. ఈ రోబోల ప్రత్యేకత ఏమిటంటే, ఇవి దాదాపు 1000 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతను కూడా తట్టుకోగలవు. ఇందుకోసం వీటిని ప్రత్యేకమైన ఫైర్ రెసిస్టెంట్ మెటీరియల్తో తయారుచేశారు. ప్రతికూల పరిస్థితుల్లో, అధిక వేడిని గ్రహించినప్పుడు, తనంతట తానే చల్లబరుచుకునే వ్యవస్థ (సెల్ఫ్ కూలింగ్) కూడా ఇందులో ఉంది. రిమోట్ కంట్రోల్ ద్వారా వీటిని సురక్షితమైన దూరం నుంచి ఆపరేట్ చేయవచ్చు. ముందు, వెనుక భాగాల్లో అమర్చిన కెమెరాలు, హీట్ సెన్సార్ల సహాయంతో దట్టమైన పొగలో కూడా లోపలి దృశ్యాలను, ఉష్ణోగ్రత తీవ్రతను ఆపరేటర్లు స్పష్టంగా గమనించవచ్చు. ఫైర్ టెండర్ లేదా సమీపంలోని హైడ్రెంట్లకు అనుసంధానించి, వీటి ద్వారా నీటిని లేదా ఫోమ్ను అధిక పీడనంతో వెదజల్లి మంటలను ఆర్పవచ్చు.

మానవ ప్రమేయం అత్యంత ప్రమాదకరంగా మారే పరిస్థితుల్లో, ముఖ్యంగా తీవ్రమైన వేడి, భవనాలు కూలిపోయే ప్రమాదం ఉన్న ప్రదేశాలు, రసాయన పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాల్లో ఈ రోబోలు కీలక పాత్ర పోషిస్తాయని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. 'గతంలో భారీ అగ్నిప్రమాదాల సమయంలో మా సిబ్బంది తీవ్ర గాయాలపాలైన సందర్భాలున్నాయి. అధిక ఉష్ణోగ్రత, దట్టమైన పొగ వల్ల సిబ్బంది లోపలికి వెళ్లలేని సమయాల్లో ఈ రోబోలను పంపి, అక్కడి పరిస్థితిని అంచనా వేయడంతో పాటు, ఫైర్ ఫైటింగ్ చేయవచ్చు' అని ఓ అధికారి వివరించారు. ప్రమాదాల్లో చిక్కుకుపోయిన వారిని గుర్తించేందుకు, వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడానికి కూడా ఇవి దోహదపడతాయని ఆయన అన్నారు.

# సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో అడ్మిషన్లు

హైదరాబాద్, మనం బ్యూరో: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఖాళీలను బట్టి అడ్మిషన్ కల్పించడం జరుగుతుందని టీజీఎస్డబ్ల్యుఆర్ఈఐఎస్ కార్యదర్శి డా.అలగు వర్షిణి తెలిపారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వారు రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నంబరుకు ఎస్ఎంఎస్ వస్తుందనీ, అలాగే, విద్యార్థులు సీటు పొందిన పాఠశాల ప్రిన్సిపాల్కు కూడా అధికారికంగా సమాచారం ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ వెబ్సైట్లో మెరిట్ లిస్ట్ మాత్రమే అధికారిక మెరిట్ లిస్ట్గా పరిగణించాలనీ, ఇతరులు, సొసైటీకీ సంబంధం లేని వెబ్సైట్లు, అనధికారిక లిస్టులను చూపిస్తే చూసి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఆయా పాఠశాలల్లో ఖాళీలను బట్టి విద్యార్థులకు దశలవారీగా సీట్లను కేటాయించే అవకాశం ఉంటుందనీ, రౌండ్ 1 సెలక్షన్ లిస్టులో ఉన్న విద్యార్థులు, ఏప్రిల్ 20లోపు వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరాలనీ, చివరి తేదీ ముగిసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్మిషన్లు చేసుకునేందుకు అనుమతించబడదని స్పష్టం చేశారు. మెరిట్ ఆధారంగా పాఠశాలల్లో ఖాళీలను బట్టి సీట్లను కేటాయించడం జరుగుతుందనీ, ఇలా కేటాయించిన సందర్భంలో విద్యార్థులకు అనుకున్న పాఠశాలలో సీటు రాకపోయినా, ఆ తరువాత ఏర్పడే ఖాళీలను వీరి మెరిట్ ఆధారంగా తిరిగి వారు కోరుకున్న పాఠశాలలో ఎంచుకున్న ఆప్షన్ ఆధారంగా బదిలీ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా డా.అలగు వర్షిణి వెల్లడించారు.

# నేను రౌడీ టైప్

(మొదటి పేజీ తరువాయి)



మీరు.. ధైర్యంగా ఉండండి' అని భరోసా ఇచ్చారు. ఉద్యమసారథి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సార్.. మంచోడు కావచ్చు. కానీ, నేను కొంచెం రౌడీ టైప్.. ఎట్టి పరిస్థితుల్లో ఎవరిని విడిచిపెట్టేది లేదు' అని కవిత వ్యాఖ్యానించారు. కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన వారిని, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పిన వారిని.. తాను క్షమించే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. బెదిరింపులకు పాల్పడేది నాయకులైనా, అధికారులైనా ఎవరినీ వదిలిపెట్టబోమని ఆమె తేల్చి చెప్పారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎన్నడూ అరాచకాలకు పాల్పడలేదని, కేవలం అభివృద్ధి, సంక్షేమంపైనే దృష్టి సారించామని కవిత గుర్తు చేశారు. ఇప్పుడు కొందరు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్ కార్యకర్తలను భయపెట్టాలని చూడటం సరికాదన్నారు. 'మీ తాట తీస్తాం అంటే భయపడేటోళ్లు ఇక్కడ ఎవరూ లేరు. మీ తాత, ముత్తాత, జేజమ్మ దిగివచ్చినా కూడా భయపడేది లేదు' అంటూ ఆమె కార్యకర్తల్లో స్థైర్యం నింపే ప్రయత్నం చేశారు.

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ సస్యశ్యామలంగా తీర్చిదిద్దారని చెప్పడానికి ఇదిగో ఆనవాళ్లు అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ కేంద్రం సమీపంలో మంజీరా నదిపై నిర్మించిన చింతల నాగారం చెక్ డ్యామును ఆమె సందర్శించారు. మండు వేసవిలోనూ త్తుడి దుంకుతున్న ఈ చెక్ డ్యాం కేసీఆర్ తెలంగాణను పచ్చబడేయడానికి పడ్డ తపనను గుర్తు చేస్తుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో మంజీరా నదిపై ఇలాంటి నాలుగు చెక్ డ్యాంలు నిర్మించి రైతులు వాన కోసం ఎదురు చూడకుండా పంటలు పండించుకునేలా కేసీఆర్ చేశారన్నారు. ఈ ఒక్క చెక్ డ్యాం పై ఆధారపడి 1600 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు.

**మాట తప్పడం... మడమ తిప్పడమే కాంగ్రెస్ నైజం**

సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారెంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకొని.. ఇప్పుడు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని విమర్శించారు. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్ల పాటు అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీయన్నారు. ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూటగట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబుల్ ప్రైజ్ ఇవ్వాలంటూ చురకలంటించారు. ప్రతీ ఇంటి నుంచి ఒకరు రజతోత్సవ సభకు రావాలన్నారు. తెలంగాణ గడ్డ మీద అగ్గిపెట్టించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు.

# బియ్యం ఎగుమతి విధానంపై సదస్సు

- హాజరైన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**రాజేంద్రనగర్, ఏప్రిల్ 15 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రం నుంచి తొలిసారి ఫిలిప్ఫయన్స్ కు బియ్యం ఎగుమతి అవుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బియ్యం ఎగుమతి విధానం అన్న అంశంపై మంగళవారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు కి తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిధి గా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశంలోనే వరి ఉత్పత్తిలో ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని అన్నారు. ప్రస్తుత 2025-26 సంవత్సరంలో రాష్ట్రంలో సుమారుగా 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయిందని ఇది ఒక రికార్డు అని చెప్పారు. ఈ ఘనత కు రైతుల కృషి తో పాటు, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ప్రకృతి సహకారం మరియు నూతన వరి రకాలు అందుబాటులో ఉండటం కారణం అన్నారు.ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రైతాంగాన్ని అభినందించారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందనీ.. సన్న రకాలకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ తో పాటు ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రజల స్థానిక అవసరాలకు పోను, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యం పోను, కేంద్ర నిలువల కోసం సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపు లు పోగా ఇంకా సుమారు 50 నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రాష్ట్రంలో మిగులు ఉంటుందని ఆయన అన్నారు. మిగులు ధాన్యం మార్కెట్ చేయడానికి అన్వేషనలో భాగంగా ఆగ్నేయ ఆసియా ప్రాంతంలోని ఫిలిప్పైన్స్ కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడాన్ని సదావకాశంగా తీసుకొని ఆ ప్రభుత్వంతో నేరుగా అవగాహన ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి 10 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

దొడ్డు రకాలలో ముఖ్యమైన ఎం టి యు -1010, ఐ. ఆర్-64 రకాలను రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేస్తున్నారని..వీటికి ఫిలిప్పీన్స్ లో అధిక డిమాండ్ ఉందని తెలిపారు. వరి సాగు లో ఇటీవల రైతాంగంలో ఆదరణ పొందుతున్న వరి నేరుగా విత్తే పద్ధతి( డి ఎస్ ఆర్ ) రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం( ఏ డబ్ల్యు డి ), తక్కువ రసాయనాలు కలిగిన వరి రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. అదేవిధంగా ఎగుమతికి అనుకూలమైన వరి రకాలను ఉత్పత్తి చేయడానికి రైతులకు తగిన ప్రోత్సాహకాలు, ఎగుమతి దారులకు విధానపరమైన ప్రోత్సాహకాలు ఇస్తామని ఆయన ప్రకటించారు. అధునాతన బియ్యం మిల్లులను ఒక డెమో రూపంలో ఆధునిక రైస్ మిల్లును వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి రైతులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఆధునిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని.. ఎన్నటికీ స్వయం సమృద్ధి సాధించే దేశం కాదు కాబట్టి ఆ దేశాన్ని తెలంగాణ బియ్యానికి అనుకూలమైన మార్కెట్ గా గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లయితే తెలంగాణలో పండుతున్న బియ్యం నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరికినట్లేనని చెప్పారు. అంతేకాకుండా, ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ కేంద్రాల నుంచి బియ్యం ఔత్సాహిక ఎగుమతి దారులకు సరఫరా చేసినట్లయితే ప్రభుత్వానికి అయ్యే ఖర్చుకు సమానంగా ఔత్సాహికదారులకు ఇచ్చినట్లయితే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే ఎగుమతులను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని మంత్రి సూచించారు. అఖిలభారత రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బి కృష్ణారావు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, అపెడా అధికారులు, రైతు నాయకులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం, వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ రాజు, వరల్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత మరియు ఇటీవల విశ్వవిద్యాలయం నియమించిన యు జి సి ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ డాక్టర్ సమరేందు మహంతి ఎగుమతుల విధానం అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు.

# తక్కువ ధరలకు ధాన్యాన్ని మిల్లర్లకు అమ్ముకోవద్దు



- 500 బోనస్ తో కలిపి 2820 రూపాయలు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- పి.ఏ.సి.ఎస్ చైర్మన్ జుట్టుకుండా సత్యనారాయణ

**గరిడేపల్లి,ఏప్రిల్ 15,(మనం న్యూస్):** రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండించి మిల్లర్ల మాయమాటలు నమ్మి తక్కువ ధరకు అమ్ముకొని మోసపోవద్దని గరిడేపల్లి మండల తహసిల్దార్ బండ కవిత రెడ్డి,రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జుట్టు కొండ సత్యనారాయణ(జె.ఎస్) అన్నారు.మండలంలోని రాయిని గూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కీతవారిగూడెం లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు.2200 రూపాయల కే రైతులు రైసు మిల్లర్ల మాటలు విని ధాన్యాన్ని మిల్లర్లకు కట్టబెడుతున్నారని అన్నారు.రైతులు కల్లాల దగ్గరనే ఆరబెట్టుకొని తెచ్చిన ధాన్యానికి 2320 రూపాయలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్టుగా 500 రూపాయల బోనస్ తో కలిపి 2820 రూపాయలు వారం రోజుల లోపల రైతు ఖాతాలో జమ అయితాయని వారు తెలిపారు.రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకొని తమ ధాన్యాన్ని అధిక ధరలకు అమ్ముకోవాలని వారు రైతులను కోరారు.

కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, సంఘం డైరెక్టర్లు వీరస్వామి, మంగళగిరి కృష్ణ, పెమ్మగాని వెంకటేశ్వర్ల గౌడ్, కడప రజిత, సుకన్య, నాగేశ్వరరావు, బొల్లెపల్లి రామనాథం,మండల కాంగ్రెస్ నాయకులు చింతకాయల సైదులు యాదవ్, గుండు రామంజి గౌడ్, ముత్తినేని సురేష్,బాల్ దూరి సందీప్, ముత్తినేని సుబ్బయ్య, మంగళగిరి నాగరాజు, పోర్ల వెంకటేశ్వర్లు,గుండు సైదయ్య, జుట్టుకొండ అంజయ్య, ముత్తినేని కోటేశ్వరరావు, ఎస్.కె సైదా హుస్సేన్, కాత్రేవుల సైదులు, తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఆగని అక్రమ నిర్మాణాలు

- అనుమతులు పట్టవు
- చెప్పేది ఒకటి చేసేదోకటి
- కలెక్టర్ చొరవ తీసుకొని చర్యలు తీసుకోవాలని స్థానికుల వేడుకోలు

**గండిపేట, ఏప్రిల్ 15(మనంన్యూస్):** మున్సిపాలిటీ పరి ధిలో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా పరిమితికి మించి అంతస్తుల్లో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఓ వైపు అక్రమనిర్మాణాలపై ఉన్నతాధికారులు కొరడా ఝులిపిస్తుంటే మున్సిపల్ అధికారుల తీరుతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. భవన నిర్మాణాలు చేపట్టే ప్రజలు అనుమతుల కోసం దరఖాస్తు చేసే సమయంలో సమర్పించిన ప్లాన్ను విధిగా అమలు పర్చాలి. అనుమతి కాపీలో పేర్కొన్న విధంగా నిర్మాణం చేపట్టాలి. సెట్ బ్యాక్, రోడ్డు నిబంధనలు పాటించడంతోపాటు అనుమతు లు ఉన్న మేరకు పై అంతస్థుల నిర్మాణం చేపట్టాలి. గృహావసరాల కోసం అనుమతులు పొంది, కమర్షి యల్గా ఉపయోగించే వారిని సైతం నిబంధనల ఉల్లంఘన జాబితాలో చేర్చుతారు. గృహ, కమర్షియ ల్ భవన నిర్మాణాలతోపాటు లే అవుట్ అనుమతు లు లేకుండా ఏర్పాటు చేసే ప్లాట్లు చట్ట విరుద్ధం కా గా, అలాంటి వాటిపై టాస్కోర్స్ బృందాలకు చర్య లు తీసుకొనే అధికారం ఉంది. కానీ మణికొండ మునిపల్స్ పరిధిలోని సెక్రటెరీ కాలనీ పందెన్వాగు పై అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని గతంలో కోర్టు తీర్పు నిచ్చింది. అక్కడే పందెన్వాగు చుట్టూ ప్రాంతంలో అన్ని అనుమతులతో నిర్మాణాలు కొనసాగిస్తున్నామని చెబుతూ బహుళ అంతస్థులు నిర్మించడమే కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలంటూ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని క్యాండ్యునల్ నాలా పందెన్వాగుల పరిధిలోని బఫర్ ను అక్రమ నిర్మాణం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలను అరికట్టాలని కోరుతున్నారు.



**మున్సిపల్ ఆదాయానికి గండి**

గజానికి రూ.లక్ష పైగా ఉంది. దీంతో అక్కడ స్థలాలున్న యజమానులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. పరిమితికి మించి అంతస్తులు నిర్మించాలంటే హెచ్ఎండీఏ అనుమతులు తప్పనిసరి. కానీ కొందరు యజమానులు సెల్లార్లు తవ్వి మూడు నుంచి ఆరు అంతస్తుల వరకు నిర్మించి టూలెట్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. బహుల అంతస్తులు నిర్మించిన యజమానులు సెల్లార్లలోనూ వ్యాపార కార్యకలపాలు నిర్వహించుకునేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఇందుకు మున్సిపాలిటీ ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వారు మాత్రం సెల్లార్ను పార్కింగ్గా చూపుతూ మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి కోరుతున్నారు.

# నేడే ఒడిశా లో సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభం

- 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలోకి సింగరేణి
- గనిని లాంఛనంగా ప్రారంభించనున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- ఏడాదికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం గల అతి పెద్ద గని
- గని జీవితకాలం 38 ఏళ్ళు
- సీఎండీ ఎన్.బలరామ్

**మంచిర్యాల, ఏప్రిల్ 15(మనం న్యూస్):** సింగరేణి సంస్థ తన 13 దశాబ్దాల చరిత్ర లో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు తవ్వకాన్ని ప్రారంభించనుంది. ఒడిశా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించి న నైనీ బొగ్గు బ్లాక్ ను నేడు (ఏప్రిల్ 16వ తేదీ) రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వర్చువల్ గా ప్రారంభించనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మంగళవారం తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం వరకే పరిమితమై బొగ్గు గనులు నిర్వహిస్తున్న సింగరేణి ఇప్పుడు నైనీ బొగ్గు బ్లాక్ ద్వారా ఇతర రాష్ట్రాల్లోకి అడుగు పెట్టడాన్ని ఒక చరిత్రాత్మక ఘట్టంగా తెలిపారు.



**తొమ్మిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ...**

2016 మే నెలలో ఈ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు సింగరేణికి కేటాయించినప్పటికీ, అన్ని రకాల అనుమతులు సాధించి, గనిలో తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిదేళ్ళ సుదీర్ఘ కాలం నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ,ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవ చూపుతూ అప్పటి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని, ప్రస్తుత బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి లను కలిసి విజ్ఞప్తులు చేశారు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఒడిశా రాష్ట్రంలో ప్రత్యేకంగా పర్యటించి ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రితోనూ, సంబంధిత అధికారులతోనూ సంప్రదింపులు జరిపి గని ప్రారంభానికి మార్గం సుగమం చేశారు. దీంతో చివరికి సింగరేణీయుల చిరకాల స్వప్నం సాకారమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ వల్ల సింగరేణికి అతిపెద్ద బొగ్గు బ్లాక్ లభించింది. తద్వారా వార్షిక అధికోత్పత్తి సాధనకు మార్గం సుగమమై సంస్థ ఆర్థిక పటిష్టతకు దోహదపడనుంది.

**నైనీ బొగ్గు బ్లాక్ విశేషాలు**

ఈ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తవ్వితీయటానికి అవకాశం ఉంది.ఈ గని లో ఉత్పత్తి పూర్తిస్థాయికి చేరుకుంటే ఏడాదికి 10 మిలియన్ టన్నులు అనగా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న 17 ఓపెన్ కాస్ట్ గనుల కన్నా ఇదే అతి పెద్ద గని కానున్నది. ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38 సంవత్సరాల పాటు ఈ గని నుండి బొగ్గు తవ్వి తీయనున్నారు. తెలంగాణ లో ప్రస్తుతం గల సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఒక టన్ను బొగ్గు తవ్వి తీయడానికి సగటున 12 టన్నుల ఓవర్ బర్డెన్ (పై మన్ను) తొలగిస్తుండగా ఈ గనిలో మాత్రం ఒక టన్ను బొగ్గుకు కేవలం రెండున్నర క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీస్తే సరిపోతుంది. కనుక ఈ గని సింగరేణికి లాభదాయ కమైనదే అని భావిస్తున్నారు. ఈ గనిలో మేలైన జీ - 10 రకం నాణ్యమైన బొగ్గు లభిస్తోంది. ఈ గనిలో, ఓవర్ బర్డెన్ తొలగించడానికి, బొగ్గు తవ్వకానికి , బొగ్గు రవాణాకు సంబంధించి ఇప్పటికే కాంట్రాక్ట్ లను అప్పగించారు .ఇక్కడ ఉత్పత్తి చేసే బొగ్గును ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా సమీపంలో ని జరపడ రైల్వేసైడింగ్ కు రవాణా చేసి ,అక్కడి నుంచి వినియోగదారులకు సరఫరా చేయనున్నారు.అయితే ఈ ప్రాంతంలోగల ఇతర బొగ్గు కంపెనీలతో కలిసి ఒక ప్రత్యేక 60 కిలోమీటర్ల రైలు మార్గాన్ని నిర్మించడం కోసం కూడా ప్రయత్నాలు ప్రారంభించారు. మరో మూడేళ్లలో ఇది కార్యరూపం దాల్చే అవకాశం ఉంది.నైనీ బొగ్గు బ్లాకు కోసం మొత్తం 2255 ఎకరాల భూమి సేకరించారు. దీనిలో 1935 ఎకరాల అటవీ భూమి, 320 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూమి ఉన్నది.

# జర్నలిస్ట్ రాపోలు లింగస్వామికి ఉగాది పురస్కారం

- సుప్రీం కోర్టు 48వ మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

**రంగారెడ్డి, ఏప్రిల్ 15 (మనం న్యూస్):** తెలుగు జర్నలిస్ట్ల సంక్షేమ సంఘం ప్రతి సంవత్సరం ఉగాది పురస్కారాలను పలు విభాగలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జర్నలిస్ట్ లకు అవార్డుల ప్రదానం చేస్తుంది. (2024-2025)సంవత్సరానికి గాను ఈ అవార్డుల జాభితాను టి జె ఎస్ ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు తాజాగా ప్రకటించారు. ఈ సంవత్సరానికి గాను రెండు తెలుగు రాష్ట్రాల్లో అర్హులైన పలువురు జర్నలిస్టుల 100 మంది పేర్లను ప్రకటించగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ కు చెందిన జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త రాపోలు లింగస్వామిని మనవీయ కోణాన్ని ఆవిష్కరించిన జర్నలిస్ట్ గా ఎంపిక అవ్వడం జరిగింది. విజయవాడ లో తుమ్మలపల్లి కలక్షేత్రంలో తెలుగు జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య



అతిథిగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ (మాజీ) హాజరై నిర్వాహకులతో కలిసి రాపోలు లింగస్వామి కి ఉగాది పురస్కారం, ప్రశంశ పత్రం, 5000 రివార్డు, శాలువా తో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విలువలరో కూడిన పాత్రికేయులకు సమాజంలో ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందన్నారు.అప్పట్లో తాను కూడా పాత్రికేయు రంగంలో పనిచేసిన అనుభవాలతో కూడిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.పాత్రికేయ రంగం పై ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలల్లో విలువలతో కూడిన ఉత్తమ జర్నలిస్ట్ లకు ఉగాది పురస్కారం తో సత్కరించిన తెలుగు జర్నలిస్ట్ ల సంక్షేమ సంఘం భవిష్యత్లో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాక్షించారు. సామాన్య మధ్య తరగతి కుటుంబం లో పుట్టిన రాపోలు లింగస్వామి హైదరాబాద్ లో జర్నలిస్ట్ గా పని చేస్తూనే ఆర్ టి ఐ, సామజిక కార్యకర్తగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తన వంతు నిరంతరం కృషి కి ఫలితంగా గతంలో పలు అవార్డులు, ప్రముఖుల నుండి ప్రశంసలు, సమాజంలో తన కంటూ ఒక ప్రత్యేకత ను చాటుకుంటున్న రాపోలు లింగస్వామి కి తాజగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ జర్నలిస్ట్ ల జాభితాలో మానవీయ కొణాన్ని ఆవిష్కరించిన జర్నలిస్ట్ గా ఉగాది పురస్కారం ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ (మాజీ)చేతుల మీదుగా అందుకోవడం తో అతని సేవలను గుర్తు చేస్తూ పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

# లక్ష్మీనరసింహస్వామి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం



**జాజిరెడ్డిగూడెం, ఏప్రిల్ 15(మనం న్యూస్):** జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో అర్వపల్లి గ్రామంలో శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్తలుగా అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, ఆకుల సోమయ్య, జెర్రిపోతుల సోమయ్య, బీరెల్లి శ్రీధర్ రెడ్డి లు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థానం నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని పలువురు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు దరూరి యోగానంద చార్యులు, తుంగతుర్తి నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నర్సింగ శ్రీనివాస్ గౌడ్,జాజిరెడ్డిగూడెం మండల అధ్యక్షులు మోరపాక సత్యం ,మండల ఉపాధ్యక్షులు పెసర సతీష్ రెడ్డి,రత్నం సంతోష్, జాజిరెడ్డిగూడెం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శిగ నసీర్ గౌడ్, మండల సీనియర్ నాయకులు, అన్ని గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, అన్ని గ్రామాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎన్ ఎస్ యు ఐ అనుబంధం సంఘాలు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్.ఎన్.ఎస్ బ్రదర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**గరిడేపల్లి, ఏప్రిల్ 15 మనం న్యూస్:** మండల పరిధిలోని గార కుంట తండా గ్రామంలో మంగళవారం హెచ్.ఎన్.ఎస్ బ్రదర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ సహకారంతో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ ఉచిత వైద్య శిబిరానికి కంటి పరీక్షలు నిర్వహించుకునేందుకు ఆయా గ్రామాల ప్రజలు 110 మంది పరీక్షలు నిర్వహించుకోగా 36 మందికి కంటి ఆపరేషన్లు చేసేందుకు సూర్యాపేట లైన్స్ క్లబ్ ఆసుపత్రికి తీసుకువెళ్లినట్టు హెచ్.ఎన్.ఎస్ బ్రదర్స్ కమిటీ సభ్యులు తెలిపారు.హెచ్.ఎన్.ఎస్ బ్రదర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో అప్తాల మలాజిస్ట్ బంగారు స్వాతి,క్యాంపు ఆర్గనైజ్ ర్ బాణాల వీరేందర్ చారి,హెచ్.ఎన్.ఎస్ బ్రదర్ సభ్యులు,కార్యక్రమం నిర్వాహకులు



నరేందర్ నాయక్,బచ్చలకూరి కోటయ్య,బానోతు రవీందర్,గుగులోతు వెంకట్రావు నాయక్,జేత్య,రవి,చిన్న తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



**మిరుదొడ్డి, ఏప్రిల్ 15, మనం న్యూస్:** దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అంబేద్కర్ జెండాను అవమానపరచడం సిగ్గుచేటని మిరుదొడ్డి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మద్దెల రాజేశం, దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకట స్వామి గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్వాల కిష్టయ్యలు అన్నారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి మిరుదొడ్డి, అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ లో రాజద్రోహం కింద కేసు నమోదు చేయాలని దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం ముబారస్ పూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే తన చేతిలో ఉన్న జెండాను కిందికి విసిరేయడం సరికాదన్నారు. విగ్రహావిష్కరణ రోజే అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా జెండాను కింద పారేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కనకారెడ్డి, మహేందర్ రెడ్డి, సాయిలు, కనకరాజు, భాస్కర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు తెలుగంటావు

తెలుగు తెలుగంటావు
తెలుగు వెలుగంటావు
తెలుగెక్కడుందిరా తెలుగోడా...
తెలుగు వెలుగెక్కడుందిరా తెలుగోడా...
భాషనాదంటావు, యాసనాదంటావు
యాసకొక్కాతీరు వేరుపడమంటావు
భాషెక్కడుందిరా తెలుగోడా...
భాషయాసెక్కడుందిరా తెలుగోడా... /తెలుగు/
అమ్మ మమ్మీ అయ్యి చాన్నాళ్ళు అయ్యింది
నాన్న డమ్మీ అయ్యి ఎన్నేండ్లో అయ్యింది
బడిలో పిల్లలు పలుక బడితెపూజవుతుంది
పలుకెక్కడుందిరా తెలుగోడా...
తేనెపలుకెక్కడుందిరా.... /తెలుగు/
బతుకనేర్చిన చాలు బాగుబాగంటావు
భాషయేదయినను బాధలేదంటావు
మనసులోని గోస, మనిషితో పంచితే
నీలోని భారము తొలగి, మలిగిపోవు
బాధెట్ట సెప్పేవు తెలుగోడా...
నీ భాషెట్ట సెప్పేది తెలుగోడా.../తెలుగు/
దెబ్బతగిలిన చోట అమ్మయన్నా మాట
అబ్బబ్బ అనకుండ నిలువవే ఏ పూట
తబ్బిబ్బు కాబోకు తెలుగోడా...
తల్లివంటిది తెలుగు తెలుగోడా... /తెలుగు/
కమ్మనైనా కథలు చదివావ ఎపుడైన...
పద్యాల రతనాలనేరావ ఎపుడైన...
కష్టాలు వస్తేను తెలుగోడా...
కంఠానికురితాడు తెలుగోడ.../తెలుగు/
సెల్లుఫోనులు వచ్చి సొల్లుమాటలు పెంచె
వాట్సప్ లు,ట్విట్టర్ లు, వాడి వేదిక లాయే
నీమాటెక్కడుందిరా తెలుగోడా....
నీపాటెక్కడుందిరా తెలుగోడా.../తెలుగు/
యుట్యూబ్ లో చూసి వంటలే చేసేరు
ఫేసుబుక్కులతోటి బంధాలు పెంచేరు
బంధుజనమేదిరా తెలుగు గోడా...
నీ భవిష్యత్తు ఏదిరా తెలుగోడా..../తెలుగు/
నీకంటు ఒక జాతి ఉన్నమాట మరచి
సంప్రదాయాలను,సంస్కృతులను విడిచి
డబ్బుతోనా డాబు చూయించడం నేర్చి
ఎటువెళ్ళుతున్నవు తెలుగోడా.....
ఇటువైపు చూడవా తెలుగోడా..../తెలుగు/

- **ఆశన్నగారి ఆనందీశ్వరరెడ్డి**
8179192999

## తప్పిపోయిన బాల్యం

పక్షం రోజులుగా
దర్జీ గుమ్మం చుట్టూ ఈగలా తిరిగి
సంతోష రాగంలా సంపాదించాను
మేఘాల సౌందర్యంలా మిలమిలలాడే
కొత్త అంగీ
పావలా పెట్టి ఇస్త్రీ చేయించాను
పరిమళాలు సుగంధ తోటలై విరిసినట్టు

పరుగుపరుగున, ఆశల గుండె దడలతో
విద్యా ప్రాంగణంలో అడుగు పెట్టాను
జాతీయ పతాకం, గరుడ పక్షిలా
నీలాకాశంలో స్వేచ్ఛగా ఎగురుతుంటే
సగర్వంగా తల ఎత్తి చూసిన ఆ క్షణంలో
సంతోషం సముద్ర తీరంలా
అలలై అలలై హృదయాన్ని తడమగలిగింది

నేడు,కార్పొరేట్ వ్యవస్థలో
అదే విద్యా ప్రాంగణం
కనుమరుగైన ఆ బాల్య రాగాలు
ఆనాటి నవ్వుల సవ్వడులు, లేనే లేవు
గ్రీష్మంలో ఆకులు రాలిన మోడుగా
మనసు తపనగా కోరుకుంటోంది
'తప్పిపోయిన బాల్యం చెంత నిలిచేనా?'

- **రాము కోలా**
9849001201

## ఓటు

ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ
వ్యవస్థ మార్పుకై నిలబడే ఆయుధం
జన జీవన గమన సూచిక ఓటు

ఓటంటే నోటు కాదని ఉద్భోదిస్తూ
భావి తరాలను పరిరక్షించే అస్త్రం
జీవిత ప్రయాణానికి దిక్సూచి ఓటు

ప్రజల మనోభావాలను గుర్తిస్తూ
బ్రతుకుకు బాటలు వేసే ప్రమాణం
భావితరాల విజయ బావుటా ఓటు

ఆర్థిక సమానతలను కల్పిస్తూ
పేదరికాన్ని రూపుమాపే కల్పతరువు
సమైక్య జీవన సౌందర్యం ఓటు

సంక్షోభాలను ఎదుర్కుంటూ
విశ్వశాంతిని తెలిపే సూచిక
ప్రజా సంక్షేమానికి చిహ్నం ఓటు

- **కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం**
7780277249

# సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం



రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను కొందరు గవర్నర్లు కావాలి అని ఏళ్ళ తరబడి వాటిని ఆమోదించకుండా పెండింగ్‌లో పెడుతూ కాలయాపన చేస్తుండడం ఇటీవలి కాలంలో హెచ్చు మీరుతూనే ఉంది. ముఖ్యంగా 'తమిళనాడు రాష్ట్ర శాసనసభ ఆమోదించి పంపించిన బిల్లులపై గవర్నర్ ఆర్.ఎన్.రవి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏవిధమైన నిర్ణయాలు తీసుకోకుండా తొక్కిపెడుతున్నాడు' అని తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. తన విశేషాధికారాలను ఉపయోగించి ఆ పది బిల్లులు ఆమోదం పొందినట్లుగా ఈ ఏప్రిల్ 8 నాడు స్పష్టమైన తీర్పుని వెల్లడించిన సుప్రీం కోర్టు ఇటీవల 'రాష్ట్రపతికి సైతం నిర్దిష్ట గడువును విధించడం సంచలనం సృష్టించింది' అని చెప్పవచ్చు. తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్ రవిపై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్ను విచారించిన జస్టిస్ జె.బి. పార్దివాలా మరియు జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ చారిత్రాత్మక తీర్పుని వెలువరించడం విశిష్ట ప్రాధాన్యతను సంతరించుకుంది. 'రాష్ట్రపతి పరిశీలన నిమిత్తం గవర్నర్ బిల్లులను నివేదించిన రోజు నుండి మూడు నెలల్లోగా వాటిపై రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలి అని, ఒకవేళ మూడు నెలలకు మించి ఆలస్యం అయితే ఆ జాప్యానికి గల సహేతుక కారణాలను రాష్ట్రపతి నమోదు చేసి సంబంధిత రాష్ట్రాలకు ఆ విషయాన్ని నివేదించాలి' అని సుప్రీంకోర్టు తీర్పుని వెలువరించడం శుభపరిణామం. రాష్ట్రపతికి ఇలా మూడు నెలల గడువు విధించడం న్యాయ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. 'ప్రభుత్వం ఆమోదించి పంపించిన బిల్లులపై గవర్నర్ ఆర్. ఎన్.రవి ఏ నిర్ణయం తీసుకోకుండా మూడేళ్లుగా తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధం. శాసనసభ తీర్మానించి పంపించిన బిల్లులను గవర్నర్ గరిష్టంగా నెల రోజులకు మించి పెండింగ్‌లో ఉంచరాదు. మంత్రివర్గ సిఫారసు మేరకు రాష్ట్రపతి పరిశీలనకు పంపాలని భావిస్తే నెల రోజుల్లోనే పంపాలి. ఒకవేళ మంత్రివర్గ సలహాలు, సూచనలకు విరుద్ధంగా సమ్మతిని నిలుపుదల చేయాలి అని గవర్నర్ పది బిల్లుల విషయంలో గవర్నర్ ఏ రకంగానూ సదుద్దేశ్యంతో వ్యవహరించలేదు. ఆ రకంగా ఆ పది బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో పెట్టడం ఏకపక్షం. ఈ తరుణంలో 2023 నవంబర్ 18 నాటి నుండి ఆ పది బిల్లులను గవర్నర్ ఆమోదించినట్లుగా పరిగణించాలి' అని ధర్మాసనం స్పష్టమైన తీర్పుని వెలువరించడం మూలంగా న్యాయం గెలిచి నిలిచింది అని చెప్పవచ్చు.

తీర్పు కాపీని సుప్రీం కోర్టు వెబ్‌సైట్ లోను పొందుపరచగానే తమిళనాడు ప్రభుత్వం గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం లేకుండానే పది చట్టాలను గెజిట్‌లో నోటిఫై చేయడం చకచకా జరిగిపోయాయి. ఇలా గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన చట్టాల్లో చాలా చట్టాలు ప్రభుత్వ ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాలకు ముఖ్యమంత్రి ఛాన్సలర్ గాను వ్యవహరించనున్నారు. ఇలా గవర్నర్, రాష్ట్రపతి సంతకం లేకుండా సుప్రీంకోర్టు తీర్పుతో అమలులోకి వచ్చిన మొదటి చట్టాలుగా ఈ చట్టాలు దేశంలో సరికొత్త చరిత్రని సృష్టించడం విశిష్ట ప్రాధాన్యతని సంతరించుకున్నాయి. 'డి.ఎం.కె అంటే చరిత్ర సృష్టించడం అని, ఇది దేశంలోని అన్ని రాష్ట్రాల విజయం' అని తమిళనాడు



ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ వ్యాఖ్యానించడాన్ని 'డి.ఎం.కె ప్రభుత్వం సాధించిన అతి పెద్ద విజయం'గా అభివర్ణించవచ్చు.

'ఏ బిల్లు విషయంలోనూ గవర్నర్లకు వీటో అధికారాలు లేవు. అదే ప్రమాణాన్ని రాష్ట్రపతికి వర్తింపజేయడానికి మాకు ఏవిధమైన కారణాలు కనిపించడం లేవు. రాజ్యాంగం అంతటా కన్పించే ఈ ప్రామాణిక సూత్రానికి రాష్ట్రపతి ఏమాత్రం మినహాయింపు కానేకాదు. అటువంటి అదుపులేని అధికారాలు ఈ రెండు రాజ్యాంగ పదవుల్లో ఏ ఒక్క దానికి ఉండరాదు' అని ధర్మాసనం తన తీర్పులో స్పష్టంగా పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. ఈ రకంగా 'ధర్మాసనం వ్యాఖ్యలు సమతా భావనకు ప్రతీకగా నిలిచాయి' అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

'ఒకవేళ ఏదైనా ఒక బిల్లు రాజ్యాంగ విరుద్ధంగా ఉంది అని రాష్ట్రపతి భావిస్తే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సుప్రీం కోర్టు సలహా తీసుకోవచ్చు. అలాగే గవర్నర్లు పంపే బిల్లులపై నిర్దేశిత గడువులోగా రాష్ట్రపతి ఏవిధమైన చర్య తీసుకోకపోతే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టులను ఆశ్రయించి రాష్ట్రపతికి వ్యతిరేక రిట్ ఆఫ్ మాండమాస్ జారీ చేయాల్సిందిగా కోరుతూ రిట్ పిటిషన్లు దాఖలు చేయవచ్చు. బిల్లులను ఎక్కువకాలం ఆమోదించకుండా పెండింగ్ లో పెడితే న్యాయ సమీక్షలో భాగంగా కోర్టులు ఆ బిల్లుల నిలుపుదలకు గల కారణాలను పరిశీలించవచ్చు' అని ధర్మాసనం చాలా స్పష్టంగా పేర్కొనడం గమనించవచ్చు.

'రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడి ఉన్న బిల్లులు, రాష్ట్రపతి ఆమోదం అవసరం ఉన్న బిల్లుల విషయంలో వాటిని శాసనసభలో ప్రవేశపెట్టడానికి ముందే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేయాలి. తద్వారా కేంద్ర - రాష్ట్రాల మధ్య ఘర్షణ వాతావరణం తగ్గి రాబోవు అడ్డంకులను కూడా ముందుగానే నిరోధించవచ్చు' అని ధర్మాసనం దూరదృష్టితో వ్యవహరించడం నిజంగా ప్రశంసనీయం. గవర్నర్లు బిల్లులను రాష్ట్రపతికి పంపించే విషయంలో రాష్ట్రాలకు ఉన్న శాసన అధికారాలకు ఏమాత్రం విఘాతం కలగకుండా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం తప్పకుండా ఉంది. గవర్నర్లు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరించాలే తప్ప అధికారంలో ఉన్న ఏ పార్టీకి ఏవిధంగాను విధేయులుగా వ్యవహరించకూడదు. రాష్ట్ర శాసనసభల ఆమోదం పొందిన బిల్లులను ఎటూ తేల్చకుండా వాటి విషయంలో గవర్నర్లు నాన్చివేత ధోరణిని అవలంభించడం ఏమాత్రం సహేతుకం కాదు. నిజానికి ఆయా గవర్నర్లు కావాలని సమస్యలు సృష్టించకుండా ప్రజాస్వామికంగా వ్యవహరిస్తే ఏవిధమైన సమస్యలు ఉత్పన్న కానేకావు. పైగా ప్రభుత్వాలు కోర్టులకు రావలసిన అవసరం ఎంతమాత్రం ఉండదు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. అందువలన ఇకనైననూ ఆయా గవర్నర్లు తమ తమ రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామిక దృక్పథంతో రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన తక్షణ కర్తవ్యం ఎంతైనా ఉంది. అంతిమంగా బిల్లుల ఆమోదానికి నిర్దిష్ట గడువుని విధించిన ఈ సుప్రీం కోర్టు తీర్పు 'అన్యాయ రాజకీయాలకు సమాధి కడుతూ న్యాయానికి సజీవ మలుపుగా నిలుస్తుంది' అని చెప్పవచ్చు.

- **జె.జె.సి.పి. బాబూరావు**
94933 19690

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం



స్వాతంత్ర్య భారతదేశం అంబేద్కర్ 134వ జయంతి జరుపుకోవటానికి సిద్ధమవుతున్న సందర్భంలో ఒక పక్క పార్లమెంట్ సాక్షిగా జరిగిన ఘోర అవమానం.మరోపక్క ఆయన ఎన్నడూ లేనంత ఎత్తుకు ఎదిగినట్లు కనిపిస్తున్నది.అనేక ముఖ్య ఘట్టాలలో,ఉద్యమాలలో నవభారత నిర్మా ణం కోసం, ప్రజాస్వామ్యం కోసం,సామాజిక రుగ్మతలు లేని దేశం కోసం అంబేడ్కర్ కృషి చేశారు. అంబేద్కర్ జీవితానుభవంలో గుర్తించిన సామాజిక రుగ్మతలు, జరిపిన ఉద్యమాలు,అధ్యయనం, ఆలోచనలను ప్రయోగాత్మకంగా పరిశీలించాలి.

భారత సమాజం గురించి ఆయన లోతుగా పరిశీలన చేసి లేవనెత్తిన అనేక ప్రశ్నలు నేటికీ సజీవంగా నిలిచి ఉండటం,ఆయన కృషిని,ప్రాధాన్యతని నేటికీ గుర్తు చేస్తున్నాయి. 1871 ఏప్రిల్ 14వ తేదీన మధ్య భారతదేశంలో మౌ అనే ప్రాంతంలో,మత భావాలను విశ్వసించే,పేద మెహర్ కుటుంబంలో భీమ్ రావ్ అంబేద్కర్ జన్మించారు.పాఠశాల విద్యాభ్యాసం సతారా లోను,ముంబైలోను,కళాశాల విద్యాభ్యాసం ముంబైలోను పూర్తి చేసిన అంబేడ్కర్ 1913, 1917లో కొద్దికాలం పాటు బరోడా మహారాజు దగ్గర సేవలు కూడా అందించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కొలంబియా విశ్వవిద్యాలయంలో,గ్రేస్ ఇన్ బాక్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యనభ్యసించిన ఈ నవయువకుడు ఆనాటి సమకాలీన రాజకీయ నాయకులలో చాలా మందికి లేనటువంటి,అమోఘమైన పాండిత్యాన్ని సంపాదించారు.జీవితానికి సంబంధించిన అన్ని అంశాలలో లోతైన అవగాహనను ఆర్జించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుంది. అప్పుడప్పుడే అందివస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భీమ్‌రావ్ విశేష ప్రతిభను కనపరిచారు.నిజానికి తన కుటుంబంలో,తన తోటి సమాజంలో మరెవ్వరూ అందుకోలేనటువంటివి అత్యధిక శాతం భీమ్‌రావ్ అందుకున్నారు. అందులో కూడా ప్రతి ఒక్క అంశమంటే పాండిత్యం, మేధస్సు, ప్రొఫెషనల్గా సాధించిన విజయాలన్నిటిలోను కష్టపడి,పోరాడి సాధించుకున్నవే తప్ప అప్పనంగా వచ్చినవి కాదు.అందులోనూ ఆనాడు ఉన్నటువంటి సామాజిక అడ్డంకులు ముఖ్యంగా పక్షపాత వైఖరి, సామాజిక అణచివేతలు,కులపీడనలు వంటివి ఎదుర్కొని సాధించారు.1920లలో తొలినాళ్ళకే అంబేద్కర్ ఎమ్.ఎ,పి.హెచ్‌డి అర్థశాస్త్రంలో ఎమ్.ఎస్.సి,డి.ఎస్.సి,బారిస్టర్‌ఎట్ లా పూర్తి చేశారు. తనకి 30 సంవత్సరాలు వచ్చే సరికే, ప్రముఖ విద్యావేత్తలు, అధ్యయనకారులు తమ జీవితకాలంలో సాధించలేనన్ని నిజ జీవిత అనుభవాలను అంబేద్కర్ గడించారు. నాలుగు దశాబ్దాల తన ప్రజాజీవితంలో అనేక వివాదాస్పద అంశాలలోనూ, అధిగమించటానికి వీలు లేనటువంటి అనేక సామాజిక సమస్యల మీద అంబేద్కర్ ఒక హీరో లాగా వెలుగొందారు. అలెగ్జాండర్ గోల్డ్వెసర్ 1916 మే నెలలో సామాజిక శాస్త్రాలపై సెమినార్ జరిపినప్పుడు, మొట్టమొదటి సారిగా అంబేద్కర్ భారతదేశంలో కులాల తీరు తెన్నులు,పుట్టుక,అభివద్ధి అనే అంశంపై చాలా అద్భుతమైన పత్రాన్ని సమర్పించారు. పారదర్శకత, నిజాయితీ,పట్టుదల వంటి అపూర్వగుణాలు కలిగిన ఉదారవాది డా.అంబేద్కర్ తాత్వికంగా మొదట ఆదర్శవాదం వైపు మొగ్గినప్పటికీ,అంతిమంగా బుద్ధుని సిద్ధాంతం వైపు ఆకర్షితుడయ్యారు.

మార్క్సిజం పుస్తకాలను కూడా చాలా లోతుగా అధ్యయనం చేశారు. అవి ఎంతగా అంటే 1938లో బాంబేలో చరిత్రాత్మక ఖాట్ వ్యతిరేక ఉద్యమం జరిగినప్పుడు ఇక్కడ ఉన్న కమ్యూనిస్టు నాయకులకన్నా నేను కమ్యూనిస్టు సిద్ధాంతం గురించి లెక్కలేనన్ని ఎక్కువ పుస్తకాలను చదివాను అని ఆయన ప్రకటించారు. 1950లో ఆయన న్యాయశాఖ మంత్రిగా ఉండి హిందూ కోడ్ బిల్లు తెచ్చినప్పుడు, అదే జవహర్లాల్ నెహ్రూ ప్రధాన మంత్రిగా అంబేద్కర్‌ను ఘోరంగా దెబ్బతీశారు. అంబేద్కర్ జీవించినంత కాలం, ఆయన ప్రత్యర్థులు, విమర్శకులు మరీ ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు, ఆయనను ఆ యుగంలోని వ్యూహాత్మక లక్ష్యాన్ని గుర్తించలేని వ్యక్తిగా పదేపదే అభివర్ణించేవారు. ఆ ప్రచారం బాగా ప్రాచుర్యం పొంది, ఆఖరికి మీడియా కూడా ఆయనను ఒక రెండో తరగతి దేశనాయకుడిగా, షెడ్యూల్ కులాలకే పరిమితమైన నాయకుడిగా చిత్రీకరించింది. వస్తుగతంగా చూస్తే ఆయనంత ఉన్నత వ్యక్తి, సాహసోపేతమైన దేశ నాయకులు చాలా తక్కువ మంది ఉన్నారన్నది సుస్పష్టం. దురదృష్టవశాత్తు స్వాతంత్ర్య పోరాటంలోని కొంత మంది హీరోలు, సామాజిక విప్లవకారులు సైతం అంబేద్కర్ లోతైన అధ్యయనం,దృఢచిత్తం, సామాజిక అంతరాలపై జరిపిన బలమైన పోరాటాలను పూర్తిగా విస్మరించారు.కొంత మంది అయితే ఆయన దేశభక్తిని కూడా శంకించి,నీచంగా మాట్లాడారు. ఇంత వైవిధ్యభరితమైన, స్ఫూర్తివంతమైన స్వాతంత్ర పోరాట అనుభవాలను గమనిస్తే,అంబేద్కర్ సామాజిక అంశాలపై ఎంత ప్రశంసనీయమైన ప్రశ్నలు సంధించారో అని మనం అభినందిస్తూనే ఆయన విమర్శకులు,శత్రువులవి శుద్ధ అబద్ధపు వాదనలుగా పరిగణించాలి. సామాజిక అంశాలపై,పోరాటాలపై లోతైన పార్శ్వాలన్నీ తట్టి చూపిన అంబేద్కర్ ఆశయాన్ని ఇప్పుడన్నా గుర్తించాల్సిన సమయం వచ్చింది. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడిచిన స్వాతంత్ర్య పోరాటంలో దీనికి తగినంత ప్రాధాన్యత ఇవ్వబడలేదు. దేశ రాజకీయ దక్పథంలో ఎప్పుడూ నికరంగా కేంద్ర స్థానం వహిస్తూ,తీవ్రవాద శైలితో,సామాజిక అంశాలలో ఎటువంటి సర్దుబాటు ధోరణి ప్రదర్శించకుండా ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించారు అంబేద్కర్. సమాజంలోని అసమానతలు, మతాలలో ఇమిడి ఉన్న అణచివేత ధోరణులు, సాంప్రదాయ వారసత్వాలు, మెజారిటీ సమాజం రుద్దిన విలువలను గమనించిన అంబేడ్కర్ సామాజిక, ఆర్థిక న్యాయం కోసం తన సొంత ఆదర్శాలను రచించుకున్నారు.అంబేద్కర్ రాజ్యాంగ సభలో,రాజ్యాంగ ముసాయిదా రూపకల్పన కమిటీకి అధ్యక్షత వహించి,ప్రధాని నెహ్రూ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో కొంతకాలం ఉన్నప్పటికీ, భారత రాజకీయాలలో కాంగ్రెసేతర, కాంగ్రెస్ వ్యతిరేక భావధారకు ఆయననే మనం ఆద్యుడిగా పరిగణించాలి.కానీ వాటికి భిన్నంగా హిందూ మితవాదం,రాజకీయంగా,సామాజికంగా బాగా పైచేయి సాధించి,మెజారిటీ మతమౌఢ్యం, సామాజిక అభివద్ధి నిరోధకత్వాలు సాగిస్తోన్న రాజకీయ,సిద్ధాంత ఎదురుదాడి ప్రస్తుత దేశపరిస్థితికి అద్దం పడుతున్నాయి.అంబేద్కర్ వారసత్వాన్ని సొంతం చేసుకోవడానికి హిందుత్వవాదులు చరిత్ర సారాన్ని వక్రీకరించి మరీ ప్రయత్నాలు సాగిస్తున్నారు.ఇటువంటి పరిస్థితులలో కులవ్యవస్థపైనా,చాతుర్వర్ణ, సనాతన ధర్మాల పైనా,అంటరానితనాన్ని మార్పు లేకుండా యధాతథంగా నిలిపి ఉంచే సామాజిక దొంతరలపైనా హిందూ ధర్మశాస్త్రాల ఆధిపత్యం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలపై నేడు పోరాడాలి. ప్లాటో రిపబ్లిక్ ఏ కారణం వల్ల వైఫల్యాన్ని ఎదుర్కొందో,సరిగ్గా అదే కారణం మూలంగానే చాతుర్వర్ణ వ్యవస్థ కూడా తప్పని సామాజిక తిరుగుబాటుదారుడైన, ఈ పీడిత వర్గ మేధావి హెచ్చరించారు. ఈ దుర్మార్గ వ్యవస్థ మూలంగా హిందువులలోని దిగువ వర్గాలు ప్రత్యక్షంగా కార్యాచరణలోకి దిగకుండా పూర్తిగా నిస్సహాయులుగా చేయబడ్డారని ఆయన వేలెత్తి చూపి ఇంతకంటే నీచమైన సామాజిక వ్యవస్థ మరొకటి రాబోదని హెచ్చరించారు. ఈ వ్యవస్థ ప్రజలను పరస్పర సహాయ కార్యకలాపాలు చేయనివ్వకుండా కుంటుపరిచి,వారిని నిస్సహాయులుగా,చచ్చుబడిన వారిలా చేస్తుందని తెలిపారు.ఆయన సామాజిక,ఆర్థిక,ప్రజాస్వామ్యం కోసం ఉద్యమిస్తూనే ఈ వ్యవస్థ రాజకీయ రంగంలో కలుగచేసే ప్రభావాలపై దృష్టి సారించి కృషి చేశారు. ధర్మశాస్త్రాలపై ఉన్న విశ్వాసాన్ని సర్వనాశనం చేయడం,వాటి పునాదిగా గల కులపరమైన నిరంకుశత్వాన్ని నాశనం చేయడమే దీనికి వాస్తవ పరిష్కారమని అంబేద్కర్ భావించారు.ఇటువంటి విషయాలలో గాంధీ అర్ధ శతాబ్దానికి ముందే డాక్టర్ అంబేద్కర్ హిందూ మతానికి ఓ సవాల్ అని ప్రకటించాడంటే అందులో ఆశ్చర్యమేమీలేదు. నిజంగానే ఆయన ఈనాటికీ ఒక సవాల్ గానే నిలిచి ఉన్నారు. అందువల్లనే హిందుత్వ వాదులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమికి చెందిన కొన్ని శక్తులు నేడు ఆయనను నిర్లక్ష్యం చేయలేని స్థితిలో ఉన్నాయి. సామాజిక పురోగతిని నిరోధించటానికి పూనుకున్న వారిని వ్యతిరేకిస్తూ, సామాజిక ఛాందసవాదం,అవకాశవాద రాజకీయాలపై యుద్ధాలు సాగిస్తూ 1940 దశకం చివరిలో,1950 దశకం తొలిలో హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నాలకు నాయకత్వం వహించారు.కానీ ఛాందసవాద శక్తులు ఆయన ప్రయత్నానికి వెన్నుపోటు పొడిచాయి.వారసత్వం, వంశపారంపర్య పాలననూ,ఏక పార్టీ వ్యవస్థను ఆయన ద్వేషించారు. ఒకే పార్టీ ప్రజామోదమైన ప్రభుత్వాన్ని నడపటం అంటే,నిరంకుశత్వం తెరవెనుక నుండి పాలన సాగించే ఒక రూపంగా ప్రజాస్వామ్యం తయారవ్వడాన్ని అనుమతించడమే అనేది



అంబేద్కర్ ప్రముఖ సూత్రీకరణల్లో ఒకటి. నిరంకుశత్వం ఎన్నికయినదయినప్పటికీ,అది నిరంకుశత్వం కాకమానదు. నిరంకుశత్వం కూలదోయబడే అవకాశం ఉండటం,దానిని తోక ముడిచేటట్లు చేయగల అవకాశం ఉండటం,దాని ప్రత్యర్థి పార్టీ దాని స్థానంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉండటమే నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిజమైన గ్యారంటీ అని ఆయన హెచ్చరించారు. ఏకపార్టీ పాలన ప్రాతిపదికన గానీ,లేదా నిద్ర పోయే హక్కులని నిద్రపోనీ అనే సామాజికతత్వ ప్రాతిపదికతో ఉండే రాజకీయ సుస్థిరత గానీ అంబేద్కర్‌కు గిట్టని విషయాలు. అంబేద్కర్ దూరదృష్టితో వెలిబుచ్చిన రాజకీయ భావాలలో రెండు నేటి కాలానికి కూడా వర్తిస్తాయి.వాటిలో మొదటిది రాజకీయ స్వేచ్ఛలను ఒక గొప్ప వ్యక్తి పాదాల క్రింద ఉండనివ్వకండని,రెండోది రాజకీయాలలో భక్తి లేదా వీరాధన ఉంటే అది అధోపతనానికి దారి అని చెప్పారు.అందుకే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్ది,వైరుధ్యాలను పరిష్కరించాలని లేకపోతే అవి ప్రజాస్వామ్య పునాదుల్ని నాశనం చేస్తాయని అంబేద్కర్ ఆనాడే ప్రజాస్వామ్యాన్ని హెచ్చరించారు.కాబట్టి నేడు ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభాలను అధిగమించేందుకు పోరాడటమే నేడు ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి.

- **నాదెండ్ల శ్రీనివాస్**
9676407140

# నీరు వృధా కాకుండా సంరక్షిద్దాం

'నీరు లేని జీవితం అసాధ్యం' అనే వాక్యం ఈ కాలంలో మరింత నిజంగా మారుతోంది. నీరు నిజంగా జీవనాధారం. అనేక పట్టణాల్లో ప్రజలు నీటి కోసం క్యూల్లో నిలబడుతున్నారు. హోటళ్లలో నీటి వినియోగంపై హెచ్చరికలు కనిపిస్తున్నాయి.

వేసవి తాపంతో మండుతున్న సమయంలో, శౌచాలయాల్లో నీటి కొరత కూడా ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తోంది. సాధారణ రోజుల కంటే వేసవిలో ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది.

వర్షాభావం,అధికఉష్ణోగ్రతలు, జనాభా పెరుగుదల, జీవనశైలిలో మార్పులు-ఇవన్నీ కలసి నీటి వినియోగాన్ని పెంచుతున్నాయి. దీంతో అందుబాటులో ఉన్న వనరులు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రతి ఇంటిలోనూ నీటి వినియోగాన్ని సమీక్షించి, అవసరమైన మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సాంకేతిక పరిజ్ఞానం కూడా ఈ సమస్యకు సహాయకం అవుతుంది. డ్యుయల్ ఫ్లష్ ట్యాంకులు, లో-ఫ్లో ఏరేటర్లు, వర్షపు నీటిని సేకరించే విధానాలు, తోటలకు ఉదయం లేదా సాయంత్రం మాత్రమే నీరు పోయడం, మల్చింగ్ ద్వారా నేల తేమను కాపాడటం వంటి చర్యలు గృహ స్థాయిలో మంచి మార్పును తీసుకురాగలవు.

వేసవిలో విద్యుత్ సరఫరా పరిమితమవడం వల్ల ప్రధాన పంపింగ్ కేంద్రాలకు సరిపడా విద్యుత్ అందకపోవడం, నీటి సరఫరాను మరింత క్షీణతకు గురిచేస్తోంది. దాంతో ప్రజల మౌలిక అవసరాలకే ముప్పు ఏర్పడుతోంది.

ఈ పరిస్థితుల్లో నీటి విలువను గుర్తు చేయడం అత్యవసరం. సామాజిక సమావేశాలు, సదస్సులు, పోస్టర్లు, సోషల్ మీడియా వేదికల ద్వారా నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచాలి. అధికారులు డోర్ టూ డోర్ ప్రచారాలు నిర్వహించి, నీటి వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలి. చలాన్ల విధానం పారదర్శకంగా ఉండాలి. లంచాల్లాంటి అవినీతి పెరిగితే నీటి సంరక్షణ కష్టమే అవుతుంది.

అంతేకాక, విద్యాలయాల్లోనే పిల్లల్లో నీటి విలువపై అవగాహన పెంచితే, వారు తమ ఇంట్లోనూ అలాంటి బాధ్యతాయుత ఆచరణను పాటించే అవకాశం ఉంది. దీనివల్ల సమాజ స్థాయిలో స్థిరమైన మార్పు సాధ్యమవుతుంది.

ఇళ్లలో వంట, స్నానం, శుభ్రత, బట్టలు కడకడం, తోటల సంరక్షణ వంటి అవసరాల కోసం ప్రతి రోజు నీరు వాడతాం. అయితే అవగాహన లోపంతో అనేక సందర్భాల్లో నీరు అనవసరంగా వృథా అవుతోంది. ఉదాహరణకు, షవర్తో స్నానం చేయడం, ట్యాప్ ఓపెన్‌గానే వదిలేయడం, చిన్న లీకుల్ని పట్టించుకోకపోవడం వంటి అలవాట్లు లీటర్ల కొద్దీ నీటిని వృథా చేస్తున్నాయి.

ఈ పరిస్థితిని మార్చడం పెద్ద కష్టమైన పని కాదు-చిన్న అలవాట్ల మార్పుతో ప్రారంభించొచ్చు. ఉదయం బ్రష్ చేస్తూ ట్యాప్ మూయడం, బకెట్‌తో స్నానం చేయడం, పాత్రలు కడగడంలో మితంగా నీటిని వినియోగించడం వంటి మార్గాలు నీటి వృథాను తగ్గించవచ్చు. అలాగే, వాషింగ్ మెషిన్ వాడేటప్పుడు అవసరానికి తగిన నీరే వాడటం, డిటర్జెంట్ మోతాదు తగ్గించడం కూడా ఉపయోగకరమే.

గృహస్థులుగా మనం తీసుకునే చిన్న చిన్న చర్యలు చాలా ప్రాముఖ్యమైనవి. ఉదాహరణకు, వేడి నీరు వచ్చేలోపు వదిలే చల్లటి నీటిని సేకరించి తోటల కోసం వాడడం, వర్షపు నీటిని భద్రపరచడం వంటి మార్గాలు నీటి వినియోగాన్ని మెరుగుపరచగలవు.

వేసవిలో పెరుగుతున్న నీటి కొరతను అధిగమించాలంటే, ప్రభుత్వ చర్యలతోపాటు ప్రతి ఇంటిలోనూ బాధ్యతాయుత ఆచరణ అవసరం.

ఇంటి నుంచే మొదలయ్యే జాగ్రత్తలే సమాజాన్ని మార్చగలవు. నీటిని సంరక్షించే ప్రతి చిన్న అలవాటు ఒక పెద్ద మార్పుకు నాంది అవుతుంది - అది భవిష్యత్ తరాల కోసం వెలిగే ఆశాజ్యోతి అవుతుంది.

- **డాక్టర్ కృష్ణ కుమార్ వేపకొమ్మ**



# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

- సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



హైదరాబాద్, ఏప్రిల్ 15(మనంన్యూస్)ః రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి పంట ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ,అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌తో కలిసి ధాన్యం కొనుగోలు పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్ లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతిపాదించిన 240 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 119 ఐకేపి, 21 పాక్స్,7 మెప్మా,1డి.సి.ఎం.ఎస్. మొత్తం 148 కేంద్రాలను ఓపెన్ చేశామని, మరో రెండు రోజుల వ్యవధిలో మిగిలిన 92 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకుని వచ్చే ధాన్యం తేమ శాతం,ఇతర ప్రమాణాలను చెక్ చేసి ఎఫ్.ఏ.క్యు ఉన్న ధాన్యం మద్దతు ధర పై కొనుగోలు చేసీ ఓ.పి.ఎం.ఎస్.లో ఎంట్రీ చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్రక్ షీట్స్ ప్రకారం సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. జిల్లాలో ఉన్న ఖాళీ గోదాము లను సమీపంలో గల కోనుగోలు కేంద్రాలకు ట్యాగ్ చేయాలని కలెక్టర్ తెలిపారు.ప్రతి మండలం సమీపంలో గల గోదాములను ధాన్యం భద్ర పరిచేందుకు హైర్ పద్దతిలో తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, డిఏఓ అఫ్జలి బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద నివారణపై అవగాహన




హైదరాబాద్, ఏప్రిల్ 15(మనంన్యూస్)ః సిరిసిల్ల పట్టణంలోని పలు పాఠశాలలలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎస్ఎఫ్ఓ నరేందర్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అగ్ని ప్రమాద నివారణ పై అవగాహన కల్పించారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రేడియంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్, భారతి విద్యా నిలయం, శ్రీ చైతన్య పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను పంచారు. అనంతరం అగ్ని ప్రమాద నివారణ, నియంత్రణ పై ఎలాంటి చర్యలు తీసుకోవాలో క్లుప్తంగా వివరించారు.

## బిఆర్ఎస్ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ




హైదరాబాద్, ఏప్రిల్ 15(మనంన్యూస్)ః శంకరపట్నం మండలం వంకాయ గూడెం గ్రామంలోని మాధవ సాయి గార్డెన్ లో మంగళవారం బిఆర్ఎస్ భారీ బహిరంగ సభ పోస్టర్ ను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆవిష్కరించారు. ఎల్కతుర్తి లో నిర్వహించే బిఆర్ఎస్ భారీ బహిరంగ సభకు శంకరపట్నం మండలం నుండి 2000 మంది తరలిరావాలని సూచించారు, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని ఇరవై నెలలో ఆ పార్టీకి తీవ్ర వ్యతిరేకం వచ్చిందని వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తిరిగి అధికారులకు వస్తామని అన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్, మాజీ జెడ్పిటిసిలు లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి , మాజీ జెడ్పిటిసి పొద్దుటూరి సంజీవరెడ్డి, సర్పంచ్ ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పల్లె సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి.బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు




- మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రపాణి

మంచిర్యాల, ఏప్రిల్ 15( మనం న్యూస్)ః యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రపాణి సూచించారు. మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తుపదార్థాలను నిరోధించడానికి, విద్యార్థులలో అవగాహన పెంపొందించడానికి కళాశాల మత్తుపదార్థాల నిరోధక కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అయన పాల్గొన్నారు . ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లడారు .మత్తుపదార్థాల పై అవగాహన కలిగించే పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఏప్రిల్,16 న అనగా నేడు నిర్వహించే వివిధ అవగాహన కార్యక్రమాల లో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రిన్సిపాల్ కోరారు. ఈ సందర్భంగా కళాశాల మత్తుపదార్థాల నిరోధక కమిటీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను ప్రిన్సిపాల్ అభినందించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



హైదరాబాద్, ఏప్రిల్ 15(మనంన్యూస్)ః జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో, అప్రోచ్ రోడ్డు ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేనందున అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి ప్రదేశాల్లో రబ్బర్ స్ట్రిప్స్ , స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయుటకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేసి సంబధిత అధికారులకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రమాదాల నివారణకు ప్రస్తుతం రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రోడ్లపై వ్యూ అంతరాయం కలగకుండా పిచ్చి మొక్కలు పూర్తిస్థాయిలో తొలగించాలని, పెద్దగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో రేడియం సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతూ రావాలని, దాని కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అంతర్గత ప్రాంతాల్లో జరిగే ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని రోడ్డు మరమ్మత్తు ప్రాంతాల్లో శ్రద్ధ వహించాలని, అవసరమైన చోట డివైడర్లు స్పీడ్ బ్రేకర్లు,స్పీడ్ కంట్రోల్ సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ రైడింగ్, మద్యం తాగి వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించడం మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లా పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే తంగళ్ళపల్లి, తిప్పాపూర్ గీ రోడ్, గంభీరావుపేట్, కోనరావుపేట ముస్తాబాద్, చందుర్తి, బోయినపల్లి, కోదురుపాక జంక్షన్ వంటి 13 ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్ లకు గుర్తించి అక్కడ రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ అండ్ బీ. ఈ.ఈ. వెంకట రమణయ్య , జిల్లా రవాణా అధికారి లక్ష్మన్ , మున్సిపల్ కమిషనర్లు, సమ్మయ్య, పి.అర్.ఈఈ సుదర్శన్ రెడ్డి , జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు,ఆర్.టి.సి. అధికారులు, నేషనల్ హైవేస్, రీజినల్ ట్రాన్స్పోర్ట్ కమిటీ మెంబర్ సంగీతం శ్రీనాథ్, అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్ బ్రిడ్జిని పట్టుకొచ్చింది మేమే ప్రారంభించింది మేమే

- క్యాతనపల్లి ప్రజల దశాబ్ద కల నెరవేరింది
- క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభించిన ఎమ్మెల్యే



రామకృష్ణాపూర్,ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః గత కొన్ని సంవత్సరాల క్రితం క్యాతనపల్లి ప్రజలు ఎదుర్కొంటున్న ఫ్లైఓవర్ సమస్యపై స్పందించి ప్రజల అవసరాల నిమిత్తం ఫ్లైఓవర్ బ్రిడ్జిని మంజూరు చేయించింది మేమేనని నేడు దానిని పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేసి ప్రారంభించింది మేమేనని చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.మంగళవారం క్యాతనపల్లి ఫ్లైఓవర్ ను పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి సాకారం అయిందని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా పాలన కొనసాగిస్తుందని ఆయన తెలిపారు అందులో భాగంగానే క్యాతనపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని తెలిపారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జాప్యం జరిగాయని ఆయన పేర్కొన్నారు.దాదాపు పది సంవత్సరాల క్రితం నేను పెద్దపల్లి ఎంపీ గా ఉన్న సమయంలో బ్రిడ్జి మంజూరు కాగా గత పాలకుల జాప్యంతో బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు మళ్ళీ వివేక్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రత్యేక చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని ఆయన తెలిపారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ రోడ్ల నిర్మాణాలకు పెద్ద పీట వేసిందని అందులో భాగంగానే క్యాతన్పల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని ఆయన తెలిపారు. క్యాతనపల్లి ప్రజలకు మంచిర్యాలకు వెళ్లేందుకు ఇబ్బందుల నుండి ఉపశమనం కలిగిందని నేటి నుండి క్యాతనపల్లి రహదారి వ్యవస్థ మెరుగుపడిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టిపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధిశ్రీనివాస్, మాజీ చైర్మన్ జంగం కళ, వైస్‌చైర్మన్ సాగర్ రెడ్డి, నాయకులు గాండ్లసమ్మయ్య, అబ్దుల్ అజీజ్, యాకూబ్ అలీ, నీలం శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



మల్యాల, ఏప్రిల్ 15, ( మనం న్యూస్)ః మల్యాల మండలంలోని ఆయా గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బిజెపి మండలశాఖ అధ్యక్షులు గాజుల మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరికోతలు ప్రారంభమైయి సుమారు ఇరవై రోజులు గడిచాయని, రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో యధావిధిగా కుప్పలు తెప్పలుగా పోశారని, ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిచక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, మండలంలో ఇప్పటికే సగానికి పైగా వరి కోతలు పూర్తి అయ్యాయని, కానీ... ఇంతవరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతుల అవసరాలను దళారులు, మిల్లర్లు ఆసరాగా చేసుకొని రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని క్వింటల్ కి 1800 నుంచి 2000 లోపు తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను నిండా ముంచుతున్నారని అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు పాక్షికంగా దెబ్బ తిన్నాయని, మళ్లీ అకాల వర్షాలు సంభవిస్తే ఆరబోసిన ధాన్యం కూడా తడిసే ప్రమాదముందని, దానివల్ల రైతులు మరింత నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు.

## నిత్యవసర వస్తువుల పంపిణీ



- పేదలకు సాయం చేయడం సంతోషకరమైన విషయం
- కోట రవీందర్ రెడ్డి

రామగిరి ఏప్రిల్ 15 మనం న్యూస్: ఐన్టియుసి ఆర్జీ-3 ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్వచర్ల గ్రామంలో నివాసం ఉంటున్న మూడు నిరుపేద కుటుంబాలకు ఒక నెలకు సరిపడ నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. అనంతరం మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ మేము నిర్వహిస్తున్న కార్యక్రమాలు పత్రికల, సామాజిక మాధ్యమాల చూసి పేదవారి సహాయం చేయాలనే సంకల్పంతో మంగళవారం కోట రవీందర్ రెడ్డి స్పందించడం అభినందనీయమని తెలిపారు.అంతరం కోట రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి,సింగరేణి యువబలగం ప్రతినిధి మేకల మారుతి యాదవ్ ఆధ్వర్యంలో నిజమైన పేదలను గురించి సహాయం చేయడం మమ్ములను చలిచివేసింది అందులో భాగంగా నేను నా పుట్టిన రోజు సందర్భంగా నా వంతుగా సహాయం చేస్తానని గంట వెంకటరమణ రెడ్డి కి తెలపడం జరిగిందన్నారు.ఇతరులు కూడా మీ శుభకార్యాలలో పెద వారికి సహాయం చేసే విధంగా ఆలోచించాలి అని తెలిపారు. కార్యక్రమంలో మేకల మారుతి యాదవ్, ఐఎన్టియుసి సెంట్రల్ నాయకులు బెల్లం శ్రీనివాస్,బత్తుల రమేష్, పన్నూరు మాజీ ఎంపీటీసీ కొప్పుల గణపతి, వేముల తిరుపతి,అనవేన శ్రీనివాస్, శంకర్ ముదిరాజ్ ,కోట నికిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిప్రారంభించిన ఎమ్మెల్యే



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 16 ( మనం న్యూస్)ః మండల కేంద్రంలో మంగళవారం ప్యాక్స్ వారి ఆధ్వర్యంలో. నిర్వహిస్తున్న వరిధాన్య కొనుగోలు కేంద్రాన్ని. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి అమ్ముకోవాలన్నారు. దళారీలకు విక్రయించి మోసాలకు గురికావద్దని ఆయన తెలిపారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు కార్యాచరణ అమలు

- నిర్దేశించినలోపు గ్రామాలకు, వార్డులకు ఇందిరమ్మ ఇండ్ల అలాట్మెంట్ పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల పథకంపై అధికారులతో జిల్లా కలెక్టర్



హైదరాబాద్, ఏప్రిల్ 15(మనంన్యూస్)ః ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఇందిరమ్మ ఇండ్ల పథకం పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లు ఉండటానికి వీలు లేదని, మనకు వచ్చిన దరఖాస్తులలో అత్యంత నిరుపేదలకు మాత్రమే మొదటి విడతలో ఇండ్లు మంజూరు చేయాలని, మన జిల్లాలో రెండు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 7000 ఇండ్లు మొదటి విడతలో నిర్మిస్తున్నామని కలెక్టర్ సూచించారు.సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు పై పలు సూచనలు చేశారని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన 3,500 ఇండ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాలు ఎంపిక చేసిన గ్రామాలలో కొన్ని ఇండ్లు మంజూరు చేశామని, మిగిలిన ఇండ్లను గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా మంజూరు చేసేందుకు అలాట్మెంట్ తయారు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అర్హత ఉండి ఇంటి స్థలం ఉన్న దరఖాస్తుల సంఖ్య ప్రాతిపదికగా సదరు గ్రామాలకు, వార్డులకు ఇండ్ల కేటాయింపు ఏప్రిల్ 17 లోగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం గ్రామాలు, వార్డులలో ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి, అర్హుల జాబితాలో నుంచి మొదటి విడత మంజూరు చేసేందుకు గ్రామానికి అలాట్మెంట్ చేసిన ఇండ్ల సంఖ్యకు లబ్ధిదారుల ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు.ఏప్రిల్ 21 లోపు ఇందిరమ్మ కమిటీల నుంచి ప్రతి గ్రామానికి/ వార్డుకు అలాట్ చేసిన ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల జాబితా వివరాలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా ఇందిరమ్మ కమిటీల నుంచి సమాచారం రాకపోతే సంబంధిత ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ ఎంపీడీఓ లకు సూచించారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్ల లబ్ధిదారులకు ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి బృందంగా ఏర్పడి ఏప్రిల్ 22 నుంచి ఏప్రిల్ 30 వరకు మరోసారి ఫీల్ వెరిఫికేషన్ చేయాలని,ఎవరైనా అనర్హులు ఉంటే జాబితా నుంచి తొలగించాలని అన్నారు.మే 2,2025 న ప్రతి గ్రామంలో అర్హుల జాబితా అతికిస్తామని, జిల్లా ఇంఛార్జి మంత్రి వర్యుల తుది ఆమోదంతో మే 5 తరువాత ఇందిరమ్మ ఇండ్లు మంజూరి పత్రాలు పంపిణీ మండల కేంద్రాలకు అందించడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ కమిటీ లో నుంచి జాబితా తెచ్చుకునే అంశంలో అధికారులు, ఆర్డిఓ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు నాలుగు దశలలో సహాయం అందుతుందని, బేస్మెంట్ పూర్తయితే 1లక్ష రూపాయలు, లెంటల్ లెవెల్ పూర్తయితే 1లక్ష , స్లాబ్ నిర్మాణం జరిగినప్పుడు 2 లక్షలు, ఇంటి నిర్మాణం మొత్తం పూర్తయిన తర్వాత 1 లక్ష చొప్పున మొత్తం 5 లక్షల రూపాయల ప్రభుత్వం నుంచి విడుదల చేయడం జరుగుతుందని అన్నారు మన జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలలో 1023 ఇండ్లు మంజూరు చేశామని, వీటిలో 282 ఇండ్లు మాత్రమే ఇప్పటివరకు మార్క్ చేయడం జరిగిందని, పెండింగ్ లబ్ధిదారులతో చర్చించి ఇండ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించేలా చూడాలని, ముందస్తుగా నిధులు ఇబ్బందులు ఉన్నవారికి స్వశక్తి మహిళా సంఘాల ద్వారా రుణం అందించి పనులు ప్రారంభించాలని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి రాధా భాయి, పిడి. హౌసింగ్ శంకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి , జడ్పీ సీఈఓ వినోద్ కుమార్, మండల ప్రత్యేక అధికారులు ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామిని దర్శించుకున్న రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



కోరుట్ల ఏప్రిల్15 (మనం న్యూస్)ః కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామం లో నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మంగళవారం పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావుతో పాటు కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడుపన్నాల అంజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెరుమళ్ళ సత్యనారాయణ మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆసి రెడ్డి రాజేశం రంజిత్ రెడ్డి కాశిరెడ్డి జనార్ధ న్ వి డి సి సభ్యులు ఆయా కుల సంఘాల సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి



జైపూర్, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి ని కోరారు.జైపూర్ మండలంలోని సింగరేణి విద్యుత్ థర్మల్ పవర్ ప్లాంట్ ముందు మంగళవారం కాంట్రాక్టు కార్మికులతో హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏర్పాటు చేసిన విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేసిన విధంగా మండలంలోని పవర్ ప్లాంట్ లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని ఉప ముఖ్యమంత్రిని కోరారు.పవర్ ప్లాంట్ కు ఆనుకొని ఉన్న పెగడపల్లి గ్రామం లో ప్లాంట్ నుండి వెలువడే దుమ్ముతో కలుషిత వాతావరణం చెంది భవిష్యత్తులో ప్రజలు క్యాన్సర్ తో పాటు అనేక రోగాల బారిన పడే ప్రమాదం ఉందని నివేదికలు బయట పడ్డాయని తెలిపారు.దీన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గమనించి పెగడపల్లి గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ పరిధిలోనికి తీసుకువచ్చి అన్ని సదుపాయాలు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ యూనియన్ సెంట్రల్ కమిటీ నాయకులు తిప్పారపు సారయ్య, ఎస్ టి పి పి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు విక్రమ్,సాయి, కృష్ణారెడ్డి,సంపత్ కుమార్,రిక్కుల నరసింహారెడి, శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి,సహాయ కార్యదర్శి నోముల బాలయ్య,కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రంలో పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



మహబూబ్ నగర్, ఏప్రిల్ 15 (మనం బ్యూరో): ఉదండ పూర్ రిజర్వాయర్ నిర్మాణం లో ముంపునకు గురైన నిర్వాసితులకు పునరావాస కేంద్రంలో మౌలిక సదుపాయాల పనులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మంగళ వారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.గ్రామాల వారీగా పునరావాస కేంద్రం లో మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జడ్చర్ల మండలం దేవుని గుట్ట తండా వద్ద రేగడి పట్టి తండా,చిన్న గుట్ట తండా ,వల్లూరు, ,ఉదండ పూర్,తుమ్మల కుంట తండా,ఒంటి గుడిసె తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు లోకేషన్ 1,2 ప్రాంతాల్లో చేపట్టిన పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,అర్.డి. ఓ,ఇంజినీరింగ్ అధికారులు,కాంట్రాక్టర్ లతో కలిసి సుమారు మూడు గంటల పాటు కాలినడకన ఎండ తీవ్రత ను లెక్క చేయకుండా పునరావాస కేంద్రం లో కలెక్టర్ స్వయంగా పనుల ప్రగతిని పరిశీలించి సమీక్షించారు.పునరావాస కేంద్రం లోకేషన్ 1లో రేగడి పట్టి తండా,చిన్న గుట్ట తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు 151 ప్లాట్ లలో చేపట్టిన మిషన్ భగీరథ త్రాగు నీరు సరఫరా పైపు లైన్,ట్యాంక్ ల నిర్మాణ పనులు,డ్రైన్స్,విద్యుత్ పనులు పూర్తి చేయడం జరిగినట్లు అధికారులు వివరించారు.ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి కేంద్రం నిర్మాణం చేయనున్న స్థలం పరిశీలించారు.మిగిలిన పనులు వెంటనే పూర్తి చేసి నిర్వాసితులకు ప్లాట్ లు కేటాయింపు చేయడానికి సిద్ధం చేయాలని అన్నారు.

పునరావాస కేంద్రం లోకేషన్ 2 లో వల్లూరు, ,ఉదండ పూర్,తుమ్మల కుంట తండా,ఒంటి గుడిసె తండా, శామగడ్డ తండా ముంపు గ్రామాల నిర్వాసితులకు చేపట్టిన పనుల ప్రగతి పరిశీలించారు పనులు పురోగతి లో వాటిని సమీక్షించారు. పనుల ప్రగతి ప్రతి వారం కలెక్టర్ కార్యాలయం లో సంబధిత అధికారులతో నిర్వహించే సమావేశాల్లో సమీక్షించి పనుల ప్రగతి ఎంత వరకు చేశారు.చేయ వలసిన పనులు గురించి క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో అధికారులతో సమీక్షిస్తూ పనుల ప్రగతి లో మందగతి లో ఉంటే అధికారులను మందలించి సూచనలు ఇస్తూ పనులను అత్యంత ప్రాధాన్యత నిచ్చి వేసవి లో పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.నిర్వాసితుల సమస్యలు విని పరిష్కారం చేస్తానని సూచించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,స్పెషల్ కలెక్టర్ మధుసూదన్,అర్.డి. ఓ.నవీన్, ఇరిగేషన్ ఎస్. ఈ.చక్ర ధరం,మిషన్ భగీరథ ఎస్. ఈ.జగన్మోహన్,సర్వే లాండ్ రికారడ్స్ ఏ.డి.కిషన్ రావు,ఇరిగేషన్ ఈ ఈ లు జె.రమేష్,ఉదయ్ కుమార్, మిషన్ భగీరథ ఇంట్రా ఈ ఈ.పుల్లారావు,మౌలిక విధ్య సదుపాయాల సంస్థ ఈ ఈ రాం చందర్,జడ్చర్ల తహశీల్దార్ నర్సింగ రావు,డి.ఈ.లు, ఏ.ఈ.లు తదితరులు ఉన్నారు.

# మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



సంగారెడ్డి, ఏప్రిల్ 15(మనంప్రతినిధి): జిల్లాలో ఉన్న ప్రాధమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారుల ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 34 సంఘాలకు నిర్వహించాలన్నారు. అందులో 11 మత్స్య పారిశ్రామిక సంఘాల కు బ్యాలెట్ బాక్సల ద్వారా ఎన్నికలు నిర్వహించబడతాయని, మిగిలిన 23 ప్రాధమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల హ్యాండ్ రైజింగ్ ద్వారా అధ్యక్షులను ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. పోలింగ్ కేంద్రాలఏర్పాటుకు కొరకు రెవెన్యూ అధికారులకు తగు చూచనలు జారీచేశారు. పోలింగ్ కేంద్రాల్లో త్రాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, మౌలిక వసతులు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఎన్నికల కోసం ఎన్నికల సిబ్బందిని సిద్ధం చేయాలని, వారికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని కోపరేటివ్ అధికారులు ఆదేశించారు. జిల్లాలో ఏవైనా సమస్యత్మక పోలింగ్ కేంద్రాలు ఉంటే గుర్తించి, పోలీస్ సిబ్బందిని నియమించాలని పోలీస్ శాఖను ఆదేశించారు. సహకార శాఖ, పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘల ఎన్నికలను పూర్తి చేయాలన్నారు. ప్రాధమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యేవరకు ఎన్నిక లులకు ఏర్పాట్లు పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీసంజీవ్ రావు, జిల్లా మత్యశాఖాధికారి ఆర్ ఎల్ మధుసూదన్, డిపిఓ సాయి బాబా, డిసిఓ కిరణ్ కుమార్, ఆర్డిఓ లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు .

# భూ భారతిని సమర్ధవంతంగా క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాలి



- 17 నుంచి 30 వరకు రైతులకు అవగాహన సదస్సులు

జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి, ఏప్రిల్ 15 (మనంప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక భూ చట్టం' భూభారతి' ని సమర్ధవంతంగా, క్షేత్ర స్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రెవెన్యూ అధికారులకు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్లో రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. తేదీ :16-04-2025 రోజు బుధవారం ,రెవెన్యూ అధికారులకు శిక్షణ , రైతులకు తేదీ : 17 నుంచి 30 వరకు మండలాలవారీగా అవగాహన సదస్సులు వుంటాయని అన్నారు . నూతన భూభారతి పోర్టల్ ను ఓపెన్ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్టాత్మక నూతన భూ చట్టం భూభారతిని సమర్ధవంతంగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అధికారులు ఆదేశించారు. భూభారతి రైతుల సమస్యలు పరిష్కరించి, భూముల వివాదాలు లేకుండా జిల్లాను తీర్చిదిద్దాలని అన్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా ఉండేందుకు భూభారతిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా,గ్రామ, మండల ,జిల్లా స్థాయిలో రైతులు ప్రజలు లేవనెత్తే సందేహాలకు అర్థమయ్యే భాషల్లోని సమాధానాలు చెప్పి , భూ సమస్యలకు పరిష్కారాలు చూపాలని, రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులు ఈ అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలనీ అన్నారు .

# ఎస్సీ వర్గీకరణ అమలు చారిత్రాత్మక ఘట్టం

- దేశంలోనే తొలి రాష్ట్రంగాతెలంగాణ రికార్డు



కరీంనగర్‌టౌన్,ఏప్రిల్15 (మనంన్యూస్)భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ జయంతి సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మక ఘట్టమనీ కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. మంగళ వారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాల 30 ఏళ్ల కల సాకారమైందని, ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న రాష్ట్రంగా దేశంలోనే తెలంగాణ రికార్డు సాధించిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు ప్రత్యేక కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ దామోదర రాజనర్సింహ, మెంబర్ పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విజన్ ను నిజం చేస్తూ ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరిం చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం జరగాలని, ప్రజల మధ్య సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు తొలగిపోవాలనే ఉద్దేశంతో అంబేద్కర్ లక్ష్యాన్ని కనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ ప్రక్రియను విజయవంతంగా చేపట్టిందని చెప్పారు.వర్గీకరణ అమలుపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారని, ఆ మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం సాహసోపేత నిర్ణయం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కుల గణన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని, ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కూడా పరిష్కరించిందని చెప్పారు. ఈ రెండు కీలక నిర్ణయాలు అమలు చేయడం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే మడమ తిప్పదని మరోసారి రుజువు చేసిందని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికత, పట్టుదలే కారణమని రాజేందర్ రావు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ



దౌల్తాబాద్, ఏప్రిల్ 15, మనం న్యూస్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సూరంపల్లి గ్రామంతో పాటు వివిధ గ్రామాలలో ఏపిఎం యాదగిరితో కలిసి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. రైతులు ఆరుకాలం కష్టం చేసి వచ్చే పంటను దళారుల చేతిలో పెడితే రైతులను నట్టేట ముంచుతున్నారని వారు తెలియజేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్రాల్లోనే విక్రయించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఏ గ్రేడుకు రూ. 2320, బి గ్రేడ్ కు రూ. 2300 నిర్ణయించిన ధరలకు విక్రయించుకోవాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని తమకల్లాల వద్ద ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని విక్రయించే ముందు తమ పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్ జిరాక్సులను కొనుగోలు కేంద్ర దారులకు ఇవ్వాలని తెలియజేశారు. ధాన్యం విక్రయించిన తర్వాత 72 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయిపోయాయని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ చంద్రశేఖర్, ఎంపీఓ గఫూర్ కాద్రి , తాజా మాజీ సర్పంచ్ అయ్యగారి నర్సింలు, సిసి సునీత, ఏఈఓ సంతోష్, పంచాయతీ సెక్రెటరీ విద్యాసాగర్, అనిత, మహేందర్, శ్యామల, లతతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ,పేదలకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు




సంగారెడ్డి, ఏప్రిల్ 15(మనంప్రతినిధి): అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ అధికారులు,గృహ నిర్మాణ శాఖ అధికారులు, మునిసిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, జిల్లా లో వేసవిలో త్రాగునీటి ఇబ్బంది ఎత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ అర్హతల పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఈ నెల 18 నుంచి 21 వరకు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామా, మండల ప్రత్యేక అధికారుల సమన్వయంతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఇప్పటికే జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా చేసిన గ్రామాలు కాకుండా జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల గుర్తింపు కావాలని తెలిపారు.

ఈనెల 17 నుంచి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న లిస్టును అధికారులకు అందిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న దానిలో అర్హత గల వారిని గుర్తించాలన్నారు. లబ్ధిదారులకు లిస్టును మే 2 తారీఖున డిస్ప్లే చేస్తామన్నారు. నియోజవర్గానికి 3500 ఇండ్లు తోపాటు 20 శాతం అదనంగా జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం కేటాయించిందన్నారు. వేసవిలో తాగునీటి అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిషత్ సీఈవో జానకి రెడ్డి , జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, పిడి హౌసింగ్ చలపతిరావు, అడిషనల్ డి ఆర్ డి ఓ బాలరాజు, ఎంపీడీవోలు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రుతుస్రావం అనారోగ్యం కాదు.. సృష్టికి మూలం

- డీపీవో దేవకీ దేవి



కోహెడ,ఏప్రిల్ 15,(మనం న్యూస్): రుతుస్రావం అనారోగ్యం కాదు.. సృష్టికి మూలం అని డీపీవో దేవకీ దేవి అన్నారు. మండల పరిధిలోని తీగలకుంటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళలకు, యువతులకు మెన్ స్ట్రువల్ కప్, క్లాత్ ప్యాడ్స్ వినియోగం పై మంగళవారం సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా డిపిఓ దేవకిదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు మెన్ స్ట్రువల్ కప్, క్లాత్ ప్యాడ్లనే వాడాలని అన్నారు. మహిళలు సహజంగా ఎదుర్కొంటున్న సమస్య పీరియడ్స్. అలాంటి పీరియడ్స్ పై బహిరంగ చర్చ జరగడం మహిళల అభ్యుదానికి ప్రతీక అని తెలిపారు. రుతు స్రావ సమయంలో శానిటరీ ప్యాడ్స్ వాడటం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. అవి భూమిలో కలిసి పోవాలంటే కొన్నేళ్ల సమయం పడుతుందని దీనివల్ల పర్యావరణానికి ముప్పు కలుగుతుందని తెలిపారు. యువతులు మహిళలు ఉపయోగిస్తున్న శానిటరీ ప్యాడ్స్ కు బదులు మెన్ స్ట్రువల్ కప్, క్లాత్ ప్యాడ్స్ వినియోగించాలనీ సూచించారు. క్లాత్ ప్యాడ్లను ఉపయోగిస్తే తడి కూడా ఉండదని, తిరిగి ఉతుక్కుని కొన్నేళ్లపాటు వినిగించుకోవచ్చని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రుతుస్రావ సంబంధమైన అలవాట్లను మార్చుకోవాలనీ, క్లాత్ ప్యాడ్స్, మెన్ స్ట్రువల్ కప్ ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. క్లాత్ ప్యాడ్స్ వాడటం వల్ల ఆరోగ్య సమస్యలు అధిగమించడంతోపాటు డబ్బు ఆదా, పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుందన్నారు. ప్లాస్టిక్ కెమికల్స్ కలిగిన ప్యాడ్ వల్ల మహిళల ఆరోగ్యానికే కాదు పర్యావరణానికి కూడా ప్రమాదమేనని చెప్పారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని మెడికల్ గ్రేడ్ సిలికాన్ తో తయారు చేసిన మెన్ స్ట్రువల్ కప్ ను పరిచయం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మహిళలకు, యువతులకు ఉచితంగా మెన్ స్ట్రువల్ కప్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సెత్విన్ కోఆర్డినేటర్ అమీనా, తీగలకుంటపల్లి ప్రత్యేక అధికారిని కవిత, హెల్త్ సూపర్వైజర్ సుభద్ర, ఎంపీఓ శోభ, పంచాయతి కార్యదర్శి నిహారిక, అంగన్వాడీ టీచర్లు, వివోఏలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పలు గ్రామాల మహిళ కార్యదర్శిలు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- ప్లాస్టిక్ నిషేధంపై మహిళా శక్తిని చాటాలి
- మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 15, మనం న్యూస్: మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ అన్ని రంగాలలో ముందంజలో నిలవాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ అన్నారు. మంగళవారం రోజున మెప్మా సిబ్బందితో మున్సిపల్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్.పి లు తమతమ వార్డులలో పర్యటిస్తూ పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంకై మహిళా సంఘాల సభ్యులు ముందడుగు వేయాలని టిఫిన్ సెంటర్ లు, హోటళ్లు, పండ్లు, పాల వ్యాపారులు, మార్కెట్ లలో ప్లాస్టిక్ వాడకం వలన వేడి వేడి ఆహార పదార్థాలు కవర్ లలో వేసినప్పుడు వేడికి అట్టి ప్లాస్టిక్ ఆహార పదార్థాలలో కరిగి క్యాన్సర్ వంటి మహమ్మారి బారిన పడే అవకాశం ఉందని ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా ఎకో లాస్టిక్ కవర్లను వినియోగించేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ నిషేధం కోసం మహిళలు ముందడుగు వేస్తూ ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయం అయిన ఎకో ప్లాస్టిక్ కవర్లను మహిళా సంఘాల సభ్యులు దుకాణాలకు, హోటల్ లకు, టిఫిన్ సెంటర్ వారికి విక్రయించి మహిళలు లాభాలను గడించి ఆర్థికంగా బలోపేతం కావచ్చన్నారు. ఎకోలాస్టిక్ ఉత్పత్తులు 100% కంపోస్టబుల్ బయోప్లాస్టిక్లతో తయారు చేయబడతాయనీ వీటిలో ఎక్కువ భాగం మొక్కజొన్న పిండిని కలిగి ఉంటాయి కావునా ప్లాస్టిక్ మహమ్మారి బారిన పడకుండా ఉండగలమన్నారు.

మహిళా సంఘాల సభ్యుల కొరకు ఎకో లాస్టిక్ కవర్ ల నిల్వ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని అరికడదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంతోషి ,జ్యోతి , ఆర్.పి. లు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ




- సచివాలయంలో ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- జిల్లాలో పలువురికి అందించిన అడిషనల్ కలెక్టర్ గరిమఅగర్వాల్

సిద్దిపేట, ఏప్రిల్ 15(మనంప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ప్రారంభించడం జరిగిందని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. మంగళవారం రోజున హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇతర శాఖల మంత్రులతో కలిసి వివిధ జిల్లాలలో ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులలో బేస్ మెంట్ లెవెల్ పూర్తి చేసిన లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్కును అందజేశారు. కాగా సిద్దిపేట జిల్లా నుండి బేస్మెంట్ లెవెల్ పూర్తిచేసిన లబ్ధిదారులలో ఎంపికైన వారిలో కోహెడ మండలం పోరెడ్డి పల్లి గ్రామం దబ్బెటకు చెందిన రాజవ్వ, సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామంకు చెందిన గోపగాని లచ్చవ్వ వీరిరువురికి ముఖ్యమంత్రి లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అనంతరం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ కి సీఎం అందించిన చెక్కులు చూపిస్తూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ చేతుల మీదుగా చెక్కులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చేతుల మీదుగా చెక్కులు స్వీకరించిన ఇద్దరు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదలైన తర్వాత 2667 ఇండ్ల మంజూరు, 606 ఇందిరమ్మ ఇండ్లు ముగ్గు పోసారని , 156 బేస్ మెంట్ లెవెల్ పూర్తయ్యాయని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఎప్పటికపుడు చెక్కులు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ దామోదర్ రావు, ఆయా మండల ఎంపీడీవోలు పంచాయతీరాజ్ ఏఈలు పాల్గొన్నారు.

# దుబ్బాక ఎమ్మెల్యే పై రాజ ద్రోహం కేసు నమోదు చేయాలి

- దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి




తొగుట, ఏప్రిల్ 15(మనం న్యూస్): కార్పొరేట్ శక్తులతో కాంగ్రెస్ ప్రభుత్వంను పడగొడుతామన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై రాజ ద్రోహం కింద కేసు నమోదు చేయాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా తొగుట మండల కేంద్రంలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి తొగుట పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ రవికాంత్ రావుకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పైన పిర్యాదు చేసి అనంతరం ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి రోజు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రజా ప్రభుత్వాన్ని కూలుస్తామనడం సిగ్గుచేటని, ప్రజల ఓట్లతోనే గెలవాలి తప్ప డబ్బులతో ప్రభుత్వాన్ని కూల్చే దిశగా ఎమ్మెల్యేల వ్యాపారవేత్తలకు తొత్తుగా మారి డబ్బులతో ఎమ్మెల్యేలను కొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తా అనుకోవడం ఆయన నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు.

ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల ఓట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఆ ప్రభుత్వాన్ని డబ్బులతో ఎమ్మెల్యేలను కొని పడగొడతాననడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. గత వారం దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో దుబ్బాక నియోజకవర్గంలో పది సంవత్సరాల కాలంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరుగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుబ్బాకకు నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధికి బాటలు వేస్తున్నాడని మాట్లాడింది మీరు కాదా అని ప్రశ్నించారు.

అంతలోనే ప్రభుత్వాన్ని కూలుస్తామనడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, మాజీ ఎంపీపీలు గాంధారి లత నరేందర్ రెడ్డి, గంట రవీందర్, మండల పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్, సీనియర్ నాయకులు పాగాల కొండల్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మల్లారెడ్డి, సోలిపేట ప్రసాద్, విజయ్ పాల్ రెడ్డి, పంది రాజు, నిరంజన్ రెడ్డి, సిద్ది శ్రీనాకర్ రెడ్డి, ఓలపు నారాయణ, భరత్, జీడిపల్లి స్వామి,యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, సాజిద్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులకు అందాలి

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్క్రూటిని ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలి

- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలి
- వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు
- రెవెన్యూ సదస్సులకు కార్యాచరణ చేపట్టాలి
- అధికారులతో సమీక్ష చేసిన ఇంచార్జ్ కలెక్టర్



**ఖమ్మం, ఏప్రిల్ 15(మనం బ్యూరో):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల లబ్ధి అర్హులకు అందేలా పకడ్బందీగా కార్యాచరణ అమలుచేయాలని ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అధికారులతో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, తాగునీరు, భూ భారతి లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టారని, ఈ పథకం ద్వారా చిన్న తరహా పరిశ్రమలు లేదా యూనిట్ల ఏర్పాటుకు యువతకు సబ్సిడీతో 4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎస్సి కార్పొరేషన్ ద్వారా 29091, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 14220, బీసీ కార్పొరేషన్ ద్వారా 41881, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 6658 దరఖాస్తులు, మొత్తంగా 91850 దరఖాస్తులు సోమవారం నాటికి అందినట్లు, అన్ని దరఖాస్తులు ఆన్లైన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయమై అర్హులై, ప్లాట్లు ఉన్న ఎల్1 జాబితాను ఎంపిడివో సంతకంతో తీసుకొని, ఆమోదం కొరకు ఇందిరమ్మ కమిటీ ముందు ఉంచాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదం తర్వాత మండల ప్రత్యేక అధికారి ఆయా జాబితాను జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యుల ఆమోదం కొరకు సమర్పించాలన్నారు. ఇంచార్జ్ మంత్రుల ఆమోదం తప్పనిసరి అని తెలిపారు. వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటికి ఎక్కడా సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. నియోజకవర్గాల వారిగా కావాల్సిన పనుల విషయమై నివేదిక సమర్పించాలన్నారు. ఇంట్రా, గ్రిడ్ లకు 1 లేదా 2 బఫర్ లు పెట్టాలన్నారు. కొత్తగా కాలనీలు, హాబీటేషన్ లు ఏర్పడ్డ చోట పైప్ లైన్ పొడిగింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వనరుల మరమ్మత్తులు, ప్రత్యామ్నాయ వనరులు, వనరులు లేనిచోట మున్నగు వాటికి ఖర్చు విషయమై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అత్యవసర త్రాగునీటి అవసరాల నిమిత్తం కలెక్టర్ వద్ద నిధుల మంజూరికి పనుల గుర్తింపు వెంటనే చేపట్టాలన్నారు. భూ భారతి అమలుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. భూ భారతి అమలు విషయమై పైలట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేశారని తెలిపారు. మండల హెడ్ క్వార్టర్స్ లో భూ భారతి చట్ట అమలుపై అవగాహన కార్యక్రమం చేపడతామన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ఏర్పాటుకు షెడ్యూల్ రూపొందించాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల విజయవంతానికి తహసీల్దార్, ఎంపిడివో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో లబ్ధిదారుల సమీకరణ, అవగాహన కల్పనకు పటిష్టమైన ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎంపిడిఓ లు, ఎంపీవో లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మున్నేరు, తీగల వంతెన భూ నిర్వాసితులతో
# అదనపు కలెక్టర్ భేటీ...

- అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ

**ఖమ్మం, ఏప్రిల్ 15(మనం న్యూస్):** ప్రభుత్వం చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్వాసితులు, తీగల వంతెన బాధితులతో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ తో చర్చలు జరిపి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, పార్టీ డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ 2013 సంవత్సరం ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. నిర్వాసితులకు న్యాయం తగిన న్యాయం చేయడంలో అధికారులు ఒక తీరుగా, మంత్రులు ఒక తీరుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు నగరంలోనే ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు, తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు నిర్వాసితులకు భూమి ఇవ్వడానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం వద్ద రైతుల భూములు లాక్కుంటే సహించేది లేదని హెచ్చరించారు. రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి 2013 చట్టం కింద నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకోవైపు తీగల వంతెన కోసం 100 కుటుంబాలు నష్టపోతున్నారు అని వారికి కూడా తగిన విధంగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు తీగల వంతెన దాదాపు నయా బజార్ వరకు రావడంతో అక్కడ చిరు షాపుల యాజమానులు నష్టపోతారని వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఒఇ మాట్లాడుతూ బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో పార్టీ త్రీ టౌన్ కార్యదర్శి భుక్యా శ్రీనువాసురావు, కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, ఖాసీం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని గిరిజన రైతు బలవన్మరణం

**ఆళ్లపల్లి, ఏప్రిల్ 15 (మనం న్యూస్):** ఓ గిరిజన రైతు ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని ముత్తాపురం గ్రామానికి చెందిన పూసం బాబు (45) అనే గిరిజన రైతు మంగళవారం తెల్లవారుజాము ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రతి రోజు లాగానే సోమవారం రాత్రి పడుకున్న కుటుంబ సభ్యులు ఉదయం లేచి చూసేసరికి బాబు ఇంట్లో ఉరివేసుకుని మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. మృతునికి గత 3 నెలల క్రితం రోడ్డు ప్రమాదం జరిగిందనీ, ఆ ప్రమాదంలో కాలు విరిగి ఇప్పుడిప్పుడే కొంచెం ఆసరా పట్టుకుని నడుస్తున్న క్రమంలో ఇలా ఆత్మహత్య చేసుకోవడం తన కొడుకు పెళ్లి సైతం ఇటీవల జరగనుందని సమీప బంధువులు తెలిపారు. 8 నెలల క్రితం బాబు భార్య సైతం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చందనం జరిగింది. ఏడాది లోపే భార్యాభర్తలు వేర్వేరు కారణాలతో మరణించడంతో బాబు కు పెళ్లి కావాల్సిన కొడుకు, కూతురు రఘువరన్, రమ్య అనాధలుగా మారారు. తండ్రి మృతితో వారు విలపిస్తున్న తిరు ప్రతి ఒక్కరి చేత కంతతడి పెట్టించింది. బాబు మృతితో ముత్తాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏది ఏమైనా బాబు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# ఖమ్మం-మహబాద్ రోడ్డుకు వనజీవి రామయ్య పేరు పెట్టాలి

- రామయ్య కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎంపీ వద్దిరాజు



**ఖమ్మం, ఏప్రిల్ 15(మనం న్యూస్):** తన జీవితం మొత్తం మొక్కలు నాటాడానికే అంకితం చేసిన పద్మశ్రీ దరిపల్లి రామయ్య ధరిత్రి ఉన్నంతకాలం చిరస్థాయిగా నిలిచి ఉంటారని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఇటీవలే మృతి చెందిన వనజీవి రామయ్య కు మంగళవారం రవిచంద్ర నివాళులు అర్పించారు. రెడ్డిపల్లి లోని ఆయన నివాసానికి వెళ్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన, అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వద్దిరాజు మాట్లాడుతూ.. రామయ్య పేరు ఎప్పటికీ గుర్తుండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం - మహబూబాబాద్ రోడ్డుకు వనజీవి రామయ్య మార్గ్ పేరుతో నామకరణం చేయాలని కోరారు. ఖమ్మం నుంచి రెడ్డిపల్లి వరకు 8 కిమీ మేర వనజీవి రామయ్య మొక్కలు నాటారని గుర్తు చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆ చెట్లన్నీ కూల్చేసినందున, మళ్ళీ అదే వరసలో మొక్కలు నాటి.. సంరక్షించి రామయ్య కు నివాళులు అర్పించాలని కోరారు. ఈ విషయం లో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. రామయ్య చరిత్ర భావి తరాలకు తెలిసేలా కర్ణాటక తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా పాఠ్య పుస్తకాల్లో ఆయన చరిత్రను ప్రవేశ పెట్టాలని కోరారు. జిల్లాలో కూడా ఆయన స్మారకం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఇటు బస్సు రాదు..అటు రైలు పోదు..

- ఉద్యోగం చేసే ప్రాంతానికి చేరేది ఎలా...?
- బస్సు బస్సు సర్వీసు లేక ఇబ్బందులు
- నర్సంపేట డిఎంకు ఉత్తరం రాసిన ఎంఇఓ



**ఇనుగుర్తి, ఏప్రిల్ 15 (మనం న్యూస్):** నర్సంపేట నుండి వయా నెక్కొండ ,ఇనుగుర్తి, నెల్లికుదురు నుండి తొర్రూర్ కు బస్సు సర్వీస్ నడపాలని ఇనుగుర్తి మండల విద్యాధికారి రూపారాణి నర్సంపేట మేనేజర్ డిపో మేనేజర్ కు ఉత్తరం రాశారు. నర్సంపేట, నెక్కొండ, వరంగల్ ప్రాంతాల నుంచి ఇనుగుర్తి మండల కేంద్రానికి రావాల్సిన ఉద్యోగులు బస్సు సర్వీసులు లేక ఇబ్బందులు గురవుతున్నామని ఉదయం ఉద్యోగానికి రావాలన్నా, సాయంత్రం ఉద్యోగం ముగించుకున్న తర్వాత గమ్యస్థానానికి చేరాలన్నా బస్సు సర్వీస్ లేక నానా తంటాలు పడుతున్నామని ఎంఈఓ రూపారాణి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తొర్రూర్ నుండి ఇనుగుర్తి వయా నర్సంపేటకు రెండు బస్సు సర్వీసులు ఉండేవని, ఇప్పుడు ఒక్క బస్సు కూడా నర్సంపేట వైపుకు వెళ్లకపోవడంతో నర్సంపేట, నెక్కొండ, వరంగల్ వెళ్లాల్సిన ఉద్యోగులకు, ప్రయాణికులుకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. సత్వరమే బస్సు సర్వీసులు ప్రారంభించాలని డిఎంను ఉత్తరంలో కోరారు.

# గులాబీ దండు కదం తొక్కాలి

- 27న భారీగా తరలి రావాలి
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**ఇల్లెందు, ఏప్రిల్ 15(మనం న్యూస్):** వరంగల్‌లో జరిగే సభకు ఇల్లెందు నియోజకవర్గం నుంచి గులాబీ దండు వేలాదిగా కదం తొక్కాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. ఈ సభకు హాజరయ్యే పార్టీ శ్రేణులను చూసి కాంగ్రెసోళ్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలని అన్నారు. మాజీ శాసనసభ్యురాలు బాణోత్ హరిప్రియా నాయక్ అధ్యక్షతన మంగళవారం ఇల్లెందు నియోజకవర్గ పార్టీ విస్తృత సమావేశం జరిగింది. ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరంగల్ లో పది లక్షల మందితో జరిగే సభలో.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏం మాట్లాడుతరోనని తెలంగాణ ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఏడాదిన్నరకే ప్రజలు విసిగి, వేసారి పోయారని అన్నారు. ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయలేక చేతులెత్తేశారని విమర్శించారు. కేసీఆర్ ను దూరం చేసుకుని తప్పు చేశామని ప్రజలంతా పశ్చాత్తాప పడుతున్నారని అన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేద్దామని భ్రమ పడుతున్న ముఖ్యమంత్రి.. తాను కూర్చున్న కుర్చీ కూడా కేసీఆర్ పెట్టిన భిక్షే అని గుర్తెరగాలని అన్నారు. కేసీఆర్ పోరాటం చేయకపోతే ఇవాళ రాష్ట్రమే వచ్చేది కాదని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. వరంగల్ సభ విజయవంతానికి దిశా నిర్దేశం చేశారు. బహిరంగ సభకు హాజరయ్యే ముందు పార్టీ కార్యకర్తలంతా తమ తమ గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించుకుని బయలుదేరాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గ్రంధాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, మహబూబాబాద్ జెడ్పీ మాజీ చైర్మన్ ఆంగోత్ బిందు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ లక్కినేని సురేందర్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు సంజీవ్ నాయక్, వివిధ మండలాల పార్టీ బాధ్యులు శీలం రమేష్, బొమ్మెర ప్రసాద్, తాతా గణేష్, లక్ష్మణ్ నాయక్, పరుచూరి వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ నాయకులు రంగనాథ్, జాఫర్ హుస్సేన్, జెకె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు ఆఫీసర్ కు సన్మానం



**ఖమ్మం, ఏప్రిల్ 15(మనం న్యూస్):** ఉద్యోగ విరమణ పొందిన సత్తుపల్లి యూనిట్ హోంగార్డు ఆఫీసర్ మిట్టపల్లి వాణిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఘనంగా సన్మానించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా హోంగారడ్స్ యూనిట్ ఆఫీసర్ ఆర్ ఐ శ్రీ ఎం సురేష్, హెడ్ కానిస్టేబుల్ నవీన్ కుమార్, ఖమ్మం జిల్లా హోం గారడ్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బంక శ్రీను, జాతీయ ఉపాధ్యక్షులు ఉ వేంకటేశ్వర్లు, నీరజ, డి .రమేష్ డి.రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అల్లీనగరంలో బడిబాట



**మధిర, ఏప్రిల్ 15(మనం న్యూస్):** మధిర మండల పరిధిలోని అల్లినగరం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి పాంప్లెట్స్ ద్వారా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలను వివరించటం జరిగింది అలాగే ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేసుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించడం ద్వారా ముందుకు కొనసాగుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెల్లమేకల శ్రీనివాసరావు తెలియజేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు విద్యార్థుల కోసం అమలు చేయడం జరుగుతుంది. పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం లో విద్య బోధన మధ్యాహ్న భోజనం ఉచిత పాఠ్యపుస్తకాలు ఉచిత యూనిఫారమ్స్ లాంటి అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని గ్రామస్తులకు తెలిపారు.

# పార్ట్ టైం లెక్చరర్లకు యూజీసీ పే స్కేల్ అమలు చేయాలి

- 17 న చలో సెక్రటేరియట్ కు పిలుపు



**ఖమ్మం, ఏప్రిల్ 15(మనం న్యూస్):** యూనివర్సిటీల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్ లెక్చరర్లతో సమానంగా పని చేస్తున్న పార్ట్ లెక్చరర్లకు యూజీసీ పే స్కేల్ అమలు చేయాలని ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల లో చేపట్టిన నిరసనలో పీజీ, బీపీఈడి కళాశాలకు చెందిన పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూజీసీ గైడ్ లైన్స్ కు అనుగుణంగా రెగ్యులర్, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లలాగే పీహెచ్ డీ, నెట్, సెట్ అర్హత కలిగి డిపార్టమెంటల్ కమిటీ(డీసీ)ల ద్వారా డెమో, ఇంటర్వ్యూ ప్రాతిపదికన అపాయింట్ అయిన వాళ్లతో సమానంగా పాఠాలు చెప్తున్నప్పటికీ యూనివర్సిటీల్లో పార్ట్ టైం లెక్చరర్లపై వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని గతంలోనే సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో పనిచేసే రెగ్యులర్ ప్రొఫెసర్లు, కాంట్రాక్ట్ లెక్చరర్లంతా ఒకప్పుడు తమలాగే పార్ట్ టైం లెక్చరర్లుగా రిక్రూట్ అయ్యారన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్లకు అవకాశమివ్వడం వల్లే వాళ్లంతా రెగ్యులర్, కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తమను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వ్యవహరించిందన్నారు. చాలీచాలని వేతనాలతో బతుకు భారంగా వెళ్లదీయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పది సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న తమకు పనికి తగిన వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని వాపోయారు. యూజీసీ నిబంధనల ప్రకారం యూజీసీ పే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిగ్రీకి మార్కులు తగ్గించి పీహెచ్ డీకి పెంచాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల రిక్రూట్ మెంట్ లో టీచింగ్ ఎక్స్ పీరియన్స్ ను పరిగణనలోకి తీసుకోవడం లేదని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లతోపాటు ప్రైవేట్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ డిగ్రీ, పీజీ కాలేజీల్లో పనిచేస్తున్న వారి సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకుంటున్నా రన్నారు. వాళ్లతో సమానంగా అర్హత కలిగి, సమానంగా పాఠాలు చెప్పున్న తమను ఎందుకు లెక్కలోకి తీసుకోవడం లేదని వాపోయారు. పార్ట్ టైం టీచర్ల టీచింగ్ ఎక్స్ పీరియన్స్ కు కూడా వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, ఎయిడెడ్ డిగ్రీ, పీజీ కాలేజీల్లో తమ లాగే అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో పని చేస్తున్న లెక్చరర్ల సర్వీస్ ను ప్రతి రెండు, మూడేళ్లకోసారి యూనివర్సిటీలోని ఆయా డిపార్ట్ మెంట్ల హెడ్ లు, బీఓఎస్ చైర్ పర్స్ న్లు, రిజిస్ట్రార్ ర్యాటిఫై చేస్తున్నారన్నారు. కానీ ఇదే యూనివర్సిటీల్లో పీహెచ్ డీ, నెట్, సెట్ అర్హతతో పని చేస్తున్న మా సర్వీసుకు మాత్రం ర్యాటిఫికేషన్ చేయడం లేదు. దీంతో యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు తాము దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాత సర్వీసును పరిశీలించి కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ నిరసనలో ఎ వీరన్న, డాక్టర్ ఎన్ రవిబాబు, రాజీవ్ రాజు, రమ, లక్ష్మీ హరిత, రాణి, డాక్టర్ పేరెల్లి కోటి, పి. మధు, డాక్టర్ ఎం శ్యాంబాబు పాల్గొన్నారు.

# కొర్రమీను చేపల పెంపకంతో లాభాలు

## అవగాహన సదస్సులో కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 15 (మనంప్రతినిధి):** సిరులు పండించే కొర్రమీను చేపల పెంపకం ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్లో జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులకు, వ్యవసాయ శాఖ ఏపీఎంలకు కొర్రమీను చేపల పెంపకం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ వ్యవసాయం అన్ని సమయాల్లో కలిసి వస్తుందని గ్యారంటీ లేదు.. ఎందుకంటే వర్షాలు ఎక్కువ పడిన ఇబ్బందే .. తక్కువ పడినా కూడా ఇబ్బందే.. ప్రకృతి సహకరిస్తేనే అధిక దిగుబడిని పొందగలరు. కానీ, అకాల వర్షాల కారణంగా పంట చేతికి అందకుండా పోతుంది. దీంతోపాటు ఇంట్లో ఉన్న మహిళలు మగవాళ్లు అందరూ, వ్యవసాయ కూలీలు నిరంతరం కష్టపడాల్సి వస్తుందని, ఒక్కసారి పెట్టుబడితో నిరంతరం ఆదాయం వచ్చే చేపల పెంపకం పైన రైతులు దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఈ చేపల పెంపకంలో కొర్రమీను మాత్రమే ఎందుకు చెప్తున్నామంటే అది ఎటువంటి వాతావరణం అయినా తట్టుకుని బురదలో అయినా బతికే చేప కాబట్టి అని తెలిపారు. కొర్రమీను చేపల పెంపకం కోసం ఎక్కువ ప్రదేశం కూడా అవసరం లేదని ఒక పావుగుంట ప్రదేశంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం ఇంకో పావు కుంట ప్రదేశంలో ఫామ్ పౌండ్ నిర్మాణం, సుమారు మూడు లక్షల యాభై వేల రూపాయలతో చేపల పెంపకానికి అవసరమైన అన్ని వాటర్ ట్యాంక్, దానా వంటివి తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఒక్కో చేప పిల్ల ఖరీదు 15 రూపాయలు కాగా 1000 చేపల పిల్లల పెంపకం చేపట్టి అందులో 100 చేప పిల్లలు చనిపోయిన 900 చేప పిల్లలు మీ చేతికి వస్తే కిలో సుమారు 300 రూపాయలకు అమ్మిన 2,70,000 రూపాయలు కేవలం 7 నెలల్లో చేతికి వస్తుందని తెలిపారు. కొర్రమీను చేపల పెంపకం యూనిట్ స్థాపన కోసం బ్యాంకుల ద్వారా పీఎం ఈ జిపి పథకం ద్వారా 35 శాతం సబ్సిడీ వస్తుందని, చేపల పెంపకానికి కావలసిన ఫామ్ పౌండ్ నిర్మాణం ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా నిర్మించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కొర్రమీను చేపల పెంపకం ద్వారా కేవలం రెండు సంవత్సరాల లోనే పెట్టుబడి వాపసు వస్తుందని లక్షల్లో ఆదాయం చేకూరుతుందని మరి ఇతర పంటల్లోనూ ఇంత ఆదాయం రాదని అందువలన జిల్లాలోని రైతులు మహిళా సమాఖ్య సభ్యులు అధిక సంఖ్యలో కొర్రమీను చేపల పెంపకం చేపట్టాలని సూచించారు. కొర్రమీను చేపల పెంపకంలో నాణ్యమైన దానా వాడాలని, రోజుకు ఐదుసార్లు చేపలకి దాన వేయాలని ఆయన సూచించారు. ఈ దాన అనేది ఆటోమెటిక్ గా సరఫరా అయ్యే విధంగా ప్రయోగాలను శాస్త్రవేత్తలతో కలిసి నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. చేప పిల్లల్ని వాటర్ ట్యాంకర్ లో నాలుగు నెలలు పెంచిన తర్వాత వాటిని నీటి కుంటలో మట్టి, విశాలమైన ప్రదేశంలో పెంచడం ద్వారా పెద్ద పరిమాణంలో తయారవుతాయని తెలిపారు. వాటర్ ట్యాంక్ ఇళ్లలో నీటిని కూరగాయల సాగుచేయవచ్చని తెలిపారు. ఈ విధంగా రైతులు సాగు చేస్తే ప్రపంచం లో అతి పెద్ద మహమ్మారి వచ్చిన కూడా రైతులకు ఎటువంటి ఇబ్బంది పడరు. సాఫ్ట్ వెర్ ఉద్యోగస్థులకు దీటుగా వ్యవసాయం లో లాభాలను పొందవచ్చన్నారు. జిల్లాలోని రైతులు మహిళా సమైక్య సభ్యులు ముందడుగు వేసి కొర్రమీను చేపల పెంపకం చేపట్టి రాష్ట్రానికి చేపల పెంపకంలో మన జిల్లా ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ చేపల పెంపకం యూనిట్ల స్థాపనకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం ఆక్వా కనెట్స్ సమస్త వారు కొర్రమీను చేపల పెంపకం, మార్కెటింగ్, చేపల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై రైతులకు మరియు మహిళలకు పవర్ ప్లాంట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన మరియు సందేహాల నివృత్తి చేపట్టారు. అనంతరం జిల్లాలో ప్రయోగాత్మకంగా అశ్వాపురం, సుజాతనగర్ లో స్థాపించి కొర్రమీను చేపల పెంపకం లో విజయం సాధించిన రైతులు దుర్గాప్రసాద్, జంపన్న వారు చేపడుతున్న చేపల పెంపకం లో వారి అనుభవాలను అందరితో పంచుకున్నారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ రెడ్డి, పరిశ్రమల శాఖ మేనేజర్ తిరుపతయ్య, మత్స్య శాఖ ఏడి ఇంతియాజ్ ఖాన్ మరియు ఆక్వా కనెట్స్ సంస్థ ప్రతినిధులు, మహిళా సమైక్య సభ్యులు మరియు ఏపిఎంలు సుమారు 400 మంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత

- పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ

నస్పూర్ ఏప్రిల్ 15,(మనం న్యూస్)ః ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కొరకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాభివృద్ధి పనులను పారదర్శకంగా అమలు చేస్తూ అర్హులైన లబ్దిదారులకు పథకాలు ఫలాలు అందించే విధంగా అధికార యంత్రాంగం సమన్వయంతో కృషి చేస్తామని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ తెలిపారు . మంగళవారం కాజీపేట-బల్లార్ష సెక్షన్ ఎల్.సి. నం.57లో జిల్లాలోని రవీంద్రఖని-మంచిర్యాల మధ్య రైల్వే లైన్ 226/16-18 కి. మీ వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వివేకానంద, రోడ్లు-భవనాల శాఖ ఎస్.ఈ. కె.రాము, క్యాతన్ పల్లి మున్సిపల్ కమీషనర్ రాజులతో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ పారదర్శకమైన పాలన అందిస్తుందని, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతిష్టాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో రామకృష్ణాపూర్, బి-జోన్ ప్రాంత వాసుల చిరకాల కళ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి ద్వారా వాహన రాకపోకలు, ప్రయాణం సులభతరం అవుతుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేయడం జరుగుతుందని, సింగరేణి కార్మికుల పెన్షన్ పెంపొందించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికలలో గెలిచిన 3 నెలల్లో వంతెనను ప్రారంభించాలనే ధృఢ సంకల్పంతో గుత్తేదారుకి రావలసిన నిధులు, భూ నిర్వాసితులకు అందవలసిన పరిహారం అంశాలను వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేసి వంతెన ప్రారంభించుకోవడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రహదారులు, మురుగుకాలువలు, మంచినీటి సౌకర్యం కొరకు ప్రత్యేక నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, విద్య, వైద్య రంగానికి పెద్ద పీట వేస్తామని తెలిపారు. నిరుపేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితంగా సన్న బియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకు వంట గ్యాస్ ఇవ్వడంతో పాటు నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 50 వేల రూపాయల నుండి 4 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందించి రాయితీతో పాటు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మట్లాడుతూ రవీంద్రఖని-మంచిర్యాల మధ్య గల క్యాతన్పల్లి ప్రాంతంలో రైల్వే ఓవర్రెడ్జి ప్రారంభించడంతో ప్రజల కష్టాలు తీరనున్నాయని, రాకపోకలు సులభతరం కాగా ప్రయాణం సుఖవంతంగా జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అటవీ శాఖ అనుమతులు పొంది జాతీయ రహదారి 363లో ప్రమాద ప్రాంతాలను గుర్తించి రోడ్డు భద్రతా నియమాలలో వాహనదారులకు



తెలిసే విధంగా సూచికలు ఏర్పాటు చేయంతో పాటు అతి వేగం వల్ల కలిగే నష్టాలను, రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. క్యాతన్ పల్లి పరిధిలోని ఇంటింటికి త్రాగునీరు సరఫరా చేసే విధంగా 27 కోట్ల రూపాయలు డి.ఎం.ఎఫ్.టి., ఇతర నిధుల ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని లే-అవుట్ కలిగిన భూములలో జరిగే నిర్మాణాలకు మాత్రమే అనుమతులు జారీ చేసి విద్యుత్, నల్లా కనెక్షన్లు అందించడం జరుగుతుందని, మున్సిపల్ ప్రణాళికను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిరుపేదలకు చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సన్నబియ్యంను విక్రయించ కుండా లబ్దిదారులు వినియోగించు కోవాలని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అర్హత గల నిరుద్యోగ యువత స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని, ఈ పథకంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. పేద ప్రజలకు గూడు కల్పించాలను ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హత గల నిరుపేద లబ్దిదారులకు మాత్రమే ఇండ్లను కేటాయించడం జరుగుతుందని, ఈ క్రమంలో పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికులు తమ పెన్షన్ వివరాలు సమర్పించాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో నూతన రేషన్ కార్డు కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని, ఇంతకు ముందు రేషన్ కార్డు కలిగి ఉన్నట్లయితే సంబంధిత అభ్యర్థుల ఆధార్ కార్డు అనుసంధానం కలిగి ఉంటుందని, అట్టి అభ్యర్థులు నూతన కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నట్లయితే తిరస్కరించడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులతో మండల స్థాయి బృందాన్ని ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను 100 శాతం పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందని, అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమలో రోడ్లు-భవనాల శాఖ డి.ఈ.ఈ. సిహెచ్. రమేష్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యాన్నిపోసి ప్రమాదాలకు కారణం కావొద్దు

- జిల్లా ఎస్పీ డి. జానకి

మహబూబ్ నగర్, ఏప్రిల్ 15 (మనం బ్యూరో)ః మహబూబ్ నగర్ జిల్లా పోలీసులు రోడ్లపై ధాన్యాన్ని పంచుకునే విధానంపై ప్రజలకు హెచ్చరికలు జారీచేశారు. సాధ్యమైనంతవరకు రోడ్లపై ధాన్యాన్ని ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డి. జానకి కోరారు.అతివేగంగా రోడ్లపై ప్రయాణించే వాహనాలు, రోడ్లపై పెట్టిన ధాన్యం గుట్టలను గమనించలేక, ప్రమాదాలకు దారితీస్తున్నాయని వివరించారు. ప్రత్యేకంగా రాత్రి సమయంలో రోడ్లపై ధాన్యాన్ని ఉంచి, నల్ల కవర్ కప్పడం వల్ల ధాన్యం కుప్ప కనబడక, వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి తెలిపారు. ఇటువంటి ఘటనలు మానవ ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని, గతంలో ఈ విధంగా చాలామంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనలు జరిగినట్లు ఆమె తెలిపారు. జిల్లా ఎస్పీ ప్రజలకు సూచనలు చేశారు.ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడాన్ని




నియంత్రించుకోవాలి.కర్షకులు ధాన్యం ఎండబెట్టే సమయాల్లో రోడ్లపై కాకుండా ఇతర సముచిత ప్రదేశాలను ఉపయోగించుకోవాలి.అత్యవసరంగా రోడ్లపై ధాన్యం ఉంచాల్సి వచ్చినపుడు స్పష్టమైన గుర్తింపు కోసం అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.రోడ్లపై ధాన్యాన్ని ఉంచితే, ప్రమాదాలకు కారణమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గుర్తుంచుకోవాలని కోరారు.

## డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కరీంనగర్ టౌన్, ఏప్రిల్15 (మనంన్యూస్) ːఇరవై రెండవ డివిజన్ సుభాష్ నగర్ లో సుడా నిధులు 20 లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ విగ్రహం నుండి ఆరేపల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ముప్పై సంవత్సరాల క్రితం నిర్మించిన డ్రైనేజీ ధ్వంసమైపోవడం వల్ల మురికి నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వస్తుందని వర్షాలు పడ్డప్పుడు పైనుండి వచ్చే వరద నీరు ఇండ్లల్లోకి వస్తున్నాయని స్థానిక తాజా మాజీ కార్పోరేటర్ గంట కళ్యాణి శ్రీనివాస్,స్థానిక నాయకులు దండి రవీందర్,ముల్కల కవిత తదితరులు మాదృష్టికి తీసుకొచ్చి ప్రజల ఇబ్బందుల దృష్ట్యా తప్పకుండా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరగా సుడా నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ నాయక్,ఈఈ రొడ్డ యాదగిరి,ఎసిపి వేణు



గోపాల్,టిపిఎస్ సంధ్య,కాంట్రాక్టర్ పంజాల వెంకన్న,పులి సుమన్,గౌస్ ఖాన్,జగన్ తదితరులు పాల్గొన్నారు.

### మే,20న జరిగే దేశ వ్యాప్తసమ్మెను

## జయప్రదం చేయాలి




- కేంద్ర కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

మంచిర్యాల, ఏప్రిల్ 15( మనం న్యూస్)ః బిజెపి కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే,20 న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్,సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్,ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు అల్లూరి లోకేష్,టియుసిఐ జిల్లా కార్యదర్శి గోగ్ల తిరుపతి అన్నారు మంగళవారం రోజున కేంద్ర కార్మిక సంఘాల జేఏసీ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి దివాకర్ అధ్యక్షతన ఎస్టీయూ భవన్ లో జరిగింది.

ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నదని ,కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా అమలు చేయాలని అన్నారు . నరేంద్ర మోడీ కార్పొరేట్ల మెప్పు కోసమే కార్మిక చట్టాలను కుదించాలని ఆరోపించారు.

రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు . దేశవ్యాప్తంగా నరేంద్ర మోడీ పతనం ప్రారంభమైందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను మానుకోవాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఆర్టీసీ రిటైర్డ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేశం నాయకులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలను చెల్లించాలని కలెక్టర్‌కు వినతి

మంచిర్యాల, ఏప్రిల్ 15(మనం న్యూస్)ః మంచిర్యాల జిల్లాలోని అనంత సొల్యూషన్, విద్యాంజలి 2.0 వారిచ్చే 8, 9 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని,వేతనాలు అడిగితే రేపు, మాపు అంటూ సంస్థ కో ఆర్డినేటర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు .మంగళవారం సీఐటీయు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ,మంచిర్యాల జిల్లాలోని అనంత సొల్యూషన్, విద్యాంజలి 2.0 ద్వారా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్ నందు ఆఫీస్ సబార్డినేటర్, వాచ్మెన్, అటెండర్, స్వీపర్ , ఇంగ్లీష్ టీచర్, కంప్యూటర్ ఆపరేటర్, యోగ ఇతర ఇతర పనులకు సుమారు 40 నుంచి 50 మందిని ఈ సంస్థ ద్వారా గత సంవత్సరం ఆగస్టు సెప్టెంబర్ నెలల నుంఛి నియామకాలు చేసుకున్నారని, నియామకానికి ముందు సంస్థ కోఆర్డినేటర్లు ప్రతినెల 15 వేల రూపాయల వేతనం,



పిఎఫ్, ఈఎస్ఐ చెల్లిస్తామని చెప్పారని, కానీ నేటికీ 8, 9 నెలల గడిచిన కూడా సదరు అనంత సొల్యూషన్ విద్యాంజలి 2.0 సంబంధించిన జిల్లా కోఆర్డినేటర్లు వేతనాలను చెల్లించడం లేదని తెలిపారు. వేతనాల గురించి అడిగితే రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని, వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణకు, రోజువారి ఖర్చులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్ కు వివరించామని తెలిపారు . కావున జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని అనంత సొల్యూషన్ విద్యాంజలి 2.0 సంబందించిన జిల్లా కోఆర్డినేటర్లు ద్వారా మాకు రావలసిన వేతనాలు ఇప్పించగలరని కోరుతున్నామన్నారు . ఈ కార్యక్రమంలో ఎస్టీ ఆశ్రమ పాఠశాల, హాస్టల్ అనంత సొల్యూషన్ విద్యాంజలి 2.0 ఉద్యోగులు స్వాతి, సాయిరాణి, సువర్ణ, శ్యామల, కమల, రాజేశ్వరి, కల్పన, రజిత, ప్రశాంతి, దివ్యశ్రీ, శుభ, స్వరూప, వెంకటమ్మ, మమత, నరేష్, శ్రీనివాస్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఏప్రిల్15 (మనంబ్యూరో) కరీంనగర్ జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న వారంతా శ్రద్ధతో చదివి నూరు శాతం ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆకాంక్షించారు.

ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్, పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఏ చిన్న ఉద్యోగానికైనా, ఉపాధి అవకాశాలకైనా విద్యార్హతలు ముఖ్యమని అన్నారు. అందుకే జిల్లా

యంత్రాంగం తరపున గత తొమ్మిది సంవత్సరాలుగా 10వ తరగతిలో ఫెయిల్ అయిన పలువురు విద్యార్థులను గుర్తించి గత ఏడాది పదవ



తరగతి పరీక్ష రాయించిన విషయాన్ని గుర్తు చేశారు. వీరిలో 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువుల్లో చేరారని అన్నారు. అనారోగ్యం, వివాహం, కుటుంబ పరిస్థితులు వంటి వివిధ కారణాల చేత చాలామంది పాఠశాల విద్యను మధ్యలోనే ఆపేసిన వాళ్ళు ఉన్నారని, వారంతా ఓపెన్ స్కూల్లో చేరాలని సూచించారు. ఓపెన్ స్కూల్ విద్యార్హత రెగ్యులర్ అర్హతకు సమానమేనని అన్నారు. దూర విద్య ద్వారా ఉన్నత విద్య అభ్యసించి అనేకమంది ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారు ఉన్నారని తెలిపారు.ఈనెల 20 నుండి నిర్వహించనున్న ఇంటర్, పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఫీజు చెల్లించిన విద్యార్థులంతా తప్పక హాజరై పరీక్ష రాయాలని సూచించారు. పాస్ అయిన తర్వాత దూరవిద్యలో డిగ్రీలో చేరాలని సూచించారు. ఓపెన్ స్కూల్ తరగతులు గ్రంథాలయాల్లో నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని విద్యాధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు మాట్లాడుతూ పదవ తరగతికి 421 మంది, ఇంటర్ కి 881 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. చదువు మధ్యలో ఆపిన వాళ్ళు

రానున్న విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ లో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సిహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## పిల్లల పెరుగుదలపై పర్యవేక్షణ



జైపూర్, ఏప్రిల్ 15 (మనం న్యూస్)ః పిల్లల పెరుగుదలపై పర్యవేక్షణ కార్యక్రమం జైపూర్ మండలంలోని దుబ్బ పల్లి గ్రామంలో అంగన్వాడి సూపర్వైజర్ కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో మంగళవారం అంగన్ వాడి కేంద్రంలో 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బరువు ఎత్తు జబ్బ కొలతలకు సంబంధించిన వివరాలను సేకరించారు.ఈ కార్యక్రమానికి పిల్లల పెరుగుదల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వెంకట్రావుపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుమల హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పసిపిల్లల బరువు ఎత్తు వారి యొక్క వయసుకు సమానంగా ఉండే విధంగా చూసుకోవాలని ఈ సమావేశంలో పిల్లల బరువు ఎత్తు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారి తల్లులకు వారి ఆరోగ్యం పై సలహాలు సూచనలు తెలియజేశారు. తదనంతరం పోషణ పక్షం ప్రతిజ్ఞ అందరూ కలిసి నిర్వహించుకున్నారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జి శ్యామల,అంగన్ వాడి సూపర్వైజర్ కవిత, ప్రత్యేక అధికారి తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం మాదిరే, నేటి ప్రభుత్వం వ్యవహరిస్తుంది



- 16 నెలలకే కాంగ్రెస్ సర్కార్ పై తీవ్ర ప్రజా వ్యతిరేకత
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్ ,ఏప్రిల్15 (మనంబ్యూరో) 16 నెలల కాలంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కష్ణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత నిర్మాణం పై అసెంబ్లీ కన్వీనర్లు , మండల అధ్యక్షుల తో ముఖ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆధాయం కావాలంటే , భూముల వేలం ఒక్కటే శరణ్యంగా మారిందని , అందుకే హెచ్ యు సి భూములను అమ్మడానికి ప్రయత్నించి విఫలమైందని, రాష్ట్రంలో ప్రభుత్వ ఆధాయం పెంచుకునే మార్గాలే లేకుండా పోయాయని , అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూములు అమ్ముకునే దుస్థితికి వచ్చిందని విమర్శించారు. మండల కమిటీ మొదలుకొని బూత్ స్థాయి వరకు సంస్థాగత నిర్మాణ కార్యక్రమాలను సత్వరం పూర్తి చేయాలని తెలిపారు. పోలింగ్ బూత్ నుండి మొదలుకొని మండల కమిటీ వరకు పార్టీ సూచించిన విధానంలో నియామకాలు త్వరితగతిన చేపట్టి , పార్టీని మరింత పటిష్టం చేయడానికి కృషి చేయాలన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ కు పెరిగిన వ్యతిరేఖతనే రాష్ట్రంలో అధికారం కోల్పోయిందని , నేడు కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి వచ్చిందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకునే పరిస్థితిలో లేరని , గత కెసిఆర్ ప్రభుత్వ దారిలోనే కాంగ్రెస్ సర్కార్ నడుస్తుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వ తీరుతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా కాంగ్రెస్ పాలనలో పల్లెలు కన్నీరు కారుస్తున్నాయని, గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలు తున్నాయని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉన్నామని , తాము ఏది చేసిన నడుస్తుంది అనుకుంటే చివరకు ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మడ వెంకట్ రెడ్డి పర్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు జిల్లా ఉపాధ్యక్షులు రంగు బస్కరచరీ ఎర్రబెల్లి సంపత్ రావు గుర్రాల నిర్మల రెడ్డి మండల అధ్యక్షులు మండల సంయోజక్ లు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

కరీంనగర్ టౌన్,ఏప్రిల్15( మనంన్యూస్) జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, కొనుగోలు చేపట్టని ప్రభుత్వ, అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ డప్పు చాటింపు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు మేల్కొని కొనుగోలు సెంటర్లు ప్రారంభించి, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. ఈరోజు స్థానిక తిమ్మాపూర్ మండల కేంద్రంలో ధాన్యం కల్లాల దగ్గర జరిగిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికార యంత్రాంగాన్ని మేల్కొల్పే డప్పు చాటింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ

గత 15 రోజుల నుండి జిల్లాలో వరి కోతలు ప్రారంభమైనాగాని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని అన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా కనీసం 20 కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదని అన్నారు. ప్రారంభించిన కొద్దిపాటి కొనుగోలు కేంద్రాలు రిబ్బన్ కట్ చేసి,కొబ్బరికాయలు కొట్టి గాలికి వదిలేస్తున్నారని, వరి ధాన్యం కొనుగోలు నేటికీ జిల్లాలో ఒక్క క్వింటాల్ ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం దిగుబడి కి ముందే అధికార యంత్రాంగం ఎందుకు ప్రణాళికలు, తగిన ఏర్పాట్లు సిద్ధం చేసుకోలేదని ప్రశ్నించారు.ఒకపక్క వాతావరణంలో మార్పుల కారణంగా అకాల వర్షాల ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో రైతులకు పండించిన పంటను కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే,మరోపక్క ప్రైవేట్ దళారులు కనీస మద్దతు ధర కంటే తక్కువతో కొనుగోలు చేస్తున్నారని అన్నారు. దీనితో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం మూలంగా, పండించిన పంటను కాపాడుకునే అవకాశం లేక విధి లేని పరిస్థితిలో రైతాంగం నష్టానికైనా ప్రైవేట్ దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్కు 1700 రూపాయలకు అమ్ముకుంటు న్నారని దీంతో రైతు క్వింటాల్కు ఐదు నుండి 600 నష్టపోతున్నాడని అన్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో ప్రకారం కనీస మద్దతు ధర కల్పించాలని, బోనస్ క్వింటాల్కు 500 అన్ని రకాల వరి ధాన్యానికి ఇవ్వాలని, కొనుగోలు జరిగిన రెండు రోజుల్లో రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు సరిపడా గన్ని సంచులు,సుతిల్ దారాలు, తార్పాలిన్లు, రవాణా సౌకర్యం, కొనుగోలు కేంద్రాలలో మంచినీటి సౌకర్యం, టెంటు నీడ సౌకర్యం, బాత్రూమ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రైస్ మిల్లర్లు ఒక బస్తా మీద ఐదు కిలోల చొప్పున రైతులను నిలువు దోపిడీ చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు జిల్లా అధికారులు రైతులకు ఎటువంటి కటింగులు లేకుండా సంచి బరువు తీసేసి 40 కిలోలు కాటా వేయాలని, ఎక్కువ తూకాలు వేయకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్ర నిర్వాహకులు రైస్ మిల్లలతో కుమ్మక్కై మ్యాచర్ రావట్లేదు అని చెప్పి ఒక్క క్వింటాలకు 8 నుంచి 10 కిలోల దోపిడీ గతంలో జరిగిందని దాన్ని ఈసారైనా నిలువరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అన్ని గ్రామాలలో యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, ప్రైవేట్ దళారుల బారి నుండి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులందరిని ఐక్యం చేసి ఎక్కడికి అక్కడ దశలవారీగా గ్రామస్థాయిలోనే ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మాతంగి శంకర్, మండల నాయకులు మాతంగి వెంకటస్వామి వేనంక కుమార్, నాగరాజు, వేల్పుల కుమార్, ఆడిచర్ల ,వెంకటేష్ బోళ్ల మొగిలి ,గడ్డి రాజయ్య, మాతంగి వెంకటేష్ ,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ మంచోడెమో... నేను కొంచం రౌడీ టైప్

- కాంగ్రెస్ అంటేనే మాట తప్పే పార్టీ
- బాన్సువాడలో ధ్వజమెత్తిన కల్వకుంట్ల కవిత

**కామారెడ్డి, ఏప్రిల్ 15 (మనం జిల్లా ప్రతినిధి):** బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లవద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే ఎవరినీ వదలబోమని హెచ్చరించారు. 'కేసీఆర్ మంచోడు కావచ్చు.. నేను కొంచం రౌడీ టైప్ ' అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకులను వేధిస్తున్న నాయకులైనా, అధికారులైనా.. వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటామని పేర్కొన్నారు. కేసులు పెట్టించి పోలీస్ స్టేషన్లకు ఈడ్చిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదన్నారు. వరంగల్ రజతోత్సవ సభ నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో కవిత మాట్లాడారు. బాన్సువాడలో గులాబీ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ను మోసం చేసిన వారికి తగిన గుణపాఠం చెబుతామని కవిత హెచ్చరించారు. రజతోత్సవ మహాసభకు ఇంటికొకరు చొప్పున తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అంటేనే మాట తప్పే పార్టీ అని, ఇక్కడి నాయకులు డబ్బు కోసమే ఆ పార్టీలోకి వలస వెళ్లారని కవిత ధ్వజమెత్తారు. బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని,



కార్యకర్తల జోలికి ఎవరొచ్చినా ఊరుకోనని హెచ్చరించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు అరాచకం చేయలేదని, ప్రజలకు మంచి, అభివృద్ధి చేశామన్నారు. కొందరు పార్టీ మారినంత మాత్రాన కార్యకర్తలను భయపట్టిస్తే.. భయపడేది లేదని హెచ్చరించారు. 15 నెలల్లోనే ప్రభుత్వంపైవ్యతిరేకత వచ్చిందని అన్నారు. త్వరలోనే బాన్సువాడకు ఉప ఎన్నిక రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యేలు జీవన్రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ వ్యాఖ్యానించారు. ఇందులో పోచారం ఘోరంగా ఓడిపోవడం ఖాయమన్నారు. ఊసరవెల్లి రాజకీయాలలో ఆరితేరిన పోచారానికి బాన్సువాడ ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కేసీఆర్ పాలన స్వర్ణయుగం అయితే.. రేవంత్ రెడ్డి పాలన దరిద్ర పాలన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ జుబేర్, సాయిబాబా, మోచి గణేష్, రమేష్ యాదవ్, శివ సూరి, బోడ చందర్, గౌస్, చందు, మహేష్, ఆనంద్ గౌడ్, సాయిలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# బోయింగ్ విమానాల డెలివరీలు తీసుకోవద్దు: చైనా ఆదేశాలు

**బీజింగ్, ఏప్రిల్ 15:** చైనా-అమెరికా వాణిజ్య యుద్ధం ఎఫెక్ట్ ఇప్పుడు బోయింగ్పై పడింది. అసలే నష్టాల్లో ఉన్న ఆ సంస్థకు ఇది కోలుకోలేని దెబ్బగా మారింది.

అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం రోజురోజుకు తీవ్రమవుతోంది. ఇప్పటికే బీజింగ్ అరుదైన ఖనిజాలు, మాగ్నెట్ల ఎగుమతులను నిలిపివేసి వాషింగ్టన్ను దెబ్బకొట్టగా.. తాజాగా మరో షాక్ ఇచ్చింది. అమెరికా వైమానిక రంగ దిగ్గజమైన బోయింగ్ నుంచి ఎటువంటి డెలివరీలు స్వీకరించవద్దని స్వదేశీ విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ విషయాన్ని బ్లూమ్బర్గ్ కథనంలో వెల్లడించింది. అదే సమయంలో వైమానిక రంగంలో వినియోగించే విడిభాగాలను అమెరికా నుంచి కొనుగోళ్లు చేయవద్దని సూచించింది.




అమెరికా వస్తువులపై 125 సుంకాలను విధిస్తూ ఇటీవల ఓ ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలో ఆ దేశం నుంచి విమానాల విడిభాగాలను దిగుమతి చేసుకోవద్దని పలు సంస్థలకు సూచించింది. ఈ నిర్ణయంతో బోయింగ్ విమానాల నిర్వహణ కూడా చైనా సంస్థలకు భారంగా మారనుంది. అదే సమయంలో ఇప్పటికే బోయింగ్ నుంచి విమానాలను లీజుకు తీసుకొని నిర్వహిస్తున్న సంస్థలను ఆదుకొనే దిశగా చైనా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

చైనా-అమెరికా వాణిజ్య యుద్ధం దెబ్బకు బోయింగ్ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇప్పటికే ఆ సంస్థ గత కొన్నేళ్లుగా తీవ్ర నష్టాల్లో కొనసాగుతోంది. ఆ సంస్థకు చైనా అతిపెద్ద మార్కెట్గా నిలిచింది. రానున్న 20 ఏళ్లలో ప్రపంచ విమానాల మార్కెట్లో 20శాతం వాటా చైనాదే అన్న అంచనాలున్నాయి. ఒక్క 2018లోనే 25శాతం బోయింగ్ విమానాలను బీజింగ్ సంస్థలు కొనుగోలు చేశాయి. కానీ, వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా గత కొన్నేళ్లుగా చైనా నుంచి ఎటువంటి కొత్త ఆర్డర్లు బోయింగ్కు లభించలేదు.

# ఢిల్లీలో మూడు రోజులుంటే జబ్బు చేయడం ఖాయం: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**ఢిల్లీ, ఏప్రిల్ 15:** ఢిల్లీలోని వాయు కాలుష్యం తీవ్రస్థాయిలో ఉండటంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ఢిల్లీలో మూడు రోజులుంటే జబ్బు చేయడం ఖాయమని అన్నారు. కాలుష్యం విషయంలో ఢిల్లీ, ముంబయి రెడ్జోన్లో ఉన్నాయని తెలిపారు. ఢిల్లీలో పరిస్థితి ఇలాగే కొనసాగితే అక్కడి ప్రజల ఆయుర్దాయం 10 ఏళ్లు తగ్గుతుందని.. వైద్య పరిశోధనను ఉటంకిస్తూ పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని శిలాజ ఇంధనాల వాడకాన్ని



తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు.

రాష్ట్రాలలో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక వ్యవస్థకు ఏవిధంగా ప్రాధాన్యం ఇస్తామో అలాగే పర్యావరణాన్ని కూడా ముఖ్యమైన విషయాల్లో ఒకటిగా పరిగణించాలన్నారు. కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి రహదారుల మౌలిక సదుపాయాల కల్పన కూడా ఓ పరిష్కారంగా పని చేస్తుందని గడ్కరీ పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ కాలుష్యానికి ప్రధాన కారణాలు కాబట్టి వాహనాల్లో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమన్నారు. మనం దాదాపు రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటున్నామని.. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలు వినియోగించాల్సిన సమయం వచ్చిందన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకువెళ్తున్న భారత్ రవాణా, విద్యుత్, నీరు, కమ్యూనికేషన్ రంగాలలో ప్రపంచస్థాయి సదుపాయాలను కల్పించడంపై దృష్టిపెడుతోందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల లాజిస్టిక్ ఖర్చులు 12 శాతం లోపు ఉంటే మన ఖర్చులు 16శాతం వరకు ఉన్నాయని.. 2026 చివరి నాటికి వాటిని సింగిల్ డిజిట్కు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్ కాలుష్యంపై రూపొందించిన 'ద వరల్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2024' నివేదిక ఇటీవల విడుదలైంది. దీని ప్రకారం.. ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం వెలువడే 20 నగరాల్లో 13 భారత్లోనే ఉన్నాయి. అస్సాంలోని బైర్నీహాట్ నగరం తొలిస్థానంలో నిలవగా.. తరువాతి స్థానాల్లో ఢిల్లీ, ఇతర నగరాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత రాజధానిగా ఢిల్లీ తొలి స్థానంలో కొనసాగుతున్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఈ కాలుష్యం వల్ల అక్కడి ప్రజల ఆయుర్దాయం దాదాపు 5.2 సంవత్సరాలు తగ్గినట్లు అంచనా వేసింది. 2009 నుంచి 2019 వరకు భారత్లో ప్రతి ఏడాది కాలుష్య సంబంధిత వ్యాధుల వల్ల దాదాపు 1.5 మిలియన్ల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నట్లు గతేడాది విడుదలైన లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ అధ్యయనం పేర్కొంది.

# బ్లూఆరిజిన్ రాకెట్లో అతివల అంతరిక్ష విహారం

**ఫొనిక్స్, ఏప్రిల్ 15:** బ్లూఆరిజిన్ వ్యోమనౌకలో ఆరుగురు మహిళలు అంతరిక్షం అంచుల వరకు వెళ్లి వచ్చారు. వారు వెళ్లింది కొన్ని నిమిషాలే అయినా అది మాత్రం చాలా ఖర్చుతో కూడుకున్న యాత్ర.

ప్రపంచ కుబేరుల్లో ఒకరైన జెఫ్బెజోస్కు చెందిన బ్లూఆరిజిన్ రాకెట్లో మహిళా సెలబ్రిటీల బృందం అంతరిక్షంలో విహరించింది. ఆ ఆరుగురిలో పాప్స్టార్ కేథీ పెర్రీ, బెజోస్ కాబోయే సతీమణి లారెన్ శాంచెజ్ ఉన్నారు. న్యూ షెపర్డ్ వ్యోమనౌకలో నింగిలో 107 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకున్న వారు.. 11 నిమిషాల పాటు సాగిన యాత్రలో కొంతసేపు భారరహితస్థితిని ఆస్వాదించారు.

ఒకసారి బ్లూఆరిజిన్ నౌక అంతరిక్షంలోకి వెళ్లి వస్తే ఎంత ఖర్చు అవుతుందన్నది మాత్రం ఒక మిస్టరీ. ఆ వివరాలను కంపెనీ తన వెబ్సైట్లో పేర్కొనలేదు. అయితే రిజర్వ్ చేసుకునే సమయంలో ఒక వ్యక్తి నుంచి 1,50,000 డాలర్లు వసూలు చేస్తారు. అది రీఫండబుల్ డిపాజిట్. సీట్ రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేయడానికి ముందు దానిని వసూలు చేస్తారు. 2021లో తొలిసారి నిర్వహించిన మిషన్లో భాగంగా ఒక్కో సీట్ను 28మిలియన్ల డాలర్లకు వేలం వేశారని న్యూయార్క్ టైమ్స్ కథనం పేర్కొంది. ఈ వివరాలు ఇలా ఉన్నప్పటికీ.. వాస్తవంగా టికెట్ ఖర్చు మాత్రం తెలియరాలేదు. అదే సమయంలో మరో సంస్థ వర్జిన్ గెలాక్టిక్ నిర్వహించిన యాత్రలో ఒక్కో సీటుకు 2 లక్షల డాలర్ల నుంచి 4.5 లక్షల డాలర్లు వసూలు చేసిందని అమెరికా మీడియా సంస్థ వెల్లడించింది.

బ్లూ ఆరిజిన్ సంస్థకు ఇది 11వ అంతరిక్ష యాత్ర. అమెరికాకు సంబంధించి.. పూర్తిగా మహిళలతోనే యాత్రను నిర్వహించడం ఇదే మొదటిసారి. 1963లో సోవియట్ వ్యోమగామి వాలెంటీనా తెరిష్కోవా ఒక్కరే రోదసిలోకి వెళ్లి వచ్చారు. ఆమె.. రోదసియాత్ర నిర్వహించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. ఇక ఈ వ్యోమనౌక ప్రయాణం ప్రారంభమైన ఆరు




నిమిషాలకు క్యాప్సూల్ నుంచి విడిపోయిన బూస్టర్ రాకెట్ తిరిగి భూ వాతావరణంలోకి పునః ప్రవేశించింది. క్యాప్సూల్ మాత్రం సముద్రమట్టానికి 100కిలోమీటర్ల ఎగువన ఉన్న కార్మాన్ రేఖ వరకూ ప్రయాణించింది. ఆ సమయంలో వ్యోమగాములు కొద్దిసేపు భారరరహిత స్థితిని పొందారు. అనంతరం వ్యోమనౌక పారాచూట్ల సహాయంతో తిరిగి భూవాతావరణంలోకి ప్రవేశించింది. బ్లూఆరిజిన్ సంస్థ 2021లో నిర్వహించిన తొలి అంతరిక్ష యాత్రలో జెఫ్ బెజోస్ కూడా ప్రయాణించారు.

# ముర్షిదాబాద్ హింసలో బంగ్లాదేశీయుల ప్రమేయం..?

**కోల్కతా, ఏప్రిల్ 15:** పశ్చిమ బెంగాల్లోని ముర్షిదాబాద్ హింసలో బంగ్లాదేశీయుల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వక్ఫ్ (సవరణ) చట్టం అమలుకు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్లో నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. ముర్షిదాబాద్లో హింసాత్మక పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. అయితే.. దీని వెనక పొరుగు దేశమైన బంగ్లాదేశ్కు చెందిన వారి ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలోని జాతీయ రహదారి 12పై ఒక వర్గానికి చెందిన సమూహం పోలీసులపై రాళ్లదాడికి ప్రయత్నించగా.. మరోవైపు, ధూలియన్, షంషేర్గంజ్, సుతీల్లో కొందరు



విధ్వంసానికి పాల్పడ్డారు. అయితే.. ఈ ప్రాంతం అంతర్జాతీయ సరిహద్దుకు సమీపంలో ఉండడంతో ఇతర ప్రాంతాలు లేదా పొరుగు దేశం బంగ్లాదేశ్కు చెందిన ఎవరైనా రాష్ట్రంలోకి ప్రవేశించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు మీడియా కథనాలు ప్రచురించింది.

రాళ్ల దాడి చేసిన వారు ఎక్కువగా 20 ఏళ్ల లోపు వారేనని ఎమ్మెల్యే మనిరుల్ ఇస్లాం మీడియాకు తెలిపారు. కానీ, తానెప్పుడూ వారిని చూడలేదని పేర్కొన్నారు. ''అల్లర్లు జరుగుతున్న ప్రాంతం సరిహద్దుకు సమీపంలో ఉంటుంది. కాబట్టి, అస్థిర పరిస్థితుల దృష్ట్యా ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణిస్తున్నాం. బయటి వ్యక్తులు ఈ ప్రాంతంలోకి ప్రవేశించారనడంలో ఎలాంటి సందేహం లేదు. అది ఇతర జిల్లా లేదా పొరుగు దేశం నుంచి అయిన కావొచ్చు. ఈ అంశంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. త్వరలోనే వాస్తవాలేంటో బయటపెడతాం'' అని ఒక సీనియర్ పోలీసు అధికారి పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థలు యువకులను ఈ హింసలో భాగం చేశాయని కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు మీడియాకు సమాచారం అందించాయి. జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. కాగా.. వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా ముర్షిదాబాద్లో గత వారం నుంచి నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. మాల్డా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. నిరసనలు ఉద్రిక్తతగా మారడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు సహా పలువురికి గాయాలయ్యాయి. ఈ కేసులో ఇప్పటి వరకు 200 మందికి పైగా అరెస్టు చేశారు.

# అమెరికాతో అణు చర్చలు.. స్పందించిన ఇరాన్ సుప్రీం లీడర్

టెహరాన్, ఏప్రిల్ 15: అమెరికాతో జరిగిన తొలి విడత అణు చర్చలను ఉద్దేశించి ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ స్పందించారు. తొలి విడత చర్చలు సానుకూలంగానే సాగినట్లు వెల్లడించారు. ''మరీ అంత ఆశావాదంగానూ మరీ అంత నిరాశావాదంగానూ లేం'' అని ఖమేనీ పేర్కొన్నారు. సానుకూలం అనే పదం వాడుతూనే.. అమెరికాపై ఆయన అనుమానాలు వ్యక్తంచేశారు. దేశవ్యవహారాలను చర్చలతో ముడిపెట్టవద్దని అధికారులకు సూచించారు. ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికాతో చర్చల్లో తొలి అడుగు పడిన సంగతి తెలిసిందే. గత శనివారం ఒమన్ రాజధాని మస్కట్లో జరిగిన పరోక్ష సమావేశంలో చర్చలను కొనసాగించాలని రెండు దేశాలు నిర్ణయించాయి. ఈ వారం వారు మళ్లీ సమావేశం కానున్నారు. దీంతో దశాబ్దాలుగా రెండు దేశాల మధ్య కొనసాగుతున్న వివాదానికి పరిష్కార దిశగా తొలి అడుగు పడినట్లయింది.

పశ్చిమాసియాలో అమెరికా రాయబారి విట్కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీలు మస్కట్ శివారల్లో ఒమన్ ఏర్పాటు చేసిన వేదికలో కూర్చున్నారు. ఇద్దరి అభిప్రాయాలను, ప్రతిపాదనలను.. మధ్యవర్తిగా ఉన్న ఒమన్ ప్రతినిధి ఒకరి నుంచి మరొకరికి వివరించారు. సమావేశం చివర్లో ఒమన్ విదేశాంగ మంత్రి సమక్షంలో విట్కాఫ్, అబ్బాస్లు కొద్దిసేపు నేరుగా మాట్లాడుకున్నారు. సమావేశానంతరం అరాగ్చీ ఇరాన్ ప్రభుత్వ టీవీతో మాట్లాడారు. ఈ నెల 19వ తేదీన మళ్లీ సమావేశమవుతామని తెలిపారు. అణు



కార్యక్రమాన్ని విరమించుకుంటున్నామన్న ఇరాన్తో దౌత్య పరిష్కారానికి సిద్ధమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే చర్చలు విఫలమైతే ఇరాన్కు భారీ ముప్పు తప్పదని హెచ్చరించారు. ఇరాన్తోగతంలో అణు ఒప్పందం చేసుకున్న అమెరికా.. 2018లో ట్రంప్ హయాంలోనే దానినుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.

# అమెరికా వీసా రద్దు.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విద్యార్థులు

వాషింగ్టన్, ఏప్రిల్ 15: పలు విద్యా సంస్థల్లోని విద్యార్థుల వీసాలను ట్రంప్ యంత్రాంగం రద్దు నిర్ణయం ప్రకటనతో ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగశాఖ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కేవలం ఆందోళనల్లో పాల్గొన్నవారినే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ తొలుత అధికారులు వారికి ఈమెయిల్స్ పంపారు. తాజాగా ట్రంప్ యంత్రాంగం పలు యూనివర్సిటీలలోని విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. దీంతో అక్కడి స్కాలర్లకు బహిష్కరణ ముప్పు పొంచి ఉంది. విదేశాంగ శాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అకస్మాత్తుగా వీసాలు రద్దు చేయడంతో తమ చదువులు కొనసాగించలేకపోతున్నామని.. తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. హార్వర్డ్, స్టాన్ఫోర్డ్ వంటి ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు సహా మేరీల్యాండ్, ఒహియో స్టేట్ వంటి ప్రఖ్యాత ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలోని విద్యనభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులు వీరిలో ఉన్నారు.

# ఖర్గే, రాహుల్లతో తేజస్వీ కీలక భేటీ!

**పాట్నా, ఏప్రిల్ 15:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ఆర్జేడీ



నాయకుడు తేజస్వీయాదవ్ భేటీ అయ్యారు. బీహార్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ భేటీ అయ్యారు. ఈ కీలక సమావేశంలో ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. రాష్ట్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తేజస్వీ యాదవ్, ఆర్జేడీ ఎంపీలు మనోజ్ ఝా, సంజయ్ యాదవ్ ఖర్గే నివాసంలో భేటీ అయ్యారు. సమావేశం అనంతరం నేతలు మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు మహాఘట్బంధన్ సన్నద్ధత గురించి చర్చించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి అభ్యర్థిపై ఎలాంటి ఊహాగానాలు సృష్టించవద్దని కోరారు. ఈ అంశంపై తర్వాత నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ''బీహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ను బీజేపీ హైజాక్ చేసింది. కేంద్రమంత్రి అమిత్ షా నాయకత్వంలో ఎన్నికల్లో పోటీ చేస్తామని చెబుతున్నారే కానీ, ఆయనే సీఎం అవుతానని మాత్రం చెప్పడం లేదు'' అని తేజస్వీ యాదవ్ విమర్శించారు. ''రాష్ట్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయం. బీహార్ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కూటమి కట్టుబడి ఉంది. 20 ఏళ్లుగా వారు అధికారంలో ఉన్నారు. పదేళ్లకు పైగా ప్రధాని మోడీ కేంద్రంలో ఉన్నారు. కానీ, రాష్ట్రంపై సవతి తల్లి వైఖరి ప్రదర్శించారు. బీహార్ ఆర్థికంగా వెనకబడిన రాష్ట్రం. రైతుల ఆదాయాలు తక్కువ. వలసలు ఎక్కువ'' అని తేజస్వీ యాదవ్ అన్నారు. రైతులు, వెనకబడిన తరగతుల ప్రజలు, యువత, మహిళలు ఇండియా కూటమి అధికారాన్ని కోరుకుంటున్నారని తేజస్వీ అన్నారు. రాష్ట్ర సమస్యలపై కలిసికట్టుగా పోరాడదామని ప్రజలకు పిలుపునిచ్చారు. మరోవైపు ఖర్గే 'ఎక్స్' వేదికగా తమ భేటీ గురించి మాట్లాడారు. ''నేడు బీహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్తో భేటీ అయ్యాము. మహాఘట్బంధన్ బలం గురించి చర్చించాం. భవిష్యత్తుల్లో రాష్ట్ర ప్రజలకు బలమైన, సానుకూల, న్యాయమైన, సంక్షేమాలను అందిస్తాం. రాష్ట్రాన్ని పీడిస్తున్న వారి నుంచి విముక్తి పొందే రోజులు ఆసన్నమవుతున్నాయి'' అని మల్లిఖార్జున ఖర్గే పేర్కొన్నారు.

# బెంగాల్ మండిపోతుంటే..మౌనమా!.. మమత బెనర్జీ పై యోగి విమర్శ

**లఖనవూ, ఏప్రిల్ 15:** ఒకవైపు బెంగాల్ మండిపోతుంటే.. సీఎం మమతా బెనర్జీ మౌనంగా ఉన్నారని, పైగా నిరసనకారులను శాంతిదూతలుగా పేర్కొంటున్నారని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగి విమర్శించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విమర్శలు చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి నిరసనగా రాష్ట్రంలో హింస చెలరేగుతున్నా మమత తనకు ఏమీ పట్టనట్టుగా ఉన్నారని అన్నారు. గత వారం రోజులుగా ముర్షిదాబాద్ మంటల్లో మండిపోతుంటే.. లౌకికవాదం పేరుతో రాష్ట్రంలో అల్లర్లను సృష్టించేవారికి ఆమె పూర్తి స్వేచ్ఛను ఇచ్చి.. చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి అరాచకాలను అదుపులో ఉంచాల్సి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉంటుందని అన్నారు.



ఆందోళనకారులను ఆమె శాంతిదూతలుగా భావిస్తారని..కానీ హింసకు అలవాటుపడిన వారు ఆమె మాటలను కూడా లెక్క చేయరని అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పుకునే ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజవాదీ నేతలు బెంగాల్లో ఇంత విధ్వంసం జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పరిస్థితులను అదుపులోకి తీసుకురావడానికి బెంగాల్కు భద్రతా దళాలను పంపినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్లో చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తం అవడంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనల పేరిట సీఎం మమతా బెనర్జే హింసను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారని గుర్తుచేశారు.

వక్ఫ్ చట్టం గతవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ ఒక నోటిఫికేషన్ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో శనివారం బెంగాల్లోని మాల్డా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగి.. రోడ్లను దిగ్బంధించారు. ఘర్షణల్లో ముగ్గురు మృతిచెందగా.. 110 మందికి పైగా నిరసనకారులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. దీనిపై మమత మాట్లాడుతూ..ఈ వక్ఫ్ చట్టాన్ని బెంగాల్లో అమలు చేయబోమని పునరుద్ఘాటించారు. అయితే ఈ హింసలో ఉగ్రసంస్థల హస్తం ఉందని..వారే యువకులను రెచ్చగొట్టి దాడులకు పాల్పడేలా చేస్తున్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఆ ఎగుమతుల నిలిపివేతతో చైనా షాక్.. ఆందోళనలో అమెరికా

**వాషింగ్టన్,ఏప్రిల్ 15 :** తమ దేశంలోని అరుదైన ఖనిజాల ఎగుమతులను నిలిపివేస్తున్నట్లు చైనా చేసిన ప్రకటనపై అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా- చైనాల మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతోంది. చైనా ఉత్పత్తులపై టారిఫ్లను యూఎస్ 145 శాతానికి పెంచినట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. అంతటితో ఆగకుండా తమ దేశంలో లభ్యమయ్యే అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను యూఎస్కు ఎగుమతి చేయడాన్ని ఆపేస్తున్నట్లు బీజింగ్ పేర్కొంది. ఈ ప్రకటనపై అమెరికా స్పందించింది.



ఖనిజాల ఎగుమతి విషయంలో చైనా తీసుకున్న నిర్ణయం ఆందోళనకరంగా ఉందని ట్రంప్ ముఖ్య ఆర్థిక సలహాదారుల్లో ఒకరైన కెవిన్ హసెట్ పేర్కొన్నారు. టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ రంగంలో ఈ ఖనిజాల అవసరం ఎక్కువగా ఉందన్నారు. చైనా నిర్ణయం వల్ల పశ్చిమదేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్లు కంపెనీలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని.. వీటిపై చైనాతో చర్చలు జరిపే అవకాశం ఉందని తెలిపారు. అయితే ట్రంప్ విధించిన టారిఫ్ల వల్ల 100 శాతం మాంద్యం వస్తుందని తామేమీ అనుకోవట్లేదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన ఖనిజాల్లో దాదాపు 90శాతం చైనా నుంచే వెళుతున్నాయి. తాజాగా బీజింగ్ చేపట్టిన చర్యల ప్రభావం కేవలం అమెరికా వరకే పరిమితం కాదు.. అన్ని దేశాలపైనా ఉండనుంది. తొలుత చైనా ఉత్పత్తులపై టారిఫ్లను ట్రంప్ 54శాతం పెంచడంతో కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. మరోసారి అగ్రరాజ్యం సుంకాలను 145 శాతానికి పెంచడంతో అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలు, ఇతర ఉత్పత్తులను ఎగుమతి చేయడం బీజింగ్ నిలిపివేసింది. దీంతోపాటు ఎక్స్పోర్టు లైసెన్స్లను పరిమితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి.

అమెరికాలోని లాక్హీడ్మార్టిన్, టెస్లా, యాపిల్ వంటి సంస్థలు చాలా ముడిపదార్థాల కోసం బీజింగ్పైనే ఆధారపడుతున్నాయి. అమెరికా ప్రభుత్వం వద్ద రేర్ ఎర్త్ మినరల్స్ నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. కానీ, తమ డిఫెన్స్ కాంట్రాక్టర్లకు సరఫరా చేయడానికి మాత్రం ఇవి సరిపోవు. దీంతో అమెరికా ప్రభుత్వం చైనా చర్యలపై ఆందోళన వ్యక్తంచేస్తోంది. అయితే సుంకాల విషయంలో చైనాతో పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు.

# ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

- పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించిన ఏసీబీ అధికారులు
- ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- మీడియా సమావేశంలో ఏసీబీ డిఎస్పి అధికారి జగదీష్ చందర్



**తుంగతుర్తి, ఏప్రిల్ 15 (మనం న్యూస్):** నియోజకవర్గ కేంద్రమైన తుంగతుర్తి లోని ఎస్సీ బాలికల వసతి గృహంపై మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎసిబి డిఎస్పి జగదీశ్ చందర్ వసతి గృహంలోని అవకతవకలపై పూర్తి వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని పలు సంక్షేమ వసతి గృహాల్లో అవినీతి జరుగుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుతో తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహానికి విచ్చేసి పలు రికార్డులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. వసతి గృహంలో బాత్రూములు కూడా సరిగా లేవన్నారు. వసతి గృహంలో రికార్డుల ప్రకారం ఈ విద్యా సంవత్సరానికి 51 మంది విద్యార్థులు అడ్మిషన్ అయి ఉండగా కేవలం ప్రతిరోజు 25 మంది విద్యార్థులు మాత్రమే వసతి గృహానికి హాజరవుతున్నట్లు తనిఖీల్లో వెల్లడి అయిందని తెలిపారు. అయినా వసతి గృహ అధికారి 51 మందికి వసతిని ఏర్పాటు చేస్తున్నట్లు తన రికార్డులో చూయించడం జరిగింది దీనిని లిఖితపూర్వకంగా ఫిర్యాదులను చేర్చుకోవడం జరిగిందని పేర్కొన్నారు వచ్చిన 25 మంది విద్యార్థులు కూడా సాయంత్రం సమయానికి ఎవరి ఇంటికి వారే వెళుతున్నట్లు ఏసీబీ అధికారి విచారణలో తెలియజేయడం జరిగింది ఈరోజు మాత్రం 25 మంది విద్యార్థులకు భోజనం అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు వసతి గృహంలో అరకొర వసతులు ఉండటంతో విద్యార్థుల హాజరు పట్టికకు విద్యార్థుల సంఖ్యకు ఏమాత్రం పొంతన లేదని విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లేదన్నారు. వసతిగృహం నిర్వాహనను వసతి గృహ సంక్షేమ అధికారి వార్డెన్ మార్తమ్మ పట్టించుకోవడం లేదని విచారణలో బయటపడిందని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు చేసే పనిలో అవకతవకలకు పాల్పడినట్లయితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 ఫిర్యాదు చేయాలని ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి కావలసినటువంటి ఫుడ్ మెటీరియల్ను అదనంగా వసతి గృహాలు తీసుకొని విద్యార్థులకు అందివ్వకుండా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నట్లు రికార్డులు తనిఖీ విచారణలో తేలిందని తెలియజేశారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్ మార్తమ్మ పై పూర్తి నివేదికను ఏసీబీ డీజీపీకి పంపించనున్నట్లు అధికారులు చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వ శాఖలో అవినీతికి పాల్పడి డబ్బులు డిమాండ్ చేసిన వెంటనే ఏసీబీ ని ఆశ్రయించొచ్చని తెలపడం జరిగింది. ఈ ఆకస్మిక దాడుల్లో ఫుడ్ ఇన్స్పెక్టర్ స్వాతి ,ఆడిటర్ ప్రణయ్, శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు, లీగల్ మెట్రాలజీ అధికారి చిట్టిబాబు లతో సహా పూర్తిస్థాయిలో విచారణ పాల్గొన్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చే పని బిఆర్ఎస్‌కు లేదు

- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**తిరుమలగిరి, ఏప్రిల్ 15(మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేసే ప్రయత్నం బిఆర్ఎస్ పార్టీకి ఏమాత్రం లేదని సూర్యాపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. మంగళవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని వంగపల్లి నరసయ్య ఫంక్షన్ హాల్ లో వరంగల్ సభ ను విజయవంతం చేయాలని బి ఆర్ఎస్ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు కాంగ్రెస్ నుంచే అంతర్గతంగా జరుగుతాయని,బిఆర్ఎస్ కు ఏ మాత్రం ఉండబోదని స్పష్టం చేశారు. తమ వైపు నుండి ఏలాంటిది జరగదని కాంగ్రెస్ కు మాట ఇస్తున్నామని చెప్పారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆర్థిక అరాచక పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. కమిషన్లు వచ్చే పనులకు మాత్రమే డబ్బులు కేటాయిస్తున్నారని అన్నారు. దేశ



చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఎన్నుకున్న ప్రజలే రేవంత్ సర్కార్ ను గద్దె దించాలని అంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులు బిజెపి ప్రాపకంతో బతుకుతున్నారని, చంద్రబాబుతో మంచిగా ఉండి మోడీ దగ్గర లైన్ క్లియర్ చేసుకుంటున్నారని, సీఎం రేవంత్ మోడీతో డైరెక్ట్ టచ్ లో ఉన్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి సీఎం స్థాయి లేదని ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ నాయకులు చిల్లర మాటలు ప్రగల్బాలు మానుకుని,వాస్తవాలు గుర్తెరిగి నడుచుకోవాలి చెప్పారు. ఈనెల 27న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభ వరంగల్ లో జరుగుతుందని టిఆర్ఎస్ ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిశోర్ కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్ రావు, మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నరసింహారెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మర్రి వెంకటమ్మకు నివాళులర్పించిన మాజీ మంత్రి.తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో మాజీ కుడా ఛైర్మెన్ మర్రి యాదవ రెడ్డి మాతృమూర్తి మర్రి వెంకటమ్మ ఇటీవల మరణించారు. మంగళవారం మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, తన నివాసానికి వెళ్లి మర్రి వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన బి అర్ ఎస్ యువజన విభాగం నాయకులు కడారి స్టాలిన్ యాదవ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు డా.గాదరి కిశోర్ కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, టిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ఎస్ రఘునందన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## తిరుమలగిరి మార్కెట్ కు భారీగా వచ్చిన ధాన్యం

**తిరుమలగిరి, ఏప్రిల్ 15(మనం న్యూస్):** తిరుమలగిరి మార్కెట్ కు మంగళవారం భారీగా ధాన్యం వచ్చిందని మార్కెట్ కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామని అన్నారు. మార్కెట్ కు 23 వేల



41 వరి ధాన్యం బస్తాలు వచ్చిందని ఆయన తెలిపారు. అలాగే తిరుమలగిరి మార్కెట్ లో రైతులకు అన్ని విధాలుగా సదుపాయాలు కల్పిస్తున్నామని రైతులు గ్రామాలలో దళారులకు దాన్యం అమ్మకుండా మార్కెట్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలనే ఉద్దేశంతో రైతులు తిరుమలగిరి మార్కెట్ కు ధాన్యాన్ని తీసుకొస్తున్నారని చెప్పారు. ఎక్కువ ధాన్యం వచ్చిన రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ సిబ్బంది చూస్తున్నారని చెప్పారు. సరైన సమయంలో మార్కెట్ కాంటాలు వేసి రైతులకు అన్ని విధాలుగా వసతులు ఉన్నావని ఆయన తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డి రైతు బాంధవుడు

- ప్రజా పాలనలో రైతులకు అధిక ప్రాముఖ్యత
- ఊరూరా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం
- మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి,డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు



**తుంగతుర్తి, ఏప్రిల్ 15,(మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పాలనలో విద్యా, వైద్యంతో పాటు వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ఆదేశానుసారం మండల పరిధిలోని రావులపల్లి , సంగెం గ్రామాల్లో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో వేల కోట్ల రైతుల రుణాలను మాఫీ చేయడం జరిగిందని తెలిపారు.గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ రాళ్లు గుట్టలకు కూడా కోట్ల రూపాయలను రైతుబంధు పేరా ఇచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ఘనత గత ప్రభుత్వానిదని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనలో వ్యవసాయ శాఖ మంత్రి ప్రత్యేక నిబంధనలు రూపొందించడం జరిగిందని సాగు చేసే ప్రతి రైతుకు లబ్ధి చేకూర్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ఉంటాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కోరారు. రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసిందన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తాలు, మట్టి పెల్లలు లేకుండా వడ్లు ఆరబెట్టుకుని తీసుకువచ్చి ప్రభుత్వం అందించే ఏ గ్రేడ్ రకం రూ.2,320 మద్దతు ధర పొందాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న ,సొసైటీ వైస్ చైర్మన్ మోడెం శ్రీలత, గ్రామ శాఖ అధ్యక్షులు కేశమల్ల వెంకన్న ,మండల పార్టీ ఉపాధ్యక్షుడు మారగాని వెంకటయ్య, డైరెక్టర్ భిక్షం రెడ్డి, గౌతమ్ రెడ్డి ,వెంకట్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జటంగి అనిత లింగయ్య, కలకోట్ల మల్లేష్ ,కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు జటంగి మహేందర్ ,బండారు సావిత్రమ్మ ,ప్రవీణ్ రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- ప్రజల అవసరాలకుఅనుగుణంగా పనిచేయాలి
- అసాంఘిక కార్యక్రమాలపై నిరంతరం నిఘా పెట్టాలి
- పేట పట్టణ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పి



**సూర్యాపేట, ఏప్రిల్ 15 (మనం ప్రతినిధి):** విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు.

మంగళవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసినారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్ సెంటర్ ను పరిశీలించి ఫిర్యాదుల నిర్వహణను తనిఖీ చేసినారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఫిర్యాదును రిజిస్టర్ నందు నమోదు చేయాలి అన్ని సూచించారు. ఫిర్యాదుదారలతో గౌరవంగా, మర్యాదగా నడుచుకుంటూ వారికి పోలీసు సేవలపట్ల నమ్మకం కలిగేలా త్వరితగతిన ప్రాథమిక దర్యాప్తు పూర్తిచేసి బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ నిర్వహణ, వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలు ఇతర సామాగ్రి తో పాటు.సిసి.కెమెరా కంట్రోల్ సెంటర్ ను పరిశీలించారు, పట్టణంలో సి సి కెమెరాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలి అన్ని కెమెరాల యొక్క ఉపయోగం ప్రజలకు వివరించాలని తెలిపారు. రౌడీ షీటర్స్ పై, ల్యాండ్ గ్రాబర్స్ పై నిఘా ఉంచాలి ఇలాంటి వారి నుండి ప్రజలకు ఇబ్బందులు కలిగినట్లు పిర్యాదులు వస్తే వ్యక్తులు ఎంతటివారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు, అలవాటుగా నేరాలకు పాల్పడే వారిపై, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచాలని జిల్లా కేంద్రంలో పెరుగుతున్న ప్రజల రద్దీ వాహనాల రద్దీ దృష్ట్యా పోలీస్ శాఖ అత్యంత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వెల్లడించారు .వాహనాలు నడుపుతూ ఇతరులను ఇబ్బందులకు గురి చేసే విధంగా పెద్ద శబ్దాలతో వాహనాలు నడిపే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని వాహనాలు సైతం సీజ్ చేయాలని పట్టణంలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పల్పడేవారిపై, బహిరంగంగా మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలి ఆదేశించారు రాత్రిళ్ళు పెట్రోలింగ్ నిర్వహిస్తూ కొత్త వ్యక్తులు, అనుమానస్పద వ్యక్తుల కదలికలు గమనించాలని జాతీయరహదారి వెంట ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆపితే ఎన్ఫోర్స్మెంట్ కేసులు చేయాలని పేర్కొన్నారు. పోలీసు సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు, ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియపరచాలి, అందరూ కలిసి పని చేయాలని అన్నారు.ఎస్పి వెంట పట్టణ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, ఎస్సైలు ఆంజనేయులు, సైదులు, ప్రవీణ్, ఏడుకొండలు, సిబ్బంది ఉన్నారు.

## చలో వరంగల్ సభను విజయవంతం చేయండి

**త్రిపురారం, ఏప్రిల్ 15 మనం న్యూస్:** ఈ నెల 27 న వరంగల్ ఎల్కతుర్తి లో జరగబోయే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరుతూ త్రిపురారం మండల కేంద్రంలో గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర ట్రై కార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ వరంగల్ సభకు నియోజకవర్గం నుండి వేలాది గా తరలివెళ్తామని, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడానికి సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా ట్రై కార్ మాజీ చైర్మన్ రాంచందర్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ పామోజు వెంకటాచారి, త్రిపురారం ఫ్యాక్స్ చైర్మన్ జయరాం నాయక్, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి,మాజీ మార్కెట్ చైర్మన్



కామెర్ల జానయ్య, పెద్దదేవులపల్లి ఫ్యాక్స్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి రాయన బోయిన వెంకటేశ్వర్లు యాదవ్, టిఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు బైరం కృష్ణ, మడుపు వెంకటేశ్వర్లు, కొనకంచి సత్యం మాజీ సర్పంచ్ ధనావత్ సుశీల్ నాయక్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు దస్తగిరి, మాజీ ఎంపిటిసి రవి నాయక్,అనుముల శ్యాంసుందర్ రెడ్డి, నగరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు తిక్కన బోయిన నాగరాజు యాదవ్, కాసిం, సీనియర్ నాయకులు సీతారాం నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు భీష్మ చారి, మోహన్ లాల్ నాయక్, మరియు నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి రెవిన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**సూర్యాపేట, ఏప్రిల్ 15 (మనం ప్రతినిధి):** భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పనకు అన్ని మండలాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయంలో భూ భారతి నూతన రెవెన్యూ చట్టం పై జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూల్ రూపకల్పనతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్లను ఆదేశించడం జరిగింది. రాష్ట్రంలో భూభారతి చట్టాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి రోజు నుండి మొదలు పెట్టడం జరిగిందని రెవెన్యూ సిబ్బంది



అందరికీ ఈ చట్టంపై పూర్తి అవగాహన ఉండాలని ప్రతి రోజు ఒక 30 నిమిషాలు భూభారతి పోర్టల్ లో పొందుపరిచిన విషయాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి చట్టం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు అందచేయాలని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలపై సమగ్రమైన నోట్స్ తయారు చేయాలని ఆయన స్పష్టం చేశారు. నూతన చట్టం ప్రకారం మాత్రమే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, సక్సేషన్లు, సాదా బైనామ చేయాలని తెలిపారు. భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై రెవెన్యూ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. భూ సమస్యల పరిష్కారం కొరకు వచ్చే ప్రజలతో గౌరవప్రదంగా వ్యవహరించాలని, ప్రజల సమస్యలను సావధానంగా విని పరిష్కారానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని పైలెట్ ప్రాజెక్ట్ క్రింద ములుగు, ఖమ్మం నారాయణపేట, కామారెడ్డిలలో ఒక్కొక్క మండలాన్ని ఎంపిక చేసిందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజల నుండి వచ్చే సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సి ఉంటుందని పేర్కొన్నారు.వేసవి దృష్ట్యా అవగాహన సదస్సులు నిర్వహణ లో అన్ని జాగ్రత్తలు పాటించాలని తాసిల్దార్ లు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించాలని ఇతర రాష్ట్రాల నుండి సన్న వడ్లు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. తాసిల్దార్లు కుల ఆదాయ ముద్రీకరణ పత్రాలను వేంటనె ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన జూనియర్ అసిస్టెంట్లు బాగా పనిచేయాలని అందరూ యువకులే కావున రెవెన్యూ అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు ఈ సమావేశంలో సూర్యపేట ఆర్డీవో

వేణుమాధవరావు, కోదాడ సూర్యనారాయణ, హుజూర్నగర్ శ్రీనివాసులు, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, సూపర్డెంట్లు సాయి గౌడ్, శ్రీనివాసరాజు, తహసిల్దారులు, డిప్యూటీ తాసిల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి

**వలిగొండ, ఏప్రిల్ 15 (మనం న్యూస్):** బిఆర్ఎస్ యోజన విభాగం ఆధ్వర్యంలో వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం శ్రీ మచ్చగిరి లక్ష్మీనరసింహస్వామి కొండ నుండి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పాదాల వరకు బి ఆర్ ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రను మంగళవారం సూర్యపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి గుంట కండ్ల జగదీశ్వర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈనెల 27న జరగనున్న బిఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు విజయవంతం కావాలని ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారు ఇచ్చిన హామీలు నేటి కూడా అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు తప్ప వారు ఒరగబెట్టింది ఏమీ లేదని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుంటే అణచివేత చర్యలకు పాల్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికీ కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారని, మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమే రావాలని, అన్యవర్గాల ప్రజలు కోరుకుంటున్నారని, మళ్ళీ అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీయే అని ఆయన స్పష్టం చేశారు. ఈనెల 27న జరగనున్న పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా యువజన విభాగం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మునుగోడు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యేలు పైల శేఖర్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, గాదరి కిషోర్, నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, బూడిది బిక్షమయ్య గౌడ్, క్యామ మల్లేశం, గొంగిడి మహేందర్ రెడ్డి, పైల రాజా వర్ధన్ రెడ్డి, మొగుళ్ళ శ్రీనివాస్ గౌడ్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి, యూనివర్సిటీ ఉద్యమ నాయకులు వల్లమల్ల కృష్ణ, వలిగొండ పట్టణ అధ్యక్షుడు అప్రోజ్, మాజీ మండల అధ్యక్షుడు డేగల పాండరి, మార్కెట్ మాజీ చైర్మన్ కోనపురి కవిత, రైతు సమన్వయ సమితి మాజీ మండల కోఆర్డినేటర్ పడమటి మమత నరేందర్ రెడ్డి, విద్యార్థి యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.




# సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం : సిడిపిఓ చంద్రకళ

**వేములపల్లి, ఏప్రిల్ 15( మనం న్యూస్):** సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొంద వచ్చని సిడిపిఓ చంద్రకళ అన్నారు. దామచర్ల ప్రాజెక్టు పరిధిలోని వేములపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోని బాలబాలికలతో పాటు గర్భిణి బాలింత స్త్రీలకు ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్న పెద్దల మాట నెరవేరాలంటే కిశోర ప్రాయంలోని బాలబాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి యువత జంక్ ఫుడ్ లకు అలవాటు పడ్డారని నాటి తాతల తరంలో మిల్లెట్లు చిరుధాన్యాలు తినేవారని వాటిని తినడం వారు సంపూర్ణ ఆరోగ్యంతో చాలాకాలం జీవించేవారని పేర్కొన్నారు.



నేడు డయాబెటిస్ వంటి రోగాల బారిన పడుతున్నారని ఆహారం విషయంలో తగు శ్రద్ధ పాటించినట్లయితే బిపి షుగర్లతోపాటు పలు రకాల వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు అన్నారు. ప్రతిరోజు ఆకుకూరలతో పాటు చిరుధాన్యాలు తృణధాన్యాలు, గుడ్లువంటి వాటిని తీసుకున్నట్లయితే మంచి ఆరోగ్యంతో జీవించవచ్చన్నారు. బాలల హక్కులపై, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అనంతరం అంగన్వాడీలు, ఆరోగ్య సిబ్బంది గర్భిణీ స్త్రీలకు సీమంత కార్యక్రమం తోపాటు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, హై స్కూల్ ఇన్చార్జి హెచ్ఎం, అంగన్వాడి సూపర్వైజర్ రజని, ఏపిఎం నిజాముద్దీన్, హెల్త్ సూపర్వైజర్ శాంతా కుమారి, రెండవ ఏఎన్ఎం పుట్టల శైలజ, కవిత, అంగన్వాడీ టీచర్లు రోజా, జయమ్మ, శోభారాణి, శశికళ, రజిత, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలి...

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్...

**భువనగిరి, ఏప్రిల్ 15 (మనం న్యూస్):** ప్రతి గ్రామంలో తిరుగుతూ ప్రజల యొక్క సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి తాగునీటి సమస్య, ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోవు మే, జూన్ మాసాలు వేసవి సీజన్ దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా గ్రామాలలో పరిశీలన చేయాలని సూచించారు. అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితిని నిరంతరం గ్రామాలలో ప్రజలతో సమీక్షించాలని అన్నారు. చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు జరిపించాలని, అవసరమైన చోట ముందస్తు మంచి నీటి బోర్ వెల్స్ ను, హైర్ బోర్ వేల్ ను ముందుగానే 2 ఆల్టర్నేట్ ఏర్పాటు చేసుకొని అవసరాన్ని బట్టి బోర్లు వేసి మోటర్లు ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ ద్వారా నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ముందు ముందు ఎండలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి తగు ఏర్పాట్లు చేసుకోవాలి తెలిపారు. ఏ గ్రామంలోనైనా నీటి సమస్య ఉంటే సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని లేనిచో కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అవసరమైతే పల్లె నిద్ర చేసి గ్రామాలలో తిరిగి ప్రజల యొక్క సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు.

తదుపరి ఇందిరమ్మ ఇండ్ల గురించి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించి మాట్లాడుతూ పూరి గుడిసె పై కప్పు సరిగ్గా లేని అర్హులైన నిరు పేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించించారు. ఎటువంటి పైరవీలకు తావు లేకుండా



పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్వహించాలని ఎల్-1,ఎల్-2,ఎల్-3 జాబితాలోని కుటుంబ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్హులైన నిరు పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లను అందించే విధంగా కృషి చేయాలన్నారు. అప్లై చేసుకున్న దరఖాస్తులను పూర్తి స్థాయిలో లోతుగా పరిశీలించాలన్నారు. అట్టి లబ్ధిదారుల జాబితా కమిటీ ఆమోదం తదుపరి సంబంధిత స్పెషల్ ఆఫీసర్ వెరిఫికేషన్ చేసి ఎల్1 ద్వారా ఆలేరు, భువనగిరి శాసన సభ్యుల సమక్షంలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను సంబంధిత ఇంచార్జీ శాఖ మంత్రి అనుమతితో అందజేయడం జరుగుతుందని తెలిపారు. తదుపరి ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై రెవెన్యూ అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం, రైతుల మేలు కోసం ప్రజా పాలనలో చారిత్రక మార్పు తేవడానికి కొత్త ఆర్ఓఆర్ చట్టం ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ధరణి సమస్యలు పరిష్కారంకు భూమి ఉన్న ప్రతి మనిషికి ఆధార్ మాదిరిగానే భూధర్ కార్డులు ప్రభుత్వం అందిస్తున్నారు. ప్రభుత్వం ఇంప్లిమెంట్ చేసిన ఈ యాక్ట్ ను ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏప్రిల్ 17 నుండి 30 వరకు గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని, ప్రజలకు అర్థం అయ్యేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్, కర పత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్క గ్రామ సమావేశం దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, సమావేశాలు నిర్వహించి, ప్రజల యొక్క భూ సమస్యలు

తెలుసుకుని సులభతరంగా పరిష్కరించేందుకు ఈ యాక్ట్ ఉపయోగపడుతుందన్నారు. రెవిన్యూ సిబ్బంది, అధికారులు భూభారతి కార్యక్రమంలో నిమగ్నమై ప్రజలకు భూ సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. ప్రజలకు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన భూ భారతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు.

అనంతరం సంబంధిత తాసిల్దార్లతో పెండింగ్ ఉన్న రేషన్ కార్డులు, కుల ధృవీకరణ, ఆదాయ ధృవీకరణ వంటివి మీసేవ ద్వారా వచ్చినవి ఎప్పటికప్పుడు వెరిఫికేషన్ చేసి పెండింగ్ లేకుండా దరఖాస్తుదారులకు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆన్లైన్లో దరఖాస్తు చేసిన ప్రతి లబ్ధిదారులు సంబంధిత ఎంపీడీవో, మున్సిపాలిటీలలో దరఖాస్తులు అందజేయాలని, దరఖాస్తు లేని లబ్ధిదారునికి సంబంధిత అధికారులు ఫోన్ చేసి దరఖాస్తు సమర్పించాలని లేనిచో రాయితీ వర్తింపజేయమని సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి, భువనగిరి చౌటుప్పల్ ఆర్డీవోలు కృష్ణారెడ్డి శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, ఎస్.ఈ ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఈ.ఈ కరుణాకర్, జిల్లాలోని తహసిల్దారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీ ఓలు, హౌసింగ్ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల త్రాగునీటి కష్టాలు తీర్చిన బండి సంజయ్

**మల్యాల, ఏప్రిల్ 15, (మనం న్యూస్):** వేసవి కాలం దృష్ట్యా మల్యాల మండలంలోని పలు గ్రామాలలోని ప్రజల దాహార్తి తీర్చేందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన స్వంత నిధులతో బోరు బావులు వేయించినట్లు జిల్లా బీజేపి ఉపాధ్యక్షులు బింగి వేణు, మాజీ ఎంపీటీసీ సంగని రవి పేర్కొన్నారు. మండలంలోని బల్వంతపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బోర్ వెల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన స్వంత నిధులతో మల్యాల మండల పరిధిలోని నీటి సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాలైన బల్వంతపూర్, మద్దుట్ల, గొల్లపల్లి, తాటిపల్లి నాలుగు గ్రామాలలో బోర్ వెల్ మంజూరు చేశారని వారు పేర్కొన్నారు. కాగా



బల్వంతపూర్ ప్రభుత్వ పాఠశాలలో, గొల్లపల్లి గ్రామంలో మంగళవారం బోర్ బావి వేయించినట్లు వారు పేర్కొన్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు బోరుబావి కోసం నిధులు మంజూరు చేయుటకు చొరవ చూపిన బండి సంజయ్ కి మండల బీజేపి అధ్యక్షులు గాజుల మల్లేశం గ్రామ ప్రజల తరపున బండి సంజయ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బలవంతపూర్ పంచాయతీ కార్యదర్శి కవిత, మండల విద్యాధికారి జయసింహ రావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాం సుందర్, దొడ్డి హరీశ్, ఎన్నం చంద్ర శేఖర్, మల్లేశం, పిల్లి రాజశేఖర్, కెల్లేటి రమేష్, నులుగొండ సురేష్, గడ్డం చిన్న మల్లేశం, గడ్డం నడిపి మల్లేశం, గడ్డం నాగరాజ్, బొమ్మన పరమేష్, పాల్గొన్నారు.

# మంచి నీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించాలి

- మున్సిపల్ కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్
- మున్సిపల్ సమీక్షా సమావేశం

**కరీంనగర్ టౌన్,ఏప్రిల్15( మనంన్యూస్) :** మంచి నీటి సరఫరా పై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగరంలోని వివిధ గ్రాంట్ల పెండింగ్ అభివృద్ధి

పనులు మరియు సమస్యలు, మంచి నీటి సరఫరా, వీది దిపాల నిర్వాహణ, బయో గ్యాస్ ప్లాంట్ తదితర అంశాల పై



అధికారులతో చర్చించి...పనుల పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులకు సలహాలు సూచనలు చేస్తూఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ.. బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం కోసం కావల్సిన ప్రణాళికలు సిద్దం చేసి టెండర్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని వివిధ పెండింగ్ అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉంటే వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎంఏ గ్రాంట్ లో చిన్న చిన్న క్రిటికల్ గ్యాబ్స్ సమస్యలు ఉంటే వాటిని త్వరగా పరిష్కరించి ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరారు. నగరపాలక సంస్థ పరిదిలోని కొత్త విలీన గ్రామాలతో సహా మంచి నీటి సరఫరా పై ఈఈ, డీఈ, ఏఈ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజలకు త్రాగు నీటి సరఫరా లో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. విలీన గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా పై ప్రజల నుండి చాలా ఫిర్యాదులు వస్తున్నాయని సంబంధిత సమస్యను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీస్కోవాలన్నారు. భగీరథ విభాగం అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో డీఈ ఏఈ స్థాయి అధికారులు సప్లై పై పర్యవేక్షణ చేయాలని... సమస్యలు దృష్టికి వస్తే వెంటనె పరిష్కరించేలా చర్యలు తీస్కోవాలన్నారు. నీరు సరఫరా కానీ ప్రాంతాలు ఏమైన ఉంటే ట్యాంకర్స్ ద్వారా నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీది దీపాల నిర్వాహణ సంక్రమంగా చేపట్టాలని అన్నారు. నగర వ్యాప్తంగా ఎక్కడ లైట్ల సమస్య రాకుండ చూడాలని వారు. ఎక్కడైన లైటింగ్ సమస్యలు ఉంటే వాటిని మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. సీసీ ఎం ఎస్ బాక్స్ లలో వీది దీపాల సమయ వేలలను మార్చాలని కోరారు. నగరంలోని ప్రధాన స్టాంవాటర్ డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపుకు చర్యలు చేపట్టాలని వెంటనే డీ సిల్టింగ్ ప్రక్రియకు టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈలు యాదగిరి, సంజీవ్, డీఈలు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఓం ప్రకాష్, ఏఈలు సతీష్, గట్టు స్వామీ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్ధిదారులకు వేగంగా సేవలందించాలి

- వేసవి నేపథ్యంలో ప్రజలకు త్రాగునీరు సరఫరాలో ఆటంకం కలగకుండా చూసుకోవాలి
- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**మహబూబాబాద్,ఏప్రిల్ 15 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అని నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ తదితర యువకులకు ఉపాధి కల్పన నిమిత్తం ఈ పథకం ప్రవేశ పెట్టడం జరిగిందని, ప్రభుత్వ సూచించిన లక్ష్యాల ప్రకారం లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకం ఇబ్బందులు లేకుండా రుణ సదుపాయం కల్పించాలని కలెక్టర్ కోరారు.మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లాలోనీ బ్యాంకర్స్ ,సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులైన లబ్ధిదారులకు లక్ష్యాల ప్రకారం రుణాలు అందించాలని సూచించారు. దివ్యాంగులకు ఐదు శాతం అవకాశం కల్పించాలని, ప్రభుత్వం ఒక మంచి సదుద్దేశంతో యువత స్వయం ఆర్థిక అభివద్ధి చెందడం కోసం ఈ పథకం ప్రవేశపెట్టిందని వారికి కావలసిన సౌకర్యాలను అందించాలని తెలిపారు. రుణాలు అందించడంలో బ్యాంకర్లు లబ్ధిదారులకు సహకరించాలన్నారు.వేసవి నేపథ్యంలో జిల్లాలోని (1320), హ్యాబిటేషన్స్, మున్సిపల్ పరిధిలలో ప్రజలకు త్రాగునీరు అందించుటలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, మున్సిపల్ తదితర శాఖల సిబ్బంది సమన్వయంతో కలిసి పని



చేయాలన్నారు. ఇప్పటికే సూచించిన యాక్షన్ ప్లాన్ ప్రకారం త్రాగునీరు ఇబ్బందులు ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానిక సోర్సులను సమకూర్చుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు ప్రతినిత్యం మండలంలోని గ్రామాల స్థితిగతులు, త్రాగునీరు సరఫరా, సానిటేషన్, తనిఖీ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ తదితర మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖ అధికారులు, డీఈ లు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శి లతో ప్రజలకు త్రాగునీరు సరఫరాపై సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు,ఈ సమావేశంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, బిసి ఎస్సి ఎస్టి మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు నరసింహస్వామి, శ్రీనివాసరావు, దేశీ రామ్, శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ మూర్తి, డిపిఓ హరిప్రసాద్, డిసిఓ వెంకటేశ్వర్లు, సిపిఓ సుబ్బారావు, డివిహెచ్ఓ కిరణ్ కుమార్, డిఎస్ఓ ప్రేమ్ కుమార్, డిడి సురేష్ గ్రౌండ్ వాటర్, మిషన్ భగీరథ ఈఈ కష్ణారెడ్డి, డిఏఓ విజయనిర్మల, జిల్లాలోని మండల పరిషత్ అభివద్ధి అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల పంచాయతీ విస్తరణ అధికారులు, ఏపిఎంలు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ త్వరిత గతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, ఏప్రిల్15(మనంబ్యూరో):** జిల్లాలోని అన్ని మండలాల్లో పైలట్ గా ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక



చేసిన గ్రామాలలో కొంత మందికి ఇండ్లు మంజూరు చేశామని, మిగిలిన ఇండ్లను గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా మంజూరు చేసేందుకు అలాట్మెంట్ జాబితా తయారు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికకు కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లు ఉండటానికి వీలు లేదని, వచ్చిన దరఖాస్తులలో అత్యంత నిరుపేదలకు మాత్రమే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలలో మంజూరైన అన్ని ఇండ్లకు త్వరితగతిన 100 శాతం మార్కింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్దిదారులతో చర్చించి ఇండ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూఫ్ లెవెల్ వరకు పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్, జడ్పీ సీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భూ భారతిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ ,ఏప్రిల్15 (మనంబ్యూరో) :** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రూపొందించిన భూభారతి చట్టంపై సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన



అభిప్రాయాలను క్రోడీకరించి భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందని అన్నారు. భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.17వ తేదీ నుంచి ప్రతి మండలంలో భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ రూపకల్పన చేయాలన్నారు. ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో భూ భారతి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై రెవెన్యూ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. సదస్సుల నిర్వహణలో భాగంగా క్షేత్ర స్థాయిలో ప్రజల నుండి వచ్చే విజ్ఞప్తులను స్వీకరించాలని అన్నారు. వేసవి దృష్ట్యా అవగాహన సదస్సుల వేదికల వద్ద సరైన ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ అన్ని మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.

# భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ ,ఏప్రిల్ 15 (మనం బ్యూరో): జిల్లా కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం పై తహసీల్దార్ల తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి సంధ్యా రాణిలు పాల్గొని భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత తాసిల్దార్లను ఆదేశించడమైనది.



ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో భూభారతి పోర్టల్ నురాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ల తో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో భూభారతి చట్టం అమలు తీరు పై దిశ నిర్దేశాలని అమలుచేసే తీరును జిల్లా కలెక్టర్ ఆర్డీవోలు వివిధ మండలాల తాసిల్దార్లతో సమీక్ష నిర్వహించి ఏప్రిల్ 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ రూపకల్పనతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు.ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో భూ భారతి చట్టం హెల్ప్ లైన్ నంబర్ 04029313999 ఏర్పాటు చేసి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు అందచేయాలని సూచించారు.మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలపై సమగ్రమైన నోట్స్ తయారు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.భూ భారతి నూతన చట్టం ప్రకారం మాత్రమే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, సక్సేషన్లు, సాదా బైనామ చేయాలని తెలిపారు.భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై రెవెన్యూ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు.భూ భారతి చట్టాన్ని జిల్లాలోని మండలాన్ని ఒక పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రణాళిక సిద్ధం చేయాలని సంబందిత తహసీల్దార్లను ఆదేశించారు.భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పనకు జిల్లాలోని తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులచే విస్తృతంగా ప్రచారం చేయించాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని ఆదేశించడమైనది. క్షేత్ర స్థాయిలో ప్రజల నుండి వచ్చే సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సి ఉంటుందని తెలిపారు. వేసవి దృష్ట్యా అవగాహన సదస్సులు నిర్వహణ లో అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి నర్సంపేట ఉమారాణి, సంబంధిత మండలాల తాసిల్దారులు కలెక్టరేట్ సూపర్డెంట్లు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పై సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్

**వరంగల్ , ఏప్రిల్ 14 (మనం ప్రతినిధి):** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఎంపీడీవోల తో నిర్వహించిన వేసవి నీటి ఎద్దడి నివారణ మరియు ఇందిరమ్మ ఇండ్ల పై నిర్వహించిన సమీక్ష



సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి లు పాల్గొని సమీక్షించడమైనది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెరుగుతున్న ఎండ తీవ్రతకు గ్రామాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చేసిన చలి కేంద్రాల్లో శుభ్రత పాటించాలని సూచించారు. రానున్న రోజుల్లో ఏప్రిల్ 30 నుంచి మే 31 వరకు వాతావరణ పరిస్థితుల లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున భూగర్భ జలాలు ఇంకిపోయే సమస్యవలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించడమైనది.గతంలో నీటి ఎద్దడి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి సమస్య పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎంపీడీవోలు స్వయంగా గ్రామాలను సందర్శించి ప్రజలకు ఎలాంటి సమస్య రాకుండా చూసుకోవలసిన ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రభుత్వ నిబంధనల మేరకు నియోజక వర్గాలవారిగా ఇందిరమ్మ కమిటీ లు ఎంపిక చేసిన లబ్ధిదార్ల జాబితాను మండల స్థాయి అధికారులు మరొక్కసారి స్క్రూటీని చేయాలని అధికారులను న ఆదేశించడమైనది.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, సి ఈ ఓ రాంరెడ్డి, ఎస్ ఈ కరుణాకర్ సంబంధిత ఎంపిడివోలు సంబంధిత ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# మే 14న మిస్ వరల్ టీం రాక

- రామప్పలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- సమన్వయంతో విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**ములుగు, ఏప్రిల్ 15(మనం ప్రతినిధి):** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో వరల్ హెరిటేజ్ సైట్ రామప్పను విజిట్ చేయడానికి మిస్ వరల్ టీం మే 14న రాబోతున్నదని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ శబరిష్ అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి రామప్పలో ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 14 వ తేదీన ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొననున్న పలు దేశాలకు చెందిన పోటీ మహిళలు జిల్లాలోని పర్యాటక ప్రాంతమైన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో వరల్ హెరిటేజ్ సైట్ రామప్పను



సందర్శించనున్న నేపథ్యంలో నేషనల్ హైవే లోని రోడ్డు పనులు మహమ్మద్ గౌస్ పల్లి నుండి జంగాలపల్లి వరకు, జంగాలపల్లి నుండి రామప్ప టెంపుల్ వరకు ఆర్ అండ్ బి రోడ్డు, రామప్ప దేవాలయం నుండి హరిత హోటల్ వరకు పంచాయతీ రాజ్ రోడ్డు, ఇంజనీరింగ్ అధికారులు ఫీల్ విజిట్ చేసి రోడ్డు మరమ్మత్తు పనులను ఈనెల 30వ తారీకు వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. పాలంపేట లోని రామప్ప దేవాలయం స్వాగత ఆర్చ్ పెయింటింగ్ చేసి సుందరికరించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. హరిత కాటేజ్ లను పెయింటింగ్ తో సుందరికరించాలని, ఈ పర్యటనకు సంబంధించి అధికారులతో వాట్సాప్ గ్రూప్ తయారుచేయాలని టూరిజం అధికారులకు సూచించారు. సంబంధిత శాఖల అధికారులు ఈ పర్యటనకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు ఫోటోలు వాట్స్ అప్ గ్రూప్లో పోస్ట్ చేయాలని త్వరలో ఫీల్ విజిట్ చేస్తానని, ప్రపంచ దేశాల పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేయాలని, సమన్వయంతో అధికారులు ఇట్టి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు, డీఎస్పీ రవీందర్, పురా వస్తు శాఖ అధికారులు, జిల్లా అధికారులు, వెంకటాపూర్ మండలాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# బంగ్లాతో వన్డే సిరీస్.. భారత కెప్టెన్ గా గిల్!



భారత పురుషుల క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ పర్యటన ఖారరైంది. ఈ ఏడాది ఆగస్టులో మూడు వన్డేలు, మూడు టీ20 సిరీస్ లలో తలపడేందుకు బంగ్లాదేశ్ కు టీమిండియా వెళ్లనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ ను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మంగళవారం విడుదల చేసింది.

ఆగస్టు 17న మిర్పూర్ వేదికగా జరగనున్న తొలి వన్డేతో టీమిండియా పర్యటన ప్రారంభం కానుంది. ఇంగ్లండ్ తో సుదీర్ఘ టెస్ట్ సిరీస్ ముగిసిన రెండు వారాలకే భారత జట్టు బంగ్లాకు పయనం కానుంది. ఈ క్రమంలో బంగ్లాతో వన్డే సిరీస్ కు కెప్టెన్ రోహిత్ శర్మతో సహా సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లి, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రాలు గైర్హాజరు అయ్యే అవకాశం ఉంది.

ఒకవేళ రోహిత్ శర్మ దూరమైతే బంగ్లాతో వన్డే సిరీస్ కు భారత జట్టు కెప్టెన్ గా శుబ్ మన్ గిల్ వ్యవహరించనున్నాడు. ఈ సిరీస్ లో గిల్ తో పాటు జైశ్వాల్, కేఎల్ రాహుల్ వంటి స్టార్ ప్లేయర్ ఆడే ఛాన్స్ ఉంది. కాగా వీరు ముగ్గురు ఇంగ్లండ్ తో టెస్టు సిరీస్ లో ఆడనున్నారు.

కానీ సెలక్టర్లు మాత్రం బంగ్లా సిరీస్ కు ఈ త్రయానికి విశ్రాంతి ఇవ్వకపోవచ్చు. అదేవిధంగా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను బంగ్లాతో టీ20 సిరీస్ లో మాత్రం ఆడేంచే అవకాశమున్నట్లు క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్లో టీ20 ఆసియా కప్-2025 జరగనుండడంతో బంగ్లా సిరీస్ లో బుమ్రా ఆడడం దాదాపుగా ఖాయం. బుమ్రా ఇటీవలే గాయం నుంచి కోలుకుని ఐపీఎల్లో ఆడుతున్నాడు.మరోవైపు ఐపీఎల్ లో దుమ్ములేపుతున్న గుజరాత్ టైటాన్స్ స్టార్ ఓపెనర్ సాయిసుదర్శన్ తిరిగి వన్డే, టీ20 జట్టులోకి రానున్నట్లు తెలుస్తోంది.

# ఐపీఎల్లో బ్యాట్ల తనిఖీ!

ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా అంపైర్లు.. బ్యాట్లు నిర్దేశిత కొలతల ప్రకారం ఉన్నాయో లేదో తనిఖీ చేయడం మొదలు పెట్టారు. బ్యాటర్లు అవాంఛిత ప్రయోజనం పొందకుండా అడ్డుకోవాలన్నదే ఉద్దేశం. బ్యాట్లను తనిఖీ చేయడం ఎప్పటి నుంచో ఉన్నదే. కానీ గత ఐపీఎల్ వరకు అది డ్రెస్సింగ్ రూమ్ లోనే జరిగేది. ఈసారి నుంచి మైదానంలోనూ బ్యాట్లను తనిఖీ చేయడానికి అంపైర్లకు బీసీసీఐ అనుమతి ఇచ్చింది. అంపైర్లు ఓ ఇల్లు ఆకారంలో ఉన్న పరికరం సహాయంతో బ్యాట్లను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే హార్దిక్ పాండ్య, హెట్మయర్, ఫిల్ సాల్ట్ బ్యాట్లను పరిశీలించారు. మూడు బ్యాట్లూ నిబంధనల మేరకే ఉన్నట్లు తేలింది. నిబంధనల ప్రకారం బ్యాటు ముఖం 4.25 అంగుళాలు దాటకూడదు. బ్యాటు మధ్య భాగం మందం 2.64 అంగుళాల కంటే ఎక్కువ ఉండకూడదు. అంచు వెడల్పు 1.56 అంగుళాలు, బ్యాటు పొడవు (హ్యాండిల్ పైనుంచి కింది వరకు) 38 అంగుళాలు దాటకూడదు. బ్యాటు మందం కొంచెం పెరిగినా బ్యాటర్కు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. బ్యాటుకు సరిగా తగలని బంతి కూడా స్టేడియం గ్యాలరీలో ఎక్కడో పడుతుంది. ఈ ఐపీఎల్లో ఆదివారం వరకు బ్యాటర్లు 525 సిక్సు కొట్టడం విశేషం. నికోలస్ పూరన్ ఒక్కడే 31 సిక్సు బాదేశాడు.





## ధీరజ్ కు మరో పతకం

ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1లో తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్ మరో పతకం సాధించాడు. ఇప్పటికే తరుణ్దీప్ రాయ్, అతాను దాస్ లతో కలిసి పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో రజతం గెలిచిన ధీరజ్.. వ్యక్తిగత విభాగంలో కాంస్యం గెలిచాడు. 23 ఏళ్ల ధీరజ్.. కాంస్యం కోసం జరిగిన పోరులో 6-4తో ఆండ్రీస్ టెమినో (స్పెయిన్)పై విజయం సాధించాడు. మ్యాచ్ ఆరంభంలో 2-4తో వెనుకబడి కూడా ధీరజ్ గొప్పగా పుంజుకున్నాడు. టోర్నీలో భారత్ మొత్తం నాలుగు



పతకాలు సాధించింది. రిషబ్ యాదవ్తో కలిసి తెలుగమ్మాయి జ్యోతి సురేఖ మిక్స్డ్ కాంపౌండ్ టీమ్ స్వర్ణం గెలవగా.. పురుషుల కాంపౌండ్ టీమ్ కాంస్యం నెగ్గిన సంగతి తెలిసిందే.

# అంతా పంతే చేశాడు!

లఖ్నవూ సూపర్ జెయింట్స్ , చెన్నై సూపర్ కింగ్స్ కు మధ్య సోమవారం జరిగిన ఉత్కంఠ పోరులో ధోనీ సేన విజయం సాధించింది. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్ లో కెప్టెన్ గా అనుభవలేమితో బౌలర్ల ఎంపికలో రిషభ్ పంత్ తీసుకున్న ఓ నిర్ణయం బెడిసి కొట్టింది. చెన్నై చేతిలో లఖ్ నవూ పరాజయం పాలయ్యేలా చేసింది. చక్కగా బౌలింగ్ చేస్తున్న రవి బిష్ణోయ్ కు ఆఖరి ఓవర్లలో బంతి ఇవ్వకుండా పంత్ పేసర్ల వైపు మొగ్గు చూపాడు. ఈ వ్యూహాత్మక తప్పిదమే లఖ్ నవూ పరాజయానికి కారణమైందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. చెన్నై విజయానికి చివరి నాలుగు ఓవర్లలో 44 పరుగులు అవసరమైన వేళ క్రీజులో ఎంఎస్ ధోనీ, శివమ్ దూబే ఉన్నారు. ఈ సమయంలో కెప్టెన్ గా రిషభ్ పంత్ తీసుకున్న నిర్ణయాల్లో ఒత్తిడి, అనుభవలేమి స్పష్టంగా కనిపించింది. అప్పుడు అవేశ్ ఖాన్, శార్దూల్ ఠాకూర్ తో బౌలింగ్ వేయించాడు.



కానీ అప్పటివరకు మూడు ఓవర్లు వేసి కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు నేల కూల్చిన రవి బిష్ణోయ్ చేతికి బంతిని కూడా ఇవ్వలేదు. ఇంతకు ముందు కోల్కతా నైట్రైడర్స్తో చెన్నై సూపర్కింగ్స్కు జరిగిన మ్యాచ్లో ధోనీని కేవలం 1 పరుగుకే సునీల్ నరైన్ తన అద్భుతమైన బంతితో ఎల్బీడబ్ల్యూ చేసి పెవిలియన్కు పంపాడు. ఈ మధ్య ధోనీ పేస్ను ఆడుతున్నంత అలవోకగా స్పిన్ను ఎదుర్కోలేకపోతున్నాడు. పంత్ కనీసం ఈ విషయాన్నీ గుర్తించకుండా ఆఖర్లో పేస్ వైపే మొగ్గు చూపాడు. బంతిని రవి బిష్ణోయ్కు ఇచ్చిఉంటే మాత్రం ఏదైనా మ్యాజిక్ జరిగి ఉండేదేమో! చక్కటి రిథమ్లో బంతులు సంధించిన ఈ లెగ్ స్పిన్నర్తో పూర్తి కోటా ఓవర్లు వేయించకపోవడం నిజంగా పంత్ చేసిన పెద్ద తప్పిదమే అని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రవి బిష్ణోయ్ మాట్లాడాడు. 'డెత్ ఓవర్లలో నేను బౌలింగ్ చేస్తాను అని పంత్ను అడగలేదు. కానీ కెప్టెన్ నన్ను గమనించి బంతిని నాకు అందించాలనే ఆశతో మధ్యలో రెండుసార్లు పిచ్ వైపు వెళ్లాను. కానీ అది జరగలేదు. పంత్ వేరే ప్రణాళికలతో ఉన్నాడేమో అని అనుకున్నాను. ఇక మహీభాయ్ గురించి ప్రత్యేకంగా చెప్పేది ఏముంది?బంతి అతని రాడార్లో ఉంటే, అందులోనూ తనకు కలిసివచ్చిన రోజున అతడు ఆకాశమే హద్దుగా చెలరేగుతాడు' అని రవి బిష్ణోయ్ అన్నాడు.

# 'ఆట'ద్బాంధవుడు ధోనీకి అరుదైన రికార్డు

అభిమానులు ముద్దుగా తలా అని పిలుచుకునే ఎంఎస్ ధోనీ ఖాతాలో మరో రికార్డు వచ్చి చేరింది. ఐపీఎల్ 2025 సీజన్ లో భాగంగా సోమవారం లఖ్ నవూ సూపర్ జెయింట్స్ తో చెన్నై సూపర్ కింగ్స్ కు మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన లఖ్ నవూ 20 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. తర్వాత ఛేదన ప్రారంభించిన చెన్నై సూపర్ కింగ్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఇలా లఖ్ నవూ సూపర్ జెయింట్స్పై చెన్నై సూపర్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపులో ధోనీ కీలకపాత్ర పోషించాడు. తన ధనాధన్ బ్యాటింగ్ తో కేవలం 11 బంతుల్లో 26 పరుగులు చేసి ఔరా అనిపించాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ తో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ఐపీఎల్లో 11 సంవత్సరాల రికార్డును తిరగరాశాడు. ధోనీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును 43 సంవత్సరాల 280 రోజుల్లో గెలుచుకొని రికార్డు సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలో ఈ అవార్డు గెలుచుకున్న అతిపెద్ద వయస్కుడిగా నిలిచాడు. ఇంతకుముందు ఈ రికార్డు ప్రవీణ్ తాంబే పేరిట ఉండేది. అతడు 2014 ఐపీఎల్ సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ కోల్కతా నైట్రైడర్స్ పై 42 సంవత్సరాల 208 రోజుల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు.



'మా బౌలింగ్, బ్యాటింగ్ విభాగాలు చక్కగా ఆడాయి. మంచి ఆరంభం లభిస్తే ఛేదన సులభమవుతుంది. ఓపెనర్ షేక్ రషీద్ అద్భుతంగా ఆడాడు. అతడు మరిన్ని సంవత్సరాలు మా టీమ్లో భాగమవుతాడు. రషీద్ నెట్స్లో అటు స్పిన్నర్లు, ఇటు పేస్ బౌలింగ్లోనూ చక్కగా ఆడాడు. ఇది కేవలం ప్రారంభం మాత్రమే. రషీద్లో చాలా టాలెంట్ ఉంది. అతడు అటాకింగ్గా, సాధికారికంగా ఆడగలడు. నిజానికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అఫ్గాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్ కు దక్కాలి. వాస్తవానికి నా కన్నా ఈ అవార్డుకు అతడే అర్హుడు. నూర్ అహ్మద్ చాలా చక్కగా బౌలింగ్ చేశాడు' అని ధోనీ... మ్యాచ్ అనంతరం ప్రజెంటేషన్ సెర్మనీలో మాట్లాడారు.

# SSMB29 షూటింగ్ షురూ!

ప్రస్తుతం సినీ ప్రియులంతా ఎదురుచూస్తోన్న ప్రాజెక్ట్ SSMB29. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం సెట్స్ పై ఉంది. ఇటీవలే ఓ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. దీని తర్వాత టీమ్ విరామం తీసుకుంది. మహేశ్ , రాజమౌళి ఇద్దరూ విదేశాలకు వెళ్లారు. అలాగే ప్రియాంక కూడా ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు.

తాజాగా మహేశ్ బాబు ఇటలీ వెకేషన్ నుంచి తిరిగి వచ్చారు. కుటుంబంతో కలిసి రోమ్ కు వెళ్లిన ఆయన ఈరోజు ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. విమానాశ్రయంలో అభిమానులతో కలిసి ఫొటోలు దిగారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక రాజమౌళి కూడా ఇటీవలే జపాన్ వెళ్లారు. 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' డాక్యుమెంటరీ ప్రచారం కోసం కుటుంబసమేతంగా జపాన్ వెళ్లారు. ఆయన కూడా వచ్చాక ఈ సినిమా మరో షెడ్యూల్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఒడిశాలో ఈ సినిమా ఓ షెడ్యూల్ పూర్తిచేసుకొంది. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్ సీల్, బాల్డ ప్రాంతాల్లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మహేశ్ తో పాటు పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా తదితరులు ఈ షూటింగ్ లో పాల్గొన్నారు.



# ట్రైలర్ తో రిలీజ్ డేట్ కూడా ఇచ్చేసిన 'డిఫరెంట్'

నటీనటులు జి. ఎన్.నాష్, అజీజ చీమరువ, ప్రట్టీ జో, సన, రోబర్ట్ ప్రధాన పాత్రల్లో వండర్ బ్రదర్స్ ఇంటర్నేషనల్ ఫిలిమ్స్ ప్రవేట్ లిమిటెడ్ బ్యానర్ లో తెరకెక్కించిన లేటెస్ట్ చిత్రమే 'డిఫరెంట్'. ఎన్.ఎస్.వి.డి శంకరరావు నిర్మాతగా డ్రాగన్ (ఉదయ భాస్కర్) దర్శకత్వంలో లియోన్ ఆర్ భాస్కర్ కెమెరామెన్ గా చేస్తున్నా ఈ సినిమాకు నిహల్ సంగీతం అందించారు.

లేటెస్ట్ గా ఈ సినిమా ట్రైలర్ ను మేకర్స్ విడుదల చేశారు. ఒక సస్పెన్స్ థ్రిల్లర్ జోనల్ లో కూడిన ఈ సినిమాని ఈ ఏప్రిల్ 18నే




థియేటర్స్ లో విడుదల చేస్తున్నట్టుగా కూడా రివీల్ చేశారు. తెలుగు నిర్మాత ఎన్.ఎస్.వి.డి శంకర్రావు చేసిన ఈ హాలీవుడ్ చిత్రం డిఫరెంట్. మంచి సినిమాలు చెయ్యాలనే ఆలోచనతో ఈ ప్రాజెక్ట్ స్టార్ట్ చెయ్యడం జరిగింది.

కథ, కంటెంట్ బాగుంటే ఏ సినిమా అయినా సరే ప్రేక్షకులు ఆధరిస్తారు, అదే తరహాలో ఈ డిఫరెంట్ సినిమా రాబోతోంది. ఏప్రిల్ 18న విడుదల కాబోతున్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుందని చిత్ర యూనిట్ నమ్మకంగా ఉంది. ఎస్ కే ఎమ్ ఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా ఏప్రిల్ 18 వ తారీఖున ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతుంది.

# దే'వర' 2 పై ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇచ్చిన కళ్యాణ్.!

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన భారీ చిత్రం దేవర కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రంకి సీక్వెల్ గా దే'వర' 2 ఖచ్చితంగా ఉందని ఎన్టీఆర్ ఈ మధ్య జపాన్ లో కన్ఫర్మ్ చేసేసారు. ఇక ఈ తర్వాత ఈ సినిమాకి నిర్మాతల్లో ఒకరైన ఎన్టీఆర్ అన్న నందమూరి కళ్యాణ్ రామ్ లేటెస్ట్ గా ఇచ్చిన అప్డేట్ వైరల్ గా మారింది.

కళ్యాణ్ రామ్ నటించిన అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా ప్రమోషన్స్ లో భాగంగా దేవర 2 ప్రశాంత్ నీల్ తో సినిమా తర్వాత ఉంటుంది అని కన్ఫర్మ్ చేశారు. అలాగే



నరేషన్ కూడా ఇవ్వడం జరిగింది అంటూ దేవర 2 పై ఇంట్రెస్టింగ్ క్లారిటీని కళ్యాణ్ రామ్ అందించాడు. దీనితో ఈ భారీ సీక్వెల్ పై అప్డేట్ వైరల్ గా మారింది. ఇక కళ్యాణ్ రామ్ సన్నాఫ్ వైజయంతి చిత్రం ఈ ఏప్రిల్ 18న రిలీజ్ కి రాబోతుంది.

# రాజమౌళి 'సూపర్' ప్లాన్?

గ్లోబల్ దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి అలాగే సూపర్ స్టార్ మహేష్ బాబు కలయికలో చేస్తున్న సెన్సేషనల్ ప్రాజెక్ట్ కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రం మహేష్ బాబు కెరీర్లో 29వ సినిమాగా చేస్తుండగా అంచనాలు ఈ సినిమా పట్ల ఆకాశంలో ఉన్నాయి. అయితే ఈ సినిమా జక్కన్న నుంచి గత సినిమాల్లా కాకుండా చాలా సైలెంట్ గా భారీ సెట్టింగ్స్ నడుమ చకచకా షూటింగ్ జరిగిపోతుంది. అయితే ఈ చిత్రం నుంచి ఒక సాలిడ్ ట్రీట్ లాంటిది కావాలని ఎప్పుడు నుంచో మహేష్ అభిమానులు కోరుకుంటున్నారు. సినిమా అనౌన్సమెంట్ పై కూడా ఎలాంటి అధికారిక అప్డేట్ ఇవ్వకపోవడంతో చాలా అప్డేట్స్ పెండింగ్ లో పడ్డాయి. అయితే ఓ క్రేజీ బజ్ ఇపుడు ఈ సెన్సేషనల్ ప్రాజెక్ట్ పై వినిపిస్తుంది.

మేకర్స్ ఓ స్టన్నింగ్ గ్లింప్స్ లాంటిది ఒకదాన్ని రాజమౌళి గ్రాండ్ విజన్ తో ప్లాన్ చేస్తున్నట్టుగా ఇపుడు టాక్ వినిపిస్తుంది. ప్రస్తుతం మేకర్స్ ఈ పనిలోనే ఉన్నట్టుగా తెలుస్తుంది. ఒకసారి ఇది పూర్తయ్యాక అనౌన్సమెంట్ ఎప్పుడు ఏంటి అనేది ఓ క్లారిటీ రానున్నట్టుగా ఇపుడు టాక్. మరి దీనిపై మరిన్ని డీటెయిల్స్ ఇంకా బయటకి రావాల్సి ఉంది

# 'పెద్ది'లో ఈ సీక్వెన్స్ నెక్స్ట్ లెవెల్లో ఉండనుందట!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'పెద్ది' ఇప్పటికే ఎలాంటి సాలిడ్ బజ్ క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తుండగా రూరల్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇక ఈ సినిమాలో రామ్ చరణ్ రఫ్ లుక్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంది. ఇప్పటికే రిలీజ్ అయిన గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను కూడా పెంచేసింది.

అయితే, ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించి సినీ సర్కిల్స్ లో ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ వినిపిస్తోంది. ఈ సినిమాను బుచ్చిబాబు అనుకున్నదానికంటే ముందుగానే పూర్తి చేసే పనిలో ఉన్నాడట. ఆగస్టులోపు ఈ సినిమాలో రామ్ చరణ్ షూటింగ్ ముగించేస్తాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి ఓ హై వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్ తెరకెక్కిస్తున్నారట. ఓ రైల్వే స్టేషన్ లో జరిగే ఈ యాక్షన్ సీక్వెన్స్ నెక్స్ట్ లెవెల్ లో ఉండనుందని.. ఈ సినిమాకే హైలైట్ సీక్వెన్స్ గా దీనిని చిత్రీకరిస్తున్నారట.



ఇక ఈ సినిమాలో అందాల భామ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా.. కన్నడ స్టార్ హీరో శివ రాజ్ కుమార్, జగపతి బాబు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఏఆర్.రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం విశేషం.

# చిరంజీవి - అనిల్ రావిపూడి సినిమాలో వెంకటేశ్

'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ ఈ ముగ్గుల పండగ బరిలో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు కథానాయకుడు వెంకటేశ్. ఇప్పుడాయన వచ్చే సంక్రాంతికి చిరంజీవితో కలిసి థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరు కథానాయకుడిగా ఓ సినిమా ముస్తాబవుతున్న సంగతి తెలిసిందే. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వినోదంతో పాటు బలమైన భావోద్వేగాలు నిండిన యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ చిత్రం (ఖ్జ 157) రూపొందనుంది. ఇందులో వెంకటేశ్ ఓ ముఖ్య పాత్రధారిగా చిరంజీవితో కలిసి సందడి చేయనున్నారని సమాచారం. దీంట్లో ఆయనది అతిథి పాత్రేం కాదని.. చాలా ప్రాధాన్యమున్న పాత్రని తెలిసింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా జూన్ నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకునే అవకాశముంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసి రోలియో, ఛాయాగ్రహణం: సమీర్ రెడ్డి.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.